
'అవినీతి, అసత్య వార్తలు
క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 274

సోమవారం 25-12-2023



పాఠకులు, ఏజెంట్లు,
ప్రకటనకర్తలు,
శ్రేయోభిలాషులకు
సాక్షి
క్రిస్మస్
శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం

బారాముల్లా జిల్లాలోని షేరీ ప్రాంతంలోని మసీదులో ప్రార్థన చేస్తుండగా మాజీ పోలీసు అధికారిని ఉగ్రవాదులు హత్య చేశారు.

వివరాలు 6లో ▸



అవినీతికి దూరంగా ఉండండి

అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని అధికార కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా నేతలకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సూచించారు.

వివరాలు 6లో ▸



వికసిత్ భారత్‌ను నిజం చేయండి

యువతలో అద్భుత ప్రతిభ దాగి ఉందని, అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఆవిర్భవించేలా కృషి చేయాలని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



ఆ విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారు

తాను దేశ ద్రోహినో, దేశ భక్తుడినో ఓటర్లే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నిర్ణయిస్తారని బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహ వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ▸

పైత్యం దాటి పైశాచికం

జనం మెచ్చిన జగన్ పాలనపై అసూయతో రగిలిపోతున్న రామోజీ

పరిపాలనకు మానవీయ కోణం.. జనంతో నిరంతరం జగన్ మమేకం

- నేను విన్నాను.. ఉన్నానంటూ ప్రతిపక్ష నేతగా నాడు ప్రజలకు భరోసా.. మాటకు కట్టుబడి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నేడు పరిపాలన
- సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో సీఎం జగన్
- బాధితులు చెయ్యెత్తితే చాలు.. పిలిచి సమస్య పరిష్కరిస్తున్న సీఎం జగన్
- అనారోగ్య బాధితులకు వెంటనే ఆర్థిక సాయం.. ఆపై ఉన్నత వైద్యం
- అర్హతే ప్రామాణికంగా వివక్ష లేకుండా అందరికీ సంక్షేమ ఫలాలు



పాదయాత్రలో ఉన్నా... పరిపాలనలో ఉన్నా జనంతోనే జగన్..

ఉన్నది ఉన్నట్టుగా
చెప్పడం నికార్సైన జర్నలిజం!
ఉన్నది లేనట్టుగా..
లేనిది ఉన్నట్టుగా కనికట్టు చేయడం
రామోజీ రోత పాత్రికేయం!

నిత్యం పచ్చి అబద్ధాలతో ఆ పెత్తందారుడు అచ్చేస్తున్న కథనాలను చూస్తే.. గోబెల్స్ బతికి ఉంటే సిగ్గుతో తల వంచుకుని ఆత్మహత్య చేసుకునేవాడేమో!

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వంపై రోజూ బురద జల్లుతూ టన్నుల కొద్దీ అబద్ధాలను తన విష పుత్రికలో రామోజీ అచ్చేస్తూ వస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ తప్పుడు కథనాల ఉద్ధృతిని పెంచారు. ఈ కోవలోనే ఆదివారం 'ఈనాడు'లో 'నేను ఉన్నాను.. నేను వినను' శీర్షికతో తప్పుడు కథనాన్ని వండివార్చారు. ప్రతి అక్షరంలోనూ సీఎం వైఎస్ జగన్‌పై అక్కసును.. తన శిష్యుడు చంద్రబాబుపై అవ్యాజ్యమైన ప్రేమను మరోసారి ప్రదర్శించారు.

■ అసూయకు మందే లేదు!
ఆ అనారోగ్యానికి ఆరోగ్యశ్రీలో సైతం చికిత్స చేయడం కష్టమే మరి!!

ఇటు జనహితం.. అటు అధికార దర్పం

అందరినీ చిరునవ్వుతో పలుకరించడం.. సమస్యలను సావధానంగా వినడం.. చిత్తశుద్ధితో వాటిని పరిష్కరించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారసత్వంగా వచ్చిందనడంలో ఎవరికీ సందేహం లేదు. ఎన్నోసార్లు ఈ విషయం రుజువైంది. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికార పక్షంలో ఉన్నా ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించడం ఆయన నైజం. ప్రచార ఆర్భాటాలకు దూరంగా పనులు పూర్తి కావాలని, ఆపన్నులకు సాయం అందాలని ఆశిస్తారు! మరోవైపు అధికార దర్పం.. ప్రచార ఆర్భాటం.. ఎల్లో మీడియా తోడు లేనిదే పూట గడవని దుస్థితి చంద్రబాబు పాలనలో ప్రతి ఒక్కరూ చూశారు! ఓ పాలకుడిగా

మిగతా 11వ పేజీలో ▶

వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురంలో రూ.2 కోట్లతో నిర్మించిన నూతన పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వివక్ష లేని వ్యవస్థ

మన ప్రభుత్వ సిద్ధాంతం అదే: సీఎం వైఎస్ జగన్

- ఇకపైనా ప్రజల నమ్మకాన్ని రెట్టింపు చేసేలా సుపరిపాలన
- అభివృద్ధికి నిదర్శనంగా నిలిచిన పులివెందుల
- 'పాడా'పై అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సీఎం సమీక్ష
- సింహాద్రిపురంలో పలు ప్రభుత్వ నూతన కార్యాలయాలకు ప్రారంభోత్సవం

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల నియోజకవర్గం అభివృద్ధికి నిదర్శనంగా నిలిచిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా రెండోరోజు ఆదివారం పులివెందులలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. సింహాద్రిపురంలో రూ.11.6 కోట్లతో సుందరీకరించిన రహదారులు, జంక్షన్లను తొలుత ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇందులో ఫోర్‌లైన్ సీసీ రోడ్, బీటీ రోడ్ జంక్షన్‌లున్నాయి. అనంతరం రూ.5.5 కోట్లతో 1.5 ఎకరాల్లో నిర్మించిన వైఎస్సార్ పార్కును ప్రారంభించారు. రూ.3.19 కోట్లతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయం, రూ.2 కోట్లతో రూపుదిద్దుకున్న నూతన పోలీసు స్టేషన్, రూ.3.16తో సిద్ధమైన ఎంపీడీవో నూతన కార్యాలయాలు సీఎం చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ ఘాట్ వద్ద ఉదయం

మిగతా 2వ పేజీలో ▶

ఫ్యాక్ట్‌చెక్

పగబట్టి.. బాబు పిచ్చిపట్టి..

- రాష్ట్రంపై కక్ష కట్టింది నువ్వే రామోజీ.. ఏ ప్రభుత్వమైనా పరిశ్రమలను ఎందుకు వెళ్లగొడుతుంది చెప్పు?
- చంద్రబాబు అధికారంలో లేకపోతే అవాస్తవాలతో రాష్ట్ర పరువును దెబ్బతీస్తారా?
- ముఖేష్ అంబానీ రాష్ట్రంలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు పెడుతూ ఒప్పందం చేసుకున్నది నిజం కాదా..
- రాష్ట్ర ప్రభుత్వం మద్దతు బాగుందని ఆయనన్న మాటలు తెలీదా!

5 లో

న్యూస్‌రీల్

'సింహాద్రి'లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం



అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ రెండో యూనిట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా ఆదివారం ఉదయం 500 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది.

వివరాలు 3లో ▸

ఆసీస్‌ను ఓడించాం



ఎట్టకేలకు పదకొండో ప్రయత్నంలో ఆస్ట్రేలియా మహిళా జట్టుపై భారత జట్టు తొలిసారి టెస్ట్ విజయాన్ని అందుకుంది. వాంఖడే మైదానంలో జరిగిన ఏకైక టెస్ట్‌లో ఆస్ట్రేలియా నిర్దేశించిన 75 పరుగుల విజయలక్ష్యాన్ని 18.4 ఓవర్లలో ఛేదించి టీమిండియా గెలిచింది.

వివరాలు 14లో ▸



ఆరోగ్యశ్రీ కార్డుంటే.. రూ. 25 లక్షల వైద్యం చేతిలో ఉన్నట్టే

- 3,257 ప్రొసీజర్స్‌లో రూ.25 లక్షల వరకు ఉచిత చికిత్స
- చికిత్స అనంతరం విశ్రాంత సమయానికి ప్రభుత్వ సాయం
- కొత్త స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తూ పథకం ప్రయోజనాలపై ప్రచారం
- ఇప్పటివరకు 1.04 లక్షల ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

సాక్షి, అమరావతి: 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ. ఈ పథకం కింద ప్రభుత్వం రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తోంది. దురదృష్టవశాత్తు కుటుంబంలో ఎవరికైనా జబ్బు చేసినా.. ప్రమాదం సంభవించినా ఈ పథకం కింద ఉచితంగా చికిత్సలు పొందవచ్చు. ఆరోగ్యశ్రీ కార్డు వెంటబెట్టుకుని మీ దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లండి' అంటూ వైద్య సిబ్బంది ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం ఈ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచింది. ఈ క్రమంలో విస్తరించిన ప్రయోజనాలతో కూడిన కొత్త స్మార్ట్ కార్డులను అందజేస్తూ.. పథకం సేవలు ఎలా పొందాలన్న దానిపై ప్రతి ఒక్కరికీ వివరించేలా ప్రచార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. సరికొత్త ఫీచర్లతో రూపొందించిన 1.48 కోట్ల స్మార్ట్ కార్డులను వైద్య శాఖ ముద్రించింది. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా కార్డుల పంపిణీ చేస్తున్నారు. కాగా.. ఇప్పటివరకు 1,04,326 కార్డుల పంపిణీ పూర్తి అయింది. ఒక్కో వారంలో నియోజకవర్గంలో నాలుగు వరకు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ కార్డుల పంపిణీ కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళికలతో ముందుకు వెళుతున్నారు.

సేవలు పొందడం ఇలా..

ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సేవలు పొందడం ఎలా అనే అంశంపై ప్రజాప్రతినిధులు, ఏఎన్ఎం, సీహెచ్‌వో, వలంటీర్‌లతో కూడిన బృందాలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ సేవలను 1,059 రోగాల నుంచి 3,257 రకాల రోగాలను పెంచారు. ఆరోగ్య ఆసరా కింద చికిత్స అనంతరం అందిస్తున్న భృతి, రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్య సేవలు పొందగలగటం వంటి

మిగతా 3వ పేజీలో ▶

పని నుంచి బడికి..

విద్యార్థులుగా మారుతున్న బాల కార్మికులు

- 1506 మందికి వెట్టి నుంచి స్వేచ్ఛ
- రాష్ట్రానికి చెందిన 897 మందిని బడిలోకి చేర్చిన సీఐడీ
- సత్ఫలితాలనిస్తున్న ఆపరేషన్ స్వేచ్ఛ

■ రాష్ట్ర వ్యాప్తంగా బాల కార్మికులుగా మగ్గుతున్న అనేక మంది పిల్లలను సీఐడీ అధికారులు గుర్తించి వారిని మళ్లీ బడిలో చేర్పిస్తున్నారు. 'ఆపరేషన్ స్వేచ్ఛ' కార్యక్రమం బాల కార్మికుల జీవితాల్లో మళ్లీ విద్యా వెలుగులు తీసుకువస్తోంది.



- వివరాలు 12లో

జేఈఈకి భారీగా నమోదు

- 2024 జనవరి సెషన్‌కు 12.30 లక్షల మందికిపైగా దరఖాస్తు
- ఆంధ్రప్రదేశ్ నుంచి 1,34,703 మంది రిజిస్ట్రేషన్

■ ఐఐటీ, ఎన్ఐటీ తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ పరీక్షకు విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జనవరిలో జరగనున్న తొలి సెషన్‌కు దాదాపు 12.30 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు.



- వివరాలు 11లో


డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్ వేటు



■ భారత రెజ్లింగ్ సమాఖ్యకు ఎన్నికలు జరిగి, కొత్త కార్యవర్గం ఏర్పాటైందన్న ముచ్చట మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది. డబ్ల్యూఎఫ్ఐపై కేంద్ర క్రీడా శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న బ్రిజ్‌భూషణ్‌కు విధేయుడైన సంజయ్ సింగ్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అండర్-15, అండర్-20 జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలను బ్రిజ్‌భూషణ్ హవా నడిచే గోండా (ఉత్తర్‌ప్రదేశ్) పట్టణంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఏకపక్ష విధానంపై కేంద్ర క్రీడా శాఖకు డబ్ల్యూఎఫ్ఐ కార్యదర్శి ప్రేమ్‌చంద్ ఫిర్యాదు చేయడంతో వెంటనే సమాఖ్యను సస్పెండ్ చేసింది.

- వివరాలు 14లో ▸

ఇదండీ వరస



ఈ పాసు పుస్తకాలు అత్యంత ఆధునికం

రీసర్వే తర్వాత ఇచ్చే వాటికి గతంలో కంటే ఇప్పుడే విలువ ఎక్కువ

- రుణాలు, రిజిస్ట్రేషన్లకు ఇవి ఏమాత్రం అడ్డంకి కాదు
- ఆర్ఓఆర్ చట్ట సవరణ ప్రకారం పాసు పుస్తకాల్లో రుణాల గురించి అప్‌డేట్ చేయక్కర్లేదు
- నేరుగా ఆన్‌లైన్‌లోనే అప్‌డేట్ చేస్తుండడంతో వీటిల్లో చేసే అవసరంలేదు
- కొత్త భూ రికార్డుల విధానం గురించి పనిగట్టుకుని కొందరు దుష్ప్రచారం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త డిజిటల్ భూ రికార్డుల విధానం గురించి ఏమాత్రం అవగాహన లేకుండా ప్రభుత్వంపై కొందరు ఉద్దేశపూర్వకంగా బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారు. జగనన్న భూహక్కు, భూరక్ష పథకం కింద ఇచ్చిన పట్టాదారు పాసుబుక్‌లు ఎందుకు పనికిరావని.. ఇందులో రైతులకు హక్కుల్లేవని, రుణాలు రావంటూ ప్రభుత్వంపై విద్వేషం రగిలిస్తూ ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు. కానీ, భూముల రీసర్వే తర్వాత ప్రభుత్వం జారీచేస్తున్న పట్టాదార్ పాసు పుస్తకాలు అత్యంత ఆధునికమైనవని రెవెన్యూ వర్గాలు స్పష్టంచేస్తున్నాయి. రుణాలు తీసుకోవడానికి ప్రస్తుతం ఇస్తున్న పాసు పుస్తకం (భూ హక్కు పత్రం) ఉపయోగపడదనే ప్రచారం అవగాహన రాహిత్యమేననే చెబుతున్నాయి.



నిజానికి.. భూములపై యాజమాన్య హక్కును ప్రతిబింబించేది పాసు పుస్తకమే. దాన్ని చూపించి బ్యాంకుల రుణం తీసుకోవడంతోపాటు తనఖా పెట్టుకోవడం, అమ్ముకోవడం వంటివన్నీ గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా నిరభ్యంతరంగా చేసుకోవచ్చు. రీ సర్వేకు ముందున్న పాస్ పుస్తకంలోని ఉపయోగాల కంటే ఇప్పుడిస్తున్న పాసు పుస్తకాలతో ఎక్కువ ఉపయోగాలు ఉంటాయి.

■ 2016లో ఆర్ఓఆర్ చట్టాన్ని సవరించిన తర్వాత భూముల అమ్మకాలు, కొనుగోళ్లు, బహుమతి, తనఖా, లీజు వంటి లావాదేవీలను

మిగతా 3వ పేజీలో ▶

మీకోసం సర్‌ప్రైజ్ గిఫ్ట్!

- క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలే టార్గెట్‌గా సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు
- బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పొద్దన్న పోలీసులు



సాక్షి, హైదరాబాద్: క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్నారు. సర్‌ప్రైజ్ గిఫ్ట్‌లని, పండగ ఆఫర్లు అంటూ బురిడీ కొట్టిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా మీకు ఉచిత బహుమతులు వచ్చాయంటూ వచ్చే మెసేజ్‌లను, ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని తెలంగాణ సైబర్ బ్యూరో అధికారులు హెచ్చరించారు. అదేవిధంగా నూతన సంవత్సరం పేరిట దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫోన్లు, ఇతర గృహోపకరణాలపై భారీ ఆఫర్లు ఉన్నాయంటూ వచ్చే ఎస్సెమ్మెస్‌లలోని లింక్‌లపై క్లిక్ చేయవద్దని వారు సూచిస్తున్నారు. ఇలాంటి లింక్‌లలో సైబర్ నేరగాళ్లు ఫోన్, ల్యాప్‌లాప్‌లలోకి వైరస్‌ను చొప్పించే ప్రమాదం ఉందని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరించారు. ఎలాంటి కొనుగోళ్లు చేయకుండా కూపన్లు, గిఫ్ట్‌లు రావన్న విషయాన్ని గుర్తించాలని, ఇలా మన బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు తీసుకుని అకౌంట్‌లోని డబ్బులు కొల్లగొట్టే ప్రమాదం ఉందని తెలిపారు. అనుమానాస్పద లింక్‌లు, ఎస్సెమ్మెస్‌లపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని లేదా cybercrime.gov.in లోనూ సమాచారం ఇవ్వాలని సూచించారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

పిల్లల చదువు బెంగ తీరింది



మాకు ముగ్గురు పిల్లలు. వారికి మూడు పూటలా కడుపునిండా తిండి పెట్టడానికి నేను, మా ఆయన చాలా కష్టపడుతున్నాం. ఇక పిల్లలకు చదువెలా చెప్పిస్తాం? మాది నిరుపేద గిరిజన కుటుంబం. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం బీరపాడు మా గ్రామం. మా వూరి మేస్టారు వచ్చి పిల్లల్ని బడికి పంపిస్తే ప్రభుత్వం డబ్బులిస్తుందనీ, మధ్యాహ్నం భోజనం పెడతారని చెప్పడంతో పిల్లల్ని బడికి పంపిస్తున్నాం. ఇప్పుడు పెద్దమ్మాయి లాస్య ఐదో తరగతి, బాబు వికాస్ రెండో తరగతి చదువుతున్నారు. ఈ ప్రభుత్వం అమ్మఒడి కింద ఏటా రూ.15 వేలు చొప్పున లాస్యకు నాలుగేళ్లుగా డబ్బు అందిస్తోంది. మధ్యాహ్నం వారిద్దరికీ రుచికరమైన భోజనం పెడుతున్నారు. ఇద్దరు పిల్లలకు జగనన్న విద్యా కానుకగా పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, బెల్ట్, బ్యాగు ఇచ్చారు. మరో బాబు విక్రమ్ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. అక్కడ పౌష్టికాహారం, వైద్యం అందుతోంది. ఇప్పుడు మా పిల్లల చదువు బెంగ తీరింది.

– కిల్లక భారమ్మ, బీరపాడు
(దత్తి మహందాత నాయుడు, విలేకరి, పార్వతీపురం)

కూరగాయల వ్యాపారంతో ఉపాధి



నా భర్త నీలకంఠం కూలి పని చేస్తారు. ఆయన రెక్కలు ముక్కలు చేసుకుని ఇద్దరు పిల్లలు గల ఈ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. నేను ఏదైనా వ్యాపారం చేద్దామన్నా పెట్టుబడి లేక అది కుదరలేదు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన మేము గత టీడీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. అధికారుల చుట్టూ తిరిగినా వారు కరుణించలేదు. జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సులతోనే రుణాలు ఇవ్వడంతో మాకు అన్యాయం జరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 నేరుగా లబ్ధిదారుల ఖాతాకే జమ చేశారు. ఆ పథకం ద్వారా తొలి విడతగా తీసుకున్న నగదుతో గ్రామంలోనే కూరగాయల దుకాణం ప్రారంభించా. ప్రస్తుతం రోజుకు రూ.300 వరకు ఆదాయం వస్తోంది. దీంతో కుటుంబానికి చేదోడుగా ఉంటున్నా. ఇద్దరు పిల్లలకు పెళ్లి చేసి ఇంటి వద్దే ఉంటున్న నాకు వైఎస్సార్ చేయూత పథకంతో ఓ ఆధారం దొరికింది.

– మొగలపూరి హైమావతి, సమిశ్రగూడెం
(గాడి శేఖర్‌బాబు, విలేకరి, నిడదవోలు)

పింఛన్ ఇంటికే వస్తోంది



నాకు పూర్తి స్థాయిలో కళ్లు కనిపించవు. అంధత్వ సమస్య వల్ల బయటకు వెళ్లలేను. పని చేస్తేగాని కుటుంబం గడవని పరిస్థితి. నా భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలతో విశాఖ నగరంలోని ఆరిలోవ టీఐసీ పాయింట్ వద్ద ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నాను. ఈ ప్రభుత్వం వచ్చాక నాకు దివ్యాంగ పింఛను మంజూరైంది. రూ.3,000 చొప్పున ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ఇంటికి వచ్చి అందిస్తున్నారు. ఆ డబ్బుల వల్ల ఇప్పుడు చాలా వరకు ఇబ్బందులు తీరుతున్నాయి. గతంలో తరుచూ అప్పులు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు నిర్మాణంలో ఉంది. నా భార్య కూలి పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటోంది. పెద్ద కుమార్తె ప్రభుత్వ ఉమెన్స్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెకు నాలుగేళ్లుగా జగనన్న అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేల చొప్పున వస్తోంది. ఆ డబ్బులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు మా లాంటి పేదోళ్లకు పిల్లలను చదివించడానికి బాగా ఉపయోగపడుతున్నాయి.

– గుడ్ల వెంకటరెడ్డి, ఆరిలోవ, విశాఖపట్నం
(మీసాల కామేశ్వరరావు, విలేకరి, ఆరిలోవ, విశాఖపట్నం)

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ క్రిస్మస్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ప్రేమ, శాంతి, సహనం కలిగి ఉండాలన్నదే క్రీస్తు మానవాళికి అందించిన గొప్ప సందేశం అని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విశ్వ శాంతి కోసం అందరం పునరంకితం కావాలని గవర్నర్ ఆకాంక్షించినట్టు రాజ్‌భవన్ వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

సీఎం వైఎస్ జగన్ క్రిస్మస్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. దైవ కుమారుడు జీసస్ మానవుడిగా జన్మించిన రోజును ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారని ముఖ్యమంత్రి అన్నారు. ఏసుప్రభువు జీవనం అందరికీ ఆదర్శప్రాయమని, తన బోధనల ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని సీఎం జగన్ అన్నారు. ఎల్లప్పుడూ ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలపై ఉండాలని సీఎం వైఎస్ జగన్ ఆకాంక్షించారు.

రేపు గుంటూరులో ముఖ్యమంత్రి జగన్ పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 26వ తేదీన గుంటూరులో పర్యటించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. సీఎం వైఎస్ జగన్ మంగళవారం ఉదయం 10గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి గుంటూరు శివారు నల్లపాడు చేరుకుంటారు. అక్కడ లయోలా పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.



ఇడుపులపాయ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న సీఎం జగన్

క్రిస్మస్ ప్రార్థనల్లో సీఎం జగన్

- వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులు
- పాల్గొన్న వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతీరెడ్డి

సాక్షి కడప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇడుపులపాయలో ఉదయం 9.10 గంటల ప్రాంతంలో తన తండ్రి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్దకు చేరుకుని నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తండ్రి జ్ఞాపకాలను స్మరించుకుంటూ బరువెక్కిన హృదయంతో ఘాట్ ప్రాంగణంలో అందరినీ పలుకరిస్తూ ముందుకు కదిలారు.

నివాళులర్పించిన కుటుంబ సభ్యులు

ఇడుపులపాయలోని దివంగత వైఎస్సార్ సమాధి వద్ద పలువురు కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. సీఎం జగన్ మాతృమూర్తి వైఎస్ విజయమ్మ ఉదయాన్నే ఘాట్ వద్దకు చేరుకుని పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. వైఎస్సార్ సోదరులు వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్ సుధీకర్‌రెడ్డి, సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతీరెడ్డి, వైఎస్ జగన్ సోదరులు వైఎస్ సునీల్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి, మంగళగిరి వైఎస్సార్ సీపీ మహిళా నేత బొమ్మారెడ్డి సునీత, కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ కౌశల్, జేసీ గణేష్‌కుమార్, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, పరిశ్రమలశాఖ ముఖ్య సలహాదారు రాజోలి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి

ఇడుపులపాయలోని చర్చిలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి జగన్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. సీఎం జగన్ మాతృమూర్తి వైఎస్ విజయమ్మ, అత్తమ్మ ఈసీ సుగుణమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డి, బావమరిది ఈసీ దినేష్ రెడ్డి, సోదరుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ సునీల్ రెడ్డి, చిన్నాన్న, పెద్దనాన్నలు వైఎస్ సుధీకర్ రెడ్డి, వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ తదితరులతోపాటు వైఎస్ కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మూడు దశాబ్దాలుగా ఆనవాయితీ

ప్రతి క్రిస్మస్‌కు ముందురోజు కుటుంబ సభ్యులు, బంధువులు కలుసుకోవడం ఎప్పటినుంచో కొనసాగుతోంది. ఇడుపులపాయలోని చర్చి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలియచేయడం సంప్రదాయంగా వస్తోంది. ఇదే క్రమంలో సీఎం జగన్ బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులను కలుసుకుని ఆప్యాయంగా పలుకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకున్నారు.

వివక్ష లేని వ్యవస్థ



▶ మొదటి పేజీ తరువాయి

క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇడుపులపాయ ఎస్టేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి పాడా (పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) అభివృద్ధి పనులపై సీఎం సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పులివెందుల మండల ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు ప్రభుత్వ ఆశయాల సాధనకు సంపూర్ణ సహకారం అందిస్తున్న ప్రజలకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. సొంత నియోజకవర్గ ప్రజలపై మమకారం, బంధువులు, స్నేహితులు, సన్నిహితులను ఒకేచోట కలిసిన సంతోషంతో సీఎం జగన్ అందరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు.

కలసి చాలా రోజులైంది

'మనమంతా కలసి చాలా రోజులైంది.. ఒకసారి కలిసినట్లుంటుంది.. కష్ట సుఖాలు పంచుకున్నట్లుంటుంది' అనే ఉద్దేశంతో సమావేశం ఏర్పాటు చేసినట్లు సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతోందన్నారు. అందుకు అన్ని వర్గాల సమ్మతి, సహకారం ఎంతో అవసరమన్నారు. సచివాలయాల ద్వారా గ్రామ లోగిళ్లలోనే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను సంతృప్తికరంగా ప్రజలకు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. వ్యవస్థ సక్రమంగా నడవాలంటే ఎక్కడా వివక్షకు తావివ్వకూడదనేదే మన ప్రభుత్వ సిద్ధాంతమని ముఖ్యమంత్రి తెలిపారు. పరిపాలన పారదర్శకంగా సాగినపుడే వ్యవస్థ పటిష్టంగా సాగుతుందనే విషయాన్ని నాలుగున్నరేళ్లుగా ప్రజలు గుర్తించారని చెప్పారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వంపై వారి నమ్మకాన్ని రెట్టింపు చేసేలా సుపరిపాలన కొనసాగిస్తామన్నారు.

'పాడా' పరిధిలో పనులపై సమీక్ష

'పాడా' పరిధిలో అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ వి.విజయ్ రామరాజు ముఖ్యమంత్రికి క్లుప్తంగా వివరించారు. పులివెందుల రూరల్ మండలంలో గ్రామ పరిపాలన సంతృప్తికరంగా సాగుతోందన్నారు. పీబీసీ, సీబీఆర్ మైనర్, మైక్రో ఇరిగేషన్ ఆయకట్టు పరిధిలో దాదాపు 14 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగులోకి తెచ్చామన్నారు. రూరల్ పరిధిలో పాడా, ఇతర శాఖల సమన్వయంతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రూ.44.40 కోట్లతో మంజూరు చేసిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటి వరకు రూ.31.08 కోట్లు వెచ్చించి పలు పనులను పూర్తి చేసినట్లు చెప్పారు. మైక్రో ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ, ఉపాధి హామీ, నాడు–నేడు పనులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో రూ.135.49 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.58.85 కోట్లు ఖర్చు చేశామని, పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

సీఎం దృష్టికి పలు ప్రతిపాదనలు

పులివెందుల పరిధిలో చేపట్టాల్సిన ఇతర అభివృద్ధి పనులపై పలువురు మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు అందించారు. సీబీఆర్–ఎర్రబెల్లి నూతన పైప్‌లైన్ పరిధిలోని మోతున్నూతనపల్లెలో స్టోరేజీ పాయింట్ ఏర్పాటు చేస్తే వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందన్నారు. గవేశ్వరస్వామి ఆలయాన్ని పర్యాటకంగా కూడా అభివృద్ధి చేయాలని కోరారు. ఎర్రబల్లె చెరువు నుంచి పంపింగ్ ద్వారా చిన్న గుంతలకు నీటిని సరఫరా చేస్తే వ్యవసాయ అవసరాలు తీరుతాయని కొందరు గ్రామస్తులు విన్నవించారు. షాదీ తోఫా, కళ్యాణమస్తు ఆర్థిక సాయాన్ని పెంచి దూదేకుల కుటుంబాలకు ఆర్థిక చేయూతనివ్వడాన్ని నూర్ బాషా దూదేకుల సంఘం నాయకుడు మహమ్మద్ రఫీ స్వాగతించారు. సర్టిఫికెట్ల జారీలో నూర్ బాషాలను ముస్లింలుగా గుర్తించాలని కోరారు.

పచ్చదనంతో కళకళ

'మీరు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పులివెందుల మండలం పచ్చదనంతో కళకళలాడుతోందని.. ఇదంతా ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వడంతోనే సాధ్యమైంది' అంటూ పలువురు మండల నాయకులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ఎంపీ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలో సమస్యలన్నీ పరిష్కారం అయ్యాయని సంతృప్తి వ్యక్తం చేశారు. రిజర్వాయర్ల పరిసర ప్రాంత గ్రామస్తులు, రైతులకు ఇంకా ఏవైనా సమస్యలుంటే పూర్తి వివరాలను అందజేస్తే సంబంధిత అధికారుల ద్వారా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. అందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ సమీక్షను ముగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, జేసీ గణేష్‌కుమార్, ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ సలహా కమిటీ మెంబర్ బలరామిరెడ్డి, మండలాధ్యక్షులు, ఎంపీటీసీలు ఖాదరబాధర వరలక్ష్మి, కొమ్మా వరలక్ష్మి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తంరెడ్డి, మాజీ ఉప మండలాధ్యక్షుడు పుష్పనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సింహాద్రిపురంలో ఎంపీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
(ఇన్‌సెట్‌లో) పులివెందుల నియోజకవర్గ సమీక్ష సందర్భంగా రైతులు బహూకరించిన నాగలితో సీఎం

మానవత్వం పరిమళించి..

సింహాద్రిపురం: వైఎస్సార్ కడప జిల్లాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం సింహాద్రిపురం మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాల అనంతరం తిరిగి వెళ్తుండగా రోడ్డు పక్కన కాగితాలతో నిరీక్షిస్తున్న పలువురు మహిళలను చూసి వాహనాన్ని నిలిపివేశారు. కాన్వాయ్ వేగంగా వెళ్తున్నప్పటికీ వారిని గుర్తించిన సీఎం వాహనాన్ని ఆపాలని ఆదేశించారు. తన పిల్లలకు ఆరోగ్యం సరిగా లేదని, సహాయం చేయాలని ఓ మహిళ కోరగా.. మరో మహిళ తన భర్త చనిపోయారని, సాయం అందించాలని వేడుకుంది. వెంటనే వారికి తగిన సహాయం అందించాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. తన బిడ్డకు తలలో కణితి ఆపరేషన్‌కు సాయం చేయాలని తాడిపత్రికి చెందిన ఓ మహిళ అభ్యర్థించడంతో పూర్తి స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు.





సింహాద్రిపురంలో వైఎస్సార్ మెమోరియల్ పార్కును ప్రారంభించిన సీఎం జగన్, రోడ్డును ప్రారంభించిన సీఎం



తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం జగన్

రబీలోనూ ప్రత్యామ్నాయ పంటలు

మెట్ట ప్రాంతాల్లో వరికి బదులు అపరాలు

- కాలువల ఎగువ ప్రాంతాల్లో అపరాలు, మొక్కజొన్న
- గోదావరి డెల్టాలో వెదజల్లు పద్ధతిలో నాట్లు
- మొక్కజొన్న స్థానంలో ప్రత్యామ్నాయ పంటల సాగు
- ఆర్బీకేల ద్వారా గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం

సాక్షి, అమరావతి : రబీ సీజన్‌లోనూ నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ సన్నద్ధమైంది. సీజన్‌లో నెలకొన్న బెట్ట పరిస్థితులకనుగుణంగా అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలుచేసేందుకు కార్యాచరణ సిద్ధంచేసింది. సీజన్ ఆరంభమై నెలన్నర రోజులైన నేపథ్యంలో.. రబీసాగు లక్ష్యం 55.96 లక్షల ఎకరాలుగా కాగా, ఇందుకు 3,64,372 క్వింటాళ్ల విత్తనం అవసరమని వ్యవసాయ శాఖ ఇండెంట్ పెట్టింది. దీంతో 3,78,200 టన్నులను ఆర్బీకేల్లో పొజిషన్ చేయగా, ఇప్పటివరకు 2,49,647 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశారు. ప్రధానంగా 2.45 లక్షల క్వింటాళ్ల శనగ, 3,500 క్వింటాళ్ల వేరుశనగ, 500 క్వింటాళ్ల చొప్పున వరి, పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. గతేడాది ఇదే సమయానికి 10.81 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకాగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 8.5 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి.

ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై వ్యవసాయ శాఖ దృష్టిసారించింది. ఇప్పటికే ఆ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సీజన్‌లో నెలకొన్న వాతావరణ పరిస్థితులను ప్రతీ 15 రోజులకోసారి సమీక్షిస్తూ తదనుగుణంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. అలాగే, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సిఫార్సులకనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందించారు.

గోదావరి ప్రాజెక్టు కింద సాగునీరు

గోదావరిలో పుష్కలంగా నీరుండడంతో ఈ ప్రాజెక్టు పరిధిలో వ్యవసాయ, ఆక్వా అవసరాలకు తగినంత నీరివ్వనున్నారు. ఐఏబీ–డీఏబీ సమావేశంలో ఏ మేరకు సాగునీరు ఉందో అంచనావేస్తూ ఎంత విస్తీర్ణంలో సాగుకు నీరు ఇవ్వగలమో రైతులకు ముందుగానే చెబుతున్నారు. సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు కాలువల కింద నీటి సరఫరాను నిలిపివేసే తేదీలపై ఆర్బీకేల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. ఇక శివారు ప్రాంతాల్లో (టెయిల్ ఎండ్ ఏరియాస్) సాధ్యమైనంత త్వరగా నాట్లు వేసుకునేలా అవగాహన కల్పించడంతో పాటు నీటి యాజమాన్య పద్ధతులు విధిగా పాటించేలా రైతులను అప్రమత్తం చేయనున్నారు. గోదావరి డెల్టా పరిధిలో వెదజల్లు సాగును ప్రోత్సహించడంతో పాటు అత్యధిక నీటి వినియోగమయ్యే పంటల్లో ఒకటైన మొక్కజొన్న సాగును కాలువల కింద ప్రోత్సహించకూడదని నిర్ణయించారు.



వరికి ప్రత్యామ్నాయంగా అపరాలు

బాపట్ల, పల్నాడు, కర్నూలు జిల్లాలు మినహా మిగిలిన జిల్లాల్లో ఐఏబీ, డీఏబీ సమావేశాలను సంయుక్తంగా నిర్వహించనున్నారు. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం మెట్ట ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా అపరాల సాగును, కాలువల ఎగువ ప్రాంతాల్లో అపరాలతో పాటు మొక్కజొన్న సాగును ప్రోత్సహిస్తారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులకనుగుణంగా 14 జిల్లాల పరిధిలో కనీసం 60వేల ఎకరాల్లో కంటిజెంట్ ప్లానింగ్ అమలుచేస్తారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం 6,229 క్వింటాళ్ల విత్తనం అవసరమని గుర్తించారు. వీటిని సబ్సిడీపై రైతులకు అందించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు.

ఆర్బీకే స్థాయిలో విస్తృత ప్రచారం

స్వల్పకాలంలో చేతికొచ్చే పంటల సాగును ప్రోత్సహించేలా రూపొందించిన ఈ కార్యాచరణను ఆర్బీకేల ద్వారా కరపత్రాలు, వాల్ పోస్టర్లతో ప్రచారం చేస్తున్నారు. అంతేకాక.. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికనుగుణంగా సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులకు సంబంధించి శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో కూడిన చిన్నపాటి వీడియో, ఆడియో సందేశాలతో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

క్లుప్తంగా...

27న అనంతపురంలో మేధావుల రాష్ట్ర సదస్సు

పరిపాలన వికేంద్రీకరణ ఉత్తరాంధ్ర జేఏసీ వెల్లడి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న లజపతిరాయ్ తదితరులు

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి ముడిపడి ఉందని పరిపాలన వికేంద్రీకరణ ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న అనంతపురంలో నిర్వహించనున్న మేధావుల రాష్ట సదస్సు విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం విశాఖలోని ఓ హోటల్లో పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమాన, సమగ్రాభివృద్ధికై ఏపీ నలుమూలల నుంచి తరలిరానున్న మేధావుల సదస్సును విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు పిలుపునిచ్చారు. 27న ఉదయం 11 గంటల నుంచి అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో జరగనున్న ఈ సదస్సులో మంత్రులు పెద్దిరెడ్డి, అప్పలరాజు, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి, శంకర నారాయణ, జొన్నలగడ్డ పద్మావతి, ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి పాల్గొంటారని తెలిపారు. వీరితోపాటు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి, రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త ఎం.పురుషోత్తంరెడ్డి, కేసీ కాలువ ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు డి.చంద్రమౌళి రెడ్డితో పాటు అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ, ప్రధాన కార్యదర్శి డి.రాజా హోన్నూర్ పాల్గొంటారని తెలిపారు.

దళితులను దగా చేసిన టీడీపీ

దళిత జేఏసీ చైర్మన్ వరప్రసాదరావు మండిపాటు



సాక్షి, అమరావతి: ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న టీడీపీ దళితులను దారుణంగా దగా చేసిందని, ఇప్పుడు దళిత, క్రిస్టియన్ల కోసం నీతులు చెబితే నమ్మేవారెవరూ లేరని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లుతూ టీడీపీలోని కొంతమంది దళిత నేతలు ధర్నాలు చేయడంపై వరప్రసాదరావు తీవ్రంగా స్పందిస్తూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్ స్మృతివనాన్ని అమరావతిలోని మారుమూల ప్రాంతంలో స్థలం కేటాయించినట్లు ప్రకటించిన టీడీపీ తీవ్ర నిర్లక్ష్యంగా వదిలేసిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో శ్రద్ధ తీసుకుని విజయవాడ నగర నడిబొడ్డున అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రారంభించి పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ అన్ని మతాలు, కులాలను సమభావంతో ఆదరిస్తున్నారని తెలిపారు. అర్చకులు, మౌజన్లతో పాటు పాస్టర్లకు సైతం గౌరవ వేతనం అందిస్తున్న గొప్ప మనస్సు ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో కనీసం పాస్టర్లకు గౌరవ వేతనం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. టీడీపీలోని దళిత నేతలు దళితులను దగా చేసిన చంద్రబాబును నిలదీయాలని వరప్రసాదరావు హితవు పలికారు.

నెట్టింట.. ప్రభుత్వ బడులు!

- ఇప్పటికే 8,700 స్కూళ్లకు అందుబాటులోకి నెట్
- ప్రాథమిక పాఠశాలలకు జియో ద్వారా సేవలు
- నూరు శాతం డిజిటలైజేషన్ దిశగా ప్రభుత్వ పాఠశాలలు

రాష్ట్రంలోని 40 వేలకు పైగా పాఠశాలలు ఇంటర్నెట్ పరిధిలోకి..



సాక్షి, అమరావతి: కనీస సదుపాయాల లేమి.. శిథిలమైన గదులు.. ఇది ఒకప్పటి ప్రభుత్వ పాఠశాలల దుస్థితి. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కార్పొరేట్ సదుపాయాలతో అవి కళకళలాడుతున్నాయి. గతంలో విద్యార్థులకు టెక్ట్స్ బుక్స్ కూడా లేని పరిస్థితుల నుంచి బూట్లు, బెల్టు, టై, నోటు పుస్తకాలతో సహా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు సగర్వంగా చదువుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల(ఐఎఫ్‌పీ)ను అందుబాటులోకి తేవడంతో డిజిటల్ వైపు అడుగులు వేసింది. ఇప్పుడు వాటిని సమర్థంగా వినియోగించి, పేదింటి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అన్ని ప్రభుత్వ బడులను ఇంటర్నెట్‌తో అనుసంధానం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిరంతరాయంగా డిజిటల్ బోధన అందించేందుకు, సమకాలీన ప్రపంచ పోకడలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అన్ని పాఠశాలలను డిజిటలైజేషన్ చేయనున్నారు. ఇందుకోసం ప్రతి పాఠశాలకు ప్రభుత్వం ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పిస్తోంది. ఇప్పటికే 8,700 పాఠశాలలకు నెట్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురాగా, ఇందులో 3,700 ఉన్నత పాఠశాలలు, మరో 5 వేలు ప్రాథమిక పాఠశాలలున్నాయి. వచ్చే రెండు, మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ బడులకు నెట్ సదుపాయం కల్పించే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ మౌలిక సదుపాయాల కల్పన విభాగం పనిచేస్తోంది.

100 ఎంబీపీఎస్ వేగంతో నెట్ సదుపాయం

ఈ ఏడాది ప్రారంభంలో 4,800 ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి, +2 వరకు సెక్షన్‌కు ఒకటి చొప్పున 30,715 ఐఎఫ్‌పీ స్క్రీన్లను అందుబాటులోకి తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ బోధనను అందుబాటులోకి తెచ్చింది. ప్రాథమిక పాఠశాలల్లో 60మంది విద్యార్థులకు ఒక స్మార్ట్ టీవీ చొప్పున 10,038 స్మార్ట్ టీవీలను అందించి, టోఫెల్ బోధన చేపట్టారు. రెండో దఫాలో 32వేల ఐఎఫ్‌పీలు, 22వేల స్మార్ట్ టీవీలను పాఠశాలలకు అందించింది. వీటితోపాటు విద్యార్థులకు మెరుగైన బోధన, ఉత్తమ కంటెంట్‌ను అందించేందుకు, 4 డీటీహెచ్ (ఈ విద్య) చానెళ్లు, 5 దీక్ష–ఏపీ చానెళ్లు, ఏపీ ఈ–పాఠశాల పోర్టల్ ద్వారా కూడా కంటెంట్‌ను పంపిస్తున్నారు. ఇప్పుడు విద్యార్థులకు టోఫెల్ బోధన అందిస్తున్నారు. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, మ్యాథ్స్ ల్యాబ్స్ పాల్ ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్స్‌ను అందుబాటులోకి తెచ్చి విద్యపై దృష్టి పెట్టిన ప్రభుత్వం.. ఇకపై విద్యార్థులకు ఫ్యూచర్ టెక్ పాఠాలను సైతం బోధించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. విద్యార్థుల్లో ఆలోచన శక్తిని విస్తరించడం, విజ్ఞానంలో ముందుండేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), లార్జ్ లెర్నింగ్ మాడ్యూల్స్, 3డీ ప్రింటింగ్, గేమింగ్ వంటి భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇవ్వనున్నారు. పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్ కోసమే ప్రభుత్వం దాదాపు రూ.2400 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి పాఠశాలలోను డిజిటల్ లెర్నింగ్ అంతరాయం లేకుండా కొనసాగేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాన్ని సైతం కల్పిస్తోంది. హైస్కూళ్లకు ఏపీ ఫైబర్‌నెట్, బీఎస్ఎన్ఎల్ ద్వారా 100 ఎంబీపీఎస్ వేగంతో బ్రాడ్‌బ్యాండ్ సదుపాయాన్ని, ప్రాథమిక పాఠశాలలకు జియో ద్వారా నెట్ అందిస్తోంది. అందుకు అవసరమైన 5జీ సిమ్ కార్డులతో వైఫై రౌటర్లను సరఫరా చేస్తోంది.

జనసేన కార్యకర్తలు, తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

టీడీపీ ఇన్‌చార్జి సొంత గ్రామంలో ఘర్షణ

ఉప్పలగుప్తం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం గ్రామంలో జనసేన కార్యకర్తలు, తెలుగు తమ్ముళ్లు కుమ్ములాడుకున్నారు. టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ ప్రస్తుత అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు స్వగ్రామం ఎస్.యానాం. ఇక్కడ జనసేన పార్టీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆదివారం మహా సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆనందరావుల ఫొటోలు వేయలేదు. దీనిపై తెలుగు తమ్ముళ్లు మండిపడ్డారు. ఇది రెండు పార్టీల కార్యకర్తల మధ్య కుమ్ములాటకు దారి తీసింది. గ్రామంలో రాజబాబు యాత్ర నిర్వహిస్తూ, సాయిబాబా గుడి వీధి ప్రాంతానికి చేరేసరికి కొంత మంది తెలుగు తమ్ముళ్లు గొడవకు దిగారు. రెండు పార్టీలూ పొత్తులో వెళుతుండగా, అయితాబత్తుల ఆనందరావు సొంత గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఆయన ఫొటోతో పాటు చంద్రబాబు ఫొటో ఎందుకు వేయలేదని, ప్రొటోకాల్ పాటించకపోవడమేంటని నిలదీశారు. తమ పార్టీ ప్రచారంలో టీడీపీ వారి ఫొటోలు ఎందుకు వేస్తామంటూ జనసేన కార్యకర్తలు తెగేసి చెప్పడంతో టీడీపీ కార్యకర్తలు మరింతగా మండిపడ్డారు. ఇరు పార్టీల కార్యకర్తలు పెద్దగా కేకలు వేసుకుంటూ, ఒకరిపై ఒకరు కలబడ్డారు.

గిరిజన సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి: రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి మండలంలోని గిరిజన పంచాయతీ చింతలపూడి శివారు బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు సమ్మెద నుండి బోడిగరువు మీదుగా నేరెళ్లపూడి వరకు రూ. 2 కోట్ల వ్యయంతో మట్టి రోడ్డు నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. సమ్మెద వద్ద భూమి పూజ చేసి, శిలాఫలకం ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. అనంతరం 5 కిలోమీటర్ల మేర కాలినడకన వాగులు, కొండలు దాటి బోడి గరువు, నేరెళ్లపూడి గ్రామాల్లో పర్యటించారు. బోడిగరువులో రూ. 25 లక్షలతో నూతన ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. పాఠశాల భవనానికి స్థలదానం చేసిన గుమ్మడవు దేముడుబాబును ఘనంగా సత్కరించారు. అనంతరం గిరిజనులతో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ మారుమూల గిరిజన పల్లెలకు సైతం రోడ్లు, మంచినీటి సదుపాయం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

ఈ పాసు పుస్తకాలు అత్యంత ఆధునికం

▶ మొదటి పేజీ తరువాయి

పాసుపుస్తకంలో రిజిస్ట్రేషన్ అధికారి నమోదు చేయాల్సిన అవసరంలేదు.

- రైతులు రుణాలు తీసుకోవడానికి తమ పాసు పుస్తకాలను బ్యాంకుల్లో ఇవ్వక్కర్లేదు.
- రెవెన్యూ రికార్డులు ఆన్‌లైన్‌లో ఉండటంతో పాసు పుస్తకాలను అప్‌డేట్ చేయాల్సిన అవసరం కూడా లేకుండాపోయింది.
- రుణం మంజూరు చేసేటప్పుడు వెబ్ ల్యాండ్ ఎలక్ట్రానిక్ రెవెన్యూ రికార్డుల్లో రుణం గురించి నమోదుచేస్తారు. ఈ విషయం తెలుసుకోకుండా కొందరు ఇప్పుడున్న పాసు పుస్తకాల కంటే గతంలో ఇచ్చిన పాసు పుస్తకాలే మంచివని ప్రచారం చేస్తున్నారు. ఇది సరికాదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.
- నిజానికి.. రీసర్వే ప్రక్రియకు ముందు జారీచేసిన పాసుబుక్‌లతో పోలిస్తే ప్రస్తుత పాసుపుస్తకాలకే విలువ ఎక్కువ.

కొత్త పాసు పుస్తకంతో రుణాలు రాలేదనే ఫిర్యాదు రాలేదు..

అవాస్తవ ప్రచారం చేస్తున్న వారికి తెలియని విషయం ఏమిటంటే.. జగనన్న భూహక్కు, భూరక్ష పథకం కింద ఇచ్చిన పాసు పుస్తకం (భూహక్కు పత్రం) అత్యంత ఆధునికమైంది. ఇందులో నమోదు చేసిన వివరాలన్నీ ఆన్‌లైన్‌లోని వెబ్‌ల్యాండ్‌లో ఉన్న వివరాలే. అలాగే..

- ఈ పాసుబుక్‌లో భూమికి సంబంధించిన జియో కో–ఆర్డినేటెడ్ లొకేషన్, భూ కమతం స్కెచ్, యజమాని పేరు వంటివన్నీ ఉంటాయి. డిజిటల్ యుగంలో వచ్చిన కొత్త మార్పు ఇది. గతంలో మాదిరిగా పాసు పుస్తకాలు అసలైనవా కాదా? అని ధ్రువీకరించుకోవాల్సిన అవసరంలేదు.
- పాసు పుస్తకాల్లేవని, పోయాయని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం కూడా లేదు. ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలే పక్కాగా ఉంటాయి.
- అంతేకాక.. ఈ కొత్త పాసు పుస్తకాలను ఫోర్జరీచేసే అవకాశం కూడా లేదు. దొంగ పాసు పుస్తకాలను సృష్టించడం కుదరదు.
- పాసు పుస్తకంలో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా నకిలీవి సృష్టించడం సాధ్యం కాదు. అందువల్లే ఈ పాసు పుస్తకంపై భౌతికంగా సంతకాలు అవసరంలేదు.
- ఇలా వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉండడం వల్ల గతంలో మాదిరిగా పాసు పుస్తకాలు ఒకరి పేరుతో, అడంగల్, 1బీ మరొకరి పేరు మీద ఉండే అవకాశంలేదు.
- అందుకే దీన్ని దేశంలోనే అత్యంత ఆధునికమైన భూరికార్డు విధానంగా పలు రాష్ట్రాలు అంగీకరిస్తున్నాయి.
- ఈ పాసు పుస్తకం ద్వారా రుణం రాలేదని, రిజిస్ట్రేషన్ జరగట్లేదని ఇప్పటి వరకు రాష్ట్రంలో ఒక్క ఫిర్యాదు రాలేదు.

జాయింట్ పట్టాలు ఇవ్వొద్దని ఆదేశాలు..

జాయింట్ పట్టాలపైనా అపోహలు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం జాయింట్ ఎల్‌పీఎంలు (ల్యాండ్ పార్సిల్ మాప్) జారీ చెయ్యొద్దని స్పష్టంగా ఆదేశాలిచ్చింది. ఆధీనంలో ఉన్న భూమి ప్రకారం, దానిపై హక్కులపై ప్రకారం సబ్ డివిజన్ చేసుకోని సందర్భాల్లో జాయింట్ ఎల్‌పీఎంలు ఇచ్చారు. గతంలో ఉన్న జాయింట్ పట్టాలవల్ల ఏర్పడిన గొడవలనే ఇప్పుడు కొత్తగా ఏర్పడుతున్న గొడవలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటుచేసిన ధరణి వెబ్‌సైట్‌లో అనుభవదారుల హక్కులు కనపడని విధంగా ఏపీలోనూ హక్కులు కనపడడం లేదంటూ ప్రజల్లో అపోహలు పెంచే ప్రయత్నం జరుగుతోంది. రాష్ట్రంలో భూ హక్కుల రక్షణ విధానం అత్యంత ఆధునికంగా రూపొందించారు. ఈ విధానం భారతదేశంలోనే ఆదర్శంగా నిలిచింది. అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా చట్టప్రకారం జరుగుతున్న రీసర్వే ద్వారా పటిష్టమైన భూ హక్కులను రికార్డు చేసే వ్యవస్థ రాష్ట్రంలో రూపొందింది. ఈ విషయాలేవీ తెలుసుకోకుండా కేవలం రాజకీయ కోణంలో సీపీఐ నాయకుడు నారాయణ ఆరోపణలు చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదు: చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఆక్వా రైతులు పూర్తిగా దెబ్బతిన్నారని పేర్కొన్నారు. పెదకూరపాడు, తణుకు, అమలాపురం, గజపతినగరం నియోజకవర్గాలకు చెందిన కొందరు వ్యక్తులను ఆదివారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి తీసుకువచ్చి పార్టీ కండువాలు కప్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఒక వ్యక్తి విధానాల వల్ల వ్యవస్థలు నాశనం అయితే జీవితాలు నాశనం అవుతాయని, ఈ ఐదేళ్లలో ఇదే జరిగిందని అన్నారు. మొన్న తుపాన్ వస్తే ప్రభుత్వం కనీసం స్పందించలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలు, పేదలు ఆలోచించుకోవాలని చెప్పారు.

చంద్రబాబు నివాసంలో ముగిసిన చండీయాగం

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నివాసంలో మూడు రోజులుగా జరుగుతున్న చండీయాగం, సుదర్శన నారసింహ హోమం ఆదివారంతో ముగిశాయి. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు శతచండీ పారాయణ ఏకోత్తర వృద్ధి మహాచండీ యాగం, సుదర్శన నారసింహ హోమంలో భాగంగా పలు యజ్ఞ క్రతువులు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమంతో యాగం ముగిసింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, కృష్ణా, గుంటూరు జిల్లాల పార్టీ నేతలు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే విష్ణు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): డిజిటల్ యుగంలో వినియోగదారులు నష్టపోకుండా వారి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 'ఈ–కామర్స్, డిజిటల్ వర్తకశకంలో వినియోగదారుల రక్షణ' అనే అంశంపై ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు 6వేల పాఠశాలలు, 175 డిగ్రీ కళాశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటుచేసి విస్తృత ప్రచారం చేస్తున్నామని చెప్పారు. ఒక వస్తువును ఏ ప్రాంతంలో కొనుగోలు చేసినా స్థానిక జిల్లా కమిషన్‌లో ఫిర్యాదు చేసేలా చట్టంలో మార్పులు చేశామన్నారు. విచారణ కోసం నేరుగా వినియోగదారుల కమిషన్‌లకు రాలేని ఫిర్యాదుదారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనేలా చట్ట సవరణ చేశామన్నారు. వస్తువు నాణ్యత, పరిమాణంలో తేడాలు ఉంటే ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా కేసు పెట్టేందుకు అవకాశం కల్పించామన్నారు. వ్యాపార సంస్థల్లో మోసాలపై నిఘా పెట్టి రూ.4.52 కోట్లు జరిమానా విధించినట్లు చెప్పారు. విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లోవిజేతలకు ప్రశంసా పత్రాలను మంత్రి అందజేశారు. 'మేలుకొలుపు' మాస పత్రికను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, డైరెక్టర్ ఎం.విజయసునీత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుంటే.. రూ.25 లక్షల వైద్యం చేతిలో ఉన్నట్టే

▶ మొదటి పేజీ తరువాయి

ప్రయోజనాలన్నీ ప్రజలకు తెలియజేస్తున్నారు. సులువుగా ప్రజలు పథకం సేవలు పొందడం కోసం ప్రభుత్వం ఆరోగ్యశ్రీ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను ప్రతి ఇంటిలో మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయించి, కుటుంబ సభ్యుల ఐడీ ద్వారా లాగిన్ చేయించి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. కాగా.. గత వారంలో లక్షకు పైగా లబ్ధిదారుల ఫోన్లలో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. యాప్‌లో లాగిన్ అవ్వడం ద్వారా పథకం కింద అందే వైద్య సేవలు, నెట్‌వర్క్ ఆస్పత్రులు, గతంలో పొందిన చికిత్సల వివరాలను ఏ విధంగా తెలుసుకోవచ్చో ఏఎన్ఎం, సీహెచ్‌వోలు ప్రజలకు వివరించారు. పథకం కింద సేవలు పొందడంలో ఇంకా ఏవైనా అనుమానాలు, సందేహాలు ఉంటే 104ను ఫోన్ ద్వారా ఎలా సంప్రదించాలన్న దానిపైనా అవగాహన కల్పిస్తున్నారు. పనిలో పనిగా మహిళల భద్రత కోసం ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్‌ను మహిళల ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయించే కార్యక్రమం చేపడుతున్నారు. ఇప్పటి వరకూ దిశ యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోని యువతులు, మహిళలు ఉంటే వారి ఫోన్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, అత్యవసర సమయంలో యాప్ ఎలా సహాయపడుతుందో వివరిస్తున్నారు.


ట్యాబ్‌ల పంపిణీపై అసత్యప్రచారం తగదు

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



గంగాధర నెల్లూరు(చిత్తూరు జిల్లా): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బైజూస్ ట్యాబ్‌లపై పచ్చపత్రికలు అసత్యప్రచారం చేస్తున్నాయని, ఇది ఎంత మాత్రం సమంజసం కాదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన ఆదివారం గంగాధర నెల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా కలిసి రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి చంద్రబాబుకు నచ్చదన్నారు. గతంలో పవన్, చంద్రబాబు ఒకరిని ఒకరు బహిరంగ సభల్లో తీవ్రంగా దుర్భాషలాడుకున్నారని, ఇప్పుడు ప్యాకేజీ ఒప్పందంతో ఇద్దరూ కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై బురదచల్లుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లపై అసత్యప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు, పవన్ కులాలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని ప్రయత్నించడం దుర్మార్గమన్నారు.

'సింహాద్రి'లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం



పరవాడ (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా, పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ రెండో యూనిట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా ఆదివారం ఉదయం 500 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్ బాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం కారణంగా విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. సమస్య తలెత్తిన వెంటనే సాంకేతిక నిపుణులు రంగంలోకి దిగి మరమ్మతులు నిర్వహించారు. బుధవారం ఉదయానికి యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గత నెలలో వార్షిక మరమ్మతుల కోసం నిలిపివేసిన మొదటి యూనిట్‌లో రిపేర్లు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 3, 4 యూనిట్ల నుంచి 1,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నదని సింహాద్రి ఎన్టీపీసీ అధికారులు వెల్లడించారు.



దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును.
పాపులారా! మీ చేతులను శుభ్రము చేసికొనుడి;
ద్విమనస్కులారా! మీ హృదయములను పరిశుద్ధ పరచుకొనుడి.
– క్రైస్తవ ధర్మం

సాక్షి

సోమవారం, 25 డిసెంబర్ 2023

సినిమా రక్తం

'టప్'మంటూ లైట్ వెలుగుతుంది. ఆగంతకుడు ఛాతీ మీద రక్తంతో నేలకొరిగి ఉంటాడు. హీరోయినో, హీరో చెల్లెలో 'కెవ్వు'మని నోటికి చెయ్యడ్డం పెట్టుకుంటూ కేక వేసి 'రక్తం... రక్తం' అని పరిగెడుతుంది. లేదా స్పృహ తప్పి పడిపోతుంది. అందరూ చేరుతారు. పోలీసులు వస్తారు. రక్తం బయటకు వస్తే రక్తం బయటకు రావడానికి కారకులను పట్టుకోవాలి. శిక్షించాలి. అది చట్టం. సమాజానికి వహించవలసిన బాధ్యత. అక్కడి నుంచి సినిమా కథంతా నడుస్తుంది. బ్లాక్ అండ్ వైట్ సినిమాలో రక్తం నల్లగా ఉంటుంది. పైగా కొంచెమే కనిపిస్తుంది. అయినా సరే డైరెక్టర్‌గాని, సినిమా రచయితగాని, హీరోగాని హంతకుణ్ణి క్లయిమాక్స్‌లో పోలీసులకు అప్పజెప్పకుండా ఊరుకునేవారు కాదు.

హిందీలో 'దుష్మన్' అనే సినిమా పెద్ద హిట్. రాజేష్‌ఖన్నా హీరో. లారీ డ్రైవర్. నిర్లక్ష్యంగా లారీ నడిపి గొడ్లు కాచే వ్యక్తి చావుకు కారణం అవుతాడు. జడ్జిగారు అతణ్ణి జైల్లో మగ్గమని తీర్పు చెప్పకుండా, ఏ వ్యక్తి చావుకైతే కారణమయ్యాడో ఆ వ్యక్తి ఊరికెళ్లి, అతడి పొలం పండించి, పిల్లల, ముసలి తల్లిదండ్రుల బాగోగులు చూడమని ఆదేశిస్తాడు. రాజేష్ ఖన్నా ముందు నిరాకరించినా కాలక్రమంలో పరివర్తన చెందుతాడు. ఊరికి ఇలవేల్పుగా మారి క్షమార్హుడవుతాడు. టైరుకు అంటిన రక్తం ఒక మనిషిని చేర్చాల్సిన గమ్యం అది. ఈ సినిమాను తెలుగులో 'ఖైదీ బాబాయ్'గా తీస్తే హిట్ అయ్యింది. ఇదే రాజేష్ ఖన్నా 'రోటీ'లో ఒక వ్యక్తి అకారణ చావుకు కారణమై పశ్చాత్తాపం చెందడమే కథ. గతంలో అలా ఉండేది. హీరో నేరం చేస్తే పశ్చాత్తాపం చెందేవాడు. ప్రాయశ్చిత్తం చేసుకునేవాడు. తప్పు దారి పట్టి ఏ దొంగో, స్మగ్లరో, హంతకుడో అయితే క్లయిమాక్స్‌లో మరణించేవాడు. జైలుకు వెళ్లేవాడు. అట్టి హీరోకు హీరోయిన్ దక్కే అవకాశం లేదు. పోలీస్‌జీపులో వెళ్లిపోతున్న హీరోని గుడ్ల నీరు కక్కుకుంటూ చూడాల్సిందే. 'దీవార్'లో అమితాబ్ చచ్చిపోతాడు. 'ఖైదీ'లో చిరంజీవి జైలుకెళ్లిపోతాడు.

'మల్లీశ్వరి', 'బంగారు పాప' వంటి క్లాసిక్స్ తీసిన బి.ఎన్.రెడ్డి కాసింత కత్తి యుద్ధాలు వగైరా ఉండే 'రాజమకుటం' తీస్తే 'ఈయనకేం పోయేకాలం వచ్చింది' అన్నారట ప్రేక్షకులు హిట్ చేస్తూ కూడా! 'తమరు కూడా రక్తపాతం తీయాలా మహాశయా' అన్నారట సినిమా మిత్రులు. ఆయన బాధపడి, ఇదేదో చెడ్డపేరు వచ్చేలా ఉందని తర్వాత అలాంటి సినిమాల జోలికి పోలేదు. సృజించబడే కళ, సృజిస్తున్న కళాకారుడు వేరువేరు కాదు అనుకునేవారు పూర్వం. కళాకారుడి వ్యక్తిత్వమే కళ వ్యక్తిత్వంగా జనం గుర్తించే వారు. దర్శకులుగాని, హీరోలుగాని తమ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ వస్తే తలవంపులుగా భావించేవారు. 'ఏ సర్టిఫికెట్ వచ్చిందట' అనేది పెద్ద వార్త.

ఎన్.టి.రామారావు 'బొబ్బిలిపులి'లో హింస ఎక్కువైందని సెన్సార్ వారు పేచీ పెట్టారు. కారణం హీరోయే దుర్మార్గులను తుదముట్టిస్తున్నాడు. స్వీయకోర్టు నిర్వహిస్తున్నాడు. రక్తపాతం సృష్టిస్తున్నాడు. దాసరి దర్శకత్వం వహించిన 'తాండ్ర పాపారాయుడు' చారిత్రక చిత్రమే అయినా, బొబ్బిలి యుద్ధమే కథాంశమైనా రక్తం ఎక్కువ కనిపిస్తున్నదని కొన్ని కట్స్ చెప్పారు. 1990ల ముందు వరకూ రక్తం ఎక్కువ కనిపించరాదనే సెన్సార్ నియమం ఉండేది. అంతెందుకు? చచ్చీ చెడీ 'షోలే' సినిమాను తయారు చేసి సెన్సార్‌కు పంపితే క్లయిమాక్స్‌లో సంజీవ్ కుమార్ గబ్బర్ సింగ్‌ను ఎలా చంపుతాడు... సెన్సార్ ఇవ్వం అని గట్టిగా చెప్పారు అధికారులు. దాంతో క్లయిమాక్స్ రీషూట్ చేసి గబ్బర్‌ను పోలీసులకు అప్పజెప్పడం చూపారు. చెడ్డపాత్రలు ఎంత మందినైనా చంపొచ్చు. మంచిపాత్రలు చంపుతూ పోతే సమాజం ఏం నేర్చుకోవాలి? సమాజం మీద ఏర్పడే ప్రభావం ఎట్టిది?

రామ్‌గోపాల్ వర్మ వచ్చి 'శివ' సినిమాతో రక్తపాతాన్ని పెంచాడనే విమర్శలు వచ్చాయి గాని, సినీ హింసలో 'శివ' నేడొక చిన్నగీత. కాలం మారింది. 'మనుషులను చంపుకుంటూ వెళితే ఎవరూ మిగలరు' అని అంటూనే చాలామందిని చంపుకుంటూ వెళ్లడమే హీరోయిజం అయ్యింది. 'ఒక్కొక్కరిని కాదు షేర్‌ఖాన్... వందమందిని పంపు' అని కత్తికొక కండగా నరుకుతుంటే రక్తం ఎగజిమ్మేకొద్దీ కలెక్షన్లు వచ్చిపడ్డాయి. సినిమా ఒప్పుకున్న హీరో కాస్ట్యూమ్స్‌తోపాటు డైరెక్టర్, ఆర్ట్ డైరెక్టర్లతో కూర్చొని పోస్టర్‌లో మెరిసే సరికొత్త మారణాయుధాన్ని తయారు చేయించుకుంటున్నాడు. చాలక భారీ మిషన్‌గన్‌లను కూడా తయారు చేయించుకుంటున్నాడు. పేలుస్తున్నాడు. హీరో ఇంతమందిని చంపుతున్నా సినిమా పోలీసులు ఏమవుతున్నారో ఎందుకు కానరావడం లేదో వారిపైన ఏ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాలో తెలియని అయోమయ స్థితి.

రక్తం మనిషికి జీవధార. చాలా ప్రమాదాల్లో, దాడుల్లో మనుషులు చనిపోయేది ప్రమాద తీవ్రత వల్ల కాదు. రక్తం పోయి. రక్తం అందక. ధర్మరాజు రక్తమే కాదు, ఏ అమాయకుడి నెత్తురు నేల మీద పడ్డా... ఆ నేలకు అది శుభసూచకం కాదు. రక్తాన్ని చూసి చలించని, రక్తాన్ని చూడటం అలవాటుగా మారిన సమాజం మానవీయంగా మనజాలదు. ఎన్ని బ్లడ్‌బ్యాంకులు పెట్టినా చాలనంత రక్తాన్ని ఇవాళ హీరోలు తెరల మీద పారిస్తూ ఉంటే... స్వయంగా కత్తి పట్టి క్రూరంగా గొంతులు కోస్తూ ఉంటే, ఈలలు వేస్తూ గోలలు చేస్తున్న మన ఇంటి పిల్లల్ని మనం ఎలా తయారు చేశామో తల్లిదండ్రులు ఆలోచించాలి.

సినిమా అయినా, సాహిత్యమైనా జంతువును మనిషిగా చేయాలి. మనిషిని జంతువుగా కాదు! కమర్షియల్ కళకు కూడా ఒక హద్దు ఉంటుంది. ఆ హద్దును సినిమావారు గుర్తెరిగితే మంచిది. లేదంటే ప్రేక్షకులే ఏదో ఒకనాడు గుర్తు చేస్తారు. ఫస్ట్‌హాఫ్‌లో కాకపోతే సెకండ్ హాఫ్‌లో! ఏ సినిమాకైనా 'ది ఎండ్' పడవలసిందే కదా!!

ఇక్కడ ముస్లిమ్ కావడం నేరమా?

కామెంట్



కరణ్ థాపర్

భారత రాజ్యాంగం భారతదేశాన్ని లౌకికరాజ్యంగా నిర్వచించింది. అందులోని లౌకిక భావానికి తీవ్రమైన సవాలుగా పరిణమిస్తున్న ఘటనలు నేడు దేశంలో అనేకచోట్ల సంభవిస్తున్నాయి. అధిక సంఖ్యాకుల ప్రాధాన్యాలకు కట్టుబడి అల్పసంఖ్యాకులు, ముఖ్యంగా ముస్లింలు జీవించక తప్పదనే వాస్తవాన్ని పాలనాపరమైన నిర్ణయాలు బలపరుస్తున్నాయి. దీనివల్ల 'అధిక సంఖ్యాకుల దేశంలో అల్పసంఖ్యాకులుగా ఉండటం అనేది ఎలాంటిది?' అనే ప్రశ్న రావడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, ఆ ప్రశ్న అడిగే భారతీయుల సంఖ్య నానాటికీ ఎక్కువవుతుండటం గురించే మనం ఆందోళన చెందాలి. ఆఖరికి, ఉనికి వంటి అతి ముఖ్యమైన గుర్తింపు నిరాకరణకు కూడా ఒక వర్గాన్ని గురి చేయడం సమ్మతం అవుతుందా?


వాదనలకిది తావులేని ప్రశ్న కాకున్నా, ''భారతదేశంలో ముస్లింగా ఉండటం ఎలాంటిది?'' అని మనం ఎక్కువగా అడుగుతుండటాన్ని అత్యంత దురదృష్టకరమైన అభియోగాలలో ఒకటిగా నేడు మనదేశం ఎదుర్కొంటూ ఉంది. ''భారతదేశంలో ముస్లింగా ఉండటమన్నది ఎలాంటిది?'' అనే ఈ ప్రశ్నకు జవాబు – ఒక హిందువు, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ లేదా నాస్తికుడిగా ఉండటం ఎలాంటిది అనే ప్రశ్నకు వచ్చే సమాధానానికి భిన్నంగా ఏమీ ఉండనవసరం లేదు. కానీ ఉంటోంది! అలా ఎందుకు ఉంటున్నదో... జియా ఉస్ సలామ్ తాజా పుస్తకం 'బీయింగ్ ముస్లిం ఇన్ హిందూ ఇండియా: ఎ క్రిటికల్ వ్యూ'... కలవరపాటును కలిగించే వివరాలతో విశదీకరిస్తోంది.

కాస్త వెనక్కెళ్లి ముందుకొస్తాను. కానీ ఒకటి గుర్తుంచుకోవాలి. గత దశాబ్ద కాలంలో పరిస్థితి ఇంతని అంతని చెప్పలేనంతగా దిగజారిపోయింది. దేశంలో ముస్లింల జనాభా 15 శాతం. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో వారి వాటా కేవలం 4.9 శాతం. పారామిలిటరీ సైనిక దళాల్లో 4.6 శాతం. ఐయ్యేఎస్‌లు, ఐఎఫ్ఎస్‌లు, ఐపీఎస్‌లలో 3.2 శాతం. సైన్యంలో బహుశా తక్కువలో తక్కువగా 1 శాతం. 2006 సచార్ కమిటీ నివేదిక ప్రకారం... ముస్లింలు ఆర్థికంగా, సామాజికంగా షెడ్యూల్డు కులాలు, తెగల కంటే కూడా మరీ అధ్వాన్నమైన జీవన స్థితిగతులలో ఉన్నారన్నది మనకు తెలిసిన విషయమే.

రాజకీయాలలో సైతం, ఒకప్పుడు వారి స్వరం వినిపించిన చోట ఇప్పుడది క్షీణిస్తూ ఉండటం మాత్రమే కాదు, కొన్ని చోట్ల వెనక్కు మళ్లుతూ కూడా ఉంది. దామాషా ప్రకారం ముస్లింలకు లోక్‌సభలో 74 సీట్లు ఉండాలి. కానీ ఉన్నది 27 మంది. మన 28 రాష్ట్రాలలో ఒక్క రాష్ట్రానికి కూడా ముస్లిం ముఖ్యమంత్రి లేరు. 15 రాష్ట్రాలలో ముస్లిం ఎంపీలే లేరు. 10 రాష్ట్రాలలో మాత్రమే మైనారిటీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా ఒక ముస్లిం ఉన్నారు. అదేమీ విశేషం కాదు కదా!

నిజానికి ఏ పార్టీ కూడా భారతీయ జనతాపార్టీ అంత కరాఖండిగా ముస్లింలకు ముఖం చాటేయలేదు. 2014లో గానీ, 2019లో గానీ బీజేపీ ఒక్క ముస్లింను కూడా లోక్‌సభ ఎంపీగా ఎన్నికలకు ఎంపిక చేసుకోలేదు. నేటికీ ఆ పార్టీ కనీసం రాజ్యసభకు ఎంచుకున్న ముస్లిం ఎంపీ ఒక్కరు కూడా లేరు. కర్ణాటకలో 14 శాతం మంది, ఉత్తర ప్రదేశ్‌లో 19 శాతం మంది ముస్లింలు ఉన్నప్పటికీ బీజేపీకి ఆ రాష్ట్రాలలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా లేరు. గుజరాత్‌లో 1998 నుండి ఏ లోక్‌సభకు, లేదా ఏ విధాన సభకు కూడా ముస్లిం అభ్యర్థిని నిలబెట్టలేదు. అంతెందుకు, గత ఏప్రిల్‌లో కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి కె.ఎస్. ఈశ్వరప్ప బీజేపీకి ముస్లింల ఓట్లే అవసరం లేదన్నారు.





పాలకపక్ష నాయకులు, వారి సన్నిహిత మద్దతుదారులు ముస్లింల గురించి ఏదైతే మాట్లాడుతుంటారో ఆ ప్రకారం ముస్లింల పరిస్థితి మన దేశంలో దిగజారిపోతూ ఉంటుంది. వారిని 'బాబర్ కీ ఔలాద్' (బాబర్ సంతానం) అంటుంటారు. 'అబ్బా జాన్'లు అంటూ అవహేళన చేస్తుంటారు. 'పాకిస్తాన్‌కు వెళ్లిపొండి' అని పదే పదే చెబుతుంటారు. వారి ఊచకోతకు పిలుపు అందినప్పుడు – అయితే గియితే, కొన్ని బీజేపీ గొంతులు ఆ పిలుపును ఖండిస్తూ మాట్లాడతాయి. వారు అల్లర్లకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తే నేర నిర్ధారణ కాకముందే వారి ఇళ్లు నేలమట్టం అవుతాయి. తరచూ వారు లవ్ జిహాద్, పశువుల అక్రమ రవాణా ఆరోపణలతో హత్యకు గురవుతుంటారు.

2019 జూన్‌లో జార్ఖండ్‌లో ఒక ముస్లిం వ్యక్తికి ఏం జరిగిందనే దాని గురించి జియా ఉస్ సలామ్ పుస్తకం నుంచి నేనొక ఉదాహరణ ఇస్తాను. ఏదో ఒక ఉదంతాన్ని ప్రత్యేకంగా పేర్కొనడం ముస్లింలపై కనబరుస్తున్న అసహనాన్ని వేలెత్తి చూపడం కోసమేనని అనిపించవచ్చు కానీ, అటువంటి అనేక ఘటనలకు ఇదొక దృష్టాంతం. ''విధ్వంసకరమైన ఆ హింసాత్మక సమూహం... అతడిని దీపస్తంభానికి కట్టివేసి ఇనుప కడ్డీలు మొదలు... కర్రలు, టైర్లు, బెల్టుల వరకు... చేతిలో ఏది ఉంటే అది తీసుకుని చావబాదింది. ఆ వ్యక్తి తల, చేతులు, ముఖం రక్తం ఓడుతున్నాయి. అతని కాళ్లు వాచిపోయాయి. చాలాచోట్ల ఎముకలు విరిగిపోయాయి. ఆ దెబ్బలకు నిలబడలేక మనిషి కూలిపోయాడు. అతడు చేసిన నేరం ఏమిటి? నేటి కొత్త భారతదేశంలో అతడొక ముస్లిం అవడమేనా?''

ఇదేమీ నూటికో కోటికో ఒకటిగా జరిగిన ఘటన కాదని పుస్తకంలో జియా పొందుపరిచిన వాస్తవాలు సూచిస్తున్నాయి. ''ముస్లింలపై ఇటువంటి ద్వేషపూరితమైన నేరాలు 2014–2017 మధ్య కాలంలో 30 శాతం పెరిగాయి. అనంతరం, 2019లో మోదీ రెండోసారి ప్రధానమంత్రి అయ్యాక లెక్కకు మిక్కిలిగా పెరిగిపోయాయి. మతవిద్వేష నేరాలు రెట్టింపు అయ్యాయి.

ఉనికి వంటి అతి ముఖ్యమైన గుర్తింపు నిరాకరణకు కూడా ముస్లింలు గురయ్యారు. ఆరెస్సెస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్... ''ప్రతి భారతీయుడూ హిందువే'' అని అన్నారు. ఈ మాటను ముస్లింలు మాత్రమే కాదు, సిక్కులు కూడా సమ్మతించరు. అయినప్పటికీ ఆయన మరికాస్త ముందుకు వెళ్లి... ''ఈ రోజున భారత దేశంలో ఉన్నవారంతా హైందవ సంస్కృతికి, హిందూ పూర్వీకులకు, హిందూ భూభాగానికి చెందినవారు. ఇందులో రెండో మాటే లేదు'' అన్నారు.

''భారతదేశంలో ముస్లింగా ఉండటం ఎలాంటిది?'' అనే ప్రశ్నకు వచ్చే సమాధానం ఎందుకని మన దేశ సమగ్రతకూ, భవిష్యత్తుకూ ముప్పు కలిగించేలా ఉంటుందో వివరించేందుకు చాలినంతగా చెప్పాననే నేను భావిస్తున్నాను. ఇది చాలా స్పష్టమైన సమాధానమని నేను చెప్పగలను. కానీ ఈ సమాధానం మన ముస్లిం సోదరులకు, సోదరీ మణులకు ఎలా అనిపిస్తుందో ఒక్కక్షణం ఆలోచించండి. తక్కిన మనందరికీ ఇది మనదికాని సమస్యపై ఒక విశ్లేషణ. వారికి మాత్రం వారి జీవన్మరణ సమస్య. సమస్య గురించి మనం ఆశాజనకమైన రీతిలో లోతుగా ఆలోచిస్తాం. కానీ వారు ఆ పరిస్థితిలో జీవిస్తారు. అది మరింత దారుణంగా తయారవదు కదా అని బిక్కుబిక్కుమంటుంటారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎండినదే నింపుతుంది!



రుతువులతో ముడిపడిన సంప్రదాయ ఆహార అలవాట్ల పరంగా చూస్తే – చారిత్రకంగా విస్మృత వర్గాలు ఆర్థికంగానే కాక అనేక సవాళ్లు ఎదుర్కొంటూ ఉంటాయి. కాబట్టి ఎండబెట్టిన మాంసం అనేది మంది ఎంపిక అవుతుంది. అది మన్నిక కాలాన్ని పెంచుతుంది. ఆహార భద్రతను కల్పిస్తుంది.

– సదాఫ్ హుస్సేన్, షెఫ్

నో మాస్టర్?



2016లో యేల్, హార్వర్డ్ యూనివర్సిటీలు రెండూ 'మాస్టర్' అనే పదాన్ని పక్కనపెట్టాయి. ఆ శబ్దంలోని 'అండర్‌టోన్'(తక్కువతనం) వల్ల. బదులుగా యేల్ 'హెడ్ ఆఫ్ కాలేజ్', హార్వర్డ్ 'ఫ్యాకల్టీ డీన్' అనే మాటల్ని వాడుతున్నాయి. కానీ ఆసక్తికరమైన విషయం ఏమంటే, రెండింట్లోనూ మాస్టర్స్ డిగ్రీలు ఇంకా కొనసాగుతున్నాయి.

– రాబ్ హెండెర్‌సన్, నటుడు

భిన్న భారతం



మా అమ్మ మరాఠా. మా నాన్న కేరళ రోమన్ కేథలిక్. నేను ముంబయిలో పుట్టాను. చెన్నైలో పెరిగాను. ఎక్కువ కాలం పశ్చిమ బెంగాల్‌లో గడిపాను. నా భార్యది డెహ్రాడూన్ (ఘఢ్‌వాల్ బ్రాహ్మణ్). మాకు కాబోయే కోడలు మార్వాడీ. కాబోయే అల్లుడు సింధీ. నేను హిందీ, మలయాళం, ఇంగ్లీష్, మరాఠీ ధారాళంగా ; బెంగాలీ, పంజాబీ, కన్నడ, తెలుగు కొద్దిగా మాట్లాడతాను ; తమిళంలో ఆలోచిస్తాను.

– ఎం.జె. అగస్టిన్ వినోద్, గ్రూప్ కెప్టెన్ (రిటైర్డ్)

ఎవరికి చెప్పకోను?



పుణె వెళ్తున్న స్లీపర్ బస్సులో ఇద్దరు పిల్లలు పదేపదే పరుగెత్తుతున్నారు. నేను ఆఫీసులో అలసిపోయినందువల్ల ప్రశాంతంగా నిద్రపోవాలనుకున్నాను. కానీ ఈ పిల్లలేమో అరుస్తున్నారు, నవ్వుతున్నారు. బస్సులో బీభత్సం సృష్టిస్తున్నారు. వీళ్ల మీద ఎవరికైనా ఫిర్యాదు చేద్దామని చూస్తే... వాళ్లు నా పిల్లలే!

– కస్తూరీ సనప్, ఆర్థికాంశాల సలహాదారు

మళ్లీ కోలుకుంటుందా?



నాకు మొదటి నుంచీ అనుమానాలు ఎక్కువే. కానీ కోవిడ్ దాదాపుగా ప్రతిదాని పట్ల నా విశ్వాసాన్ని దెబ్బకొట్టింది. యావత్ సమాజం ఒక్కసారిగా తన వివేకాన్ని కోల్పోయింది. ఇప్పటికి కూడా అది కోలుకోలేదు.

– టోబీ రోజర్స్, పరిశోధకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

విలువల శిఖరం

సందర్భం




నందిరాజు రాధాకృష్ణ

కవి, గాయకుడు, ద్రష్ట, మేధావి, భాషా ప్రవీణుడు, సంఘ్ కార్యకర్త, సాత్వికుడు, సంస్కృతీ సంప్రదాయ విలువలకు పట్టం కట్టిన రాజకీయ వేత్త, పాలక పక్షం ప్రశంలందుకున్న ప్రతిపక్ష నేత, ముమ్మారు ప్రధాని... అన్నీ కలగలిపిన ఒక అరుదైన రాజనీతిజ్ఞుడు అటల్ బిహారి వాజ్‌పేయి! 1967 ఎన్నికల్లో 'భారతీయ జనసంఘ్' అభ్యర్థులకు ప్రచారం చేసే క్రమంలో ఆయనకు అతి దగ్గరగా కూర్చున్న అదృష్టం నాది.

పాత్రికేయంలో ప్రవేశించిన తరువాత విజయవాడ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో బహిరంగ సభలో ప్రసంగాన్ని వార్తగా మలచాను. ఖమ్మం పర్యటన సందర్భంగా ముందుగానే బీజేపీ నాయకులు దారపునేని కోటేశ్వర రావు, డాక్టర్ జయచంద్రారెడ్డి, మురళీధర్‌ల సహకారంతో ప్రత్యేక ఇంటర్వ్యూ కోసం అనుమతి పొంది గంటసేపు భేటీ అయ్యే అవకాశం చిక్కింది. ప్రభుత్వ అతిథి గృహంలో ఆయనతో సంభాషించి ప్రత్యేక ఇంటర్వ్యూ చేసినప్పుడు ఆయన, నేను, దారపునేని మాత్రమే ఉన్నాం.

ఆయన హిందీలో మొదలెట్టేసరికి. కళ్ళు తేలేసి దారపునేని గారి వైపు చూశాను. ఆయన జోక్యం చేసుకుని 'వీరికి హిందీ రాదు, ఇంగ్లీష్‌లో మొదలెట్టండి' అనగానే ఆశ్చర్యంతో చూసి, 'పాత్రికేయులు, చదువుకున్నవారు, హైదరాబాద్‌లో పని చేశారు.. హిందీ రాదా? మీ స్వస్థలం తమిళనాడా! వారు హిందీ ఇష్టపడరులే' అన్నారు. నేను 'తెలుగు, ఇంగ్లీష్‌లో మాత్రమే రాయగలను, మాట్లాడగలను' అన్నాను. 'సంస్కృతం చదువుకున్నారా' అని అడిగారు. తల అడ్డంగా ఊపాను. నవ్వేశారు. 'మిమ్మల్ని ఆర్నెల్లపాటు ఢిల్లీ తీసుకెళ్ళాల్సిందే అయితే' అని చమత్కరించారు. ఇంటర్వ్యూ ఇంగ్లీష్‌లో సాగింది. నేను రాసుకుంటూనే టేప్ కూడా చేశాను. 'యూ ఆర్ ఇంటెలిజెంట్ అండ్ కాషస్ ఆల్సో. ఇట్ హెల్ప్స్ యూ టు చెక్ అండ్ క్రాస్ చెక్ బిఫోర్ ఫైలింగ్ స్టోరీ' అని మెచ్చుకున్నారు. ఆ మర్నాడు ఆ ఇంటర్వ్యూ తెలుగు, ఇంగ్లీష్ పత్రికల్లో ప్రముఖంగా రావడం, ఆయన డాక్టర్ జయచంద్రారెడ్డితో ఫోన్‌లో ఇంటర్వ్యూ గురించి మెచ్చుకోవడం... పెద్ద విజయం సాధించిన అనుభూతి కలిగించింది.

పాత్రికేయునిగా, హైదరాబాద్‌లో ప్రధానిగా ఆయన కార్యక్రమాలకు హాజరై ఆయనను అతి దగ్గరగా పరిశీలించే అవకాశం లభించింది. మంద్ర స్వరంలో ఛలోక్తులతో, సూక్తులతో... సాగేది బహిరంగ సభలలో ఆయన ఉపన్యాసం. ఆ రోజుల్లో సభలకు ఐదు వేలమంది హాజరైతే ఘనం. ఆయన ప్రసంగానికి పెద్దలు, విద్యావంతులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భారీగా హాజరయ్యేవారు.



వాజ్‌పేయి 1924 డిసెంబర్ 25వ తేదీన గ్వాలియర్‌లో ఉపాధ్యాయ కుటుంబంలో క్రీస్తు జన్మ దినాన పుట్టిన గొప్ప మానవతా వాది. కాన్పూరు దయానంద ఆంగ్లో వైదిక కళాశాలలో రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విస్తారక్‌గా ఉత్తరప్రదేశ్ వెళ్ళిన వాజ్ పేయి, అక్కడ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నడిపిన 'రాష్ట్రధర్మ' (హిందీ మాస పత్రిక), 'పాంచజన్య' (హిందీ వారపత్రిక)ల్లోనూ, 'స్వదేశ్', 'వీర్ అర్జున్' వంటి దినపత్రికలలోనూ పని చేశారు. ఆయన ఆజన్మ బ్రహ్మచారి.

తాను అమితంగా ప్రేమించే భారతదేశం పట్ల ఆయన నిస్వార్థ అంకితభావానికీ, అర్ధ శతాబ్దంపాటు సమాజానికీ, దేశానికీ ఆయన అందించిన సేవలకూ గుర్తింపుగా 1992లో 'పద్మవిభూషణ్'నూ, 1994లో 'ఉత్తమ పార్లమెంటేరియన్' అవార్డునూ, 2015లో దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'నూ ప్రభుత్వం ప్రదానం చేసింది. అనారోగ్యంతో పూర్తిగా మంచానికే పరిమితమైన వాజ్‌పేయికి భారతరత్న ప్రదానం చేయడానికి స్వయంగా నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆయన నివాసానికే తరలి వెళ్లారు. ఆయన పుట్టిన రోజును భారత ప్రభుత్వం 'సుపరిపాలనా దినం'గా ప్రకటించింది. అటల్ అద్వితీయమైన వాక్ పటిమకు మంత్ర ముగ్ధుడైన భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ 'ఏదో ఒకరోజు వాజ్‌పేయి దేశ ప్రధాని అవుతార'న్న మాటలు 39 ఏళ్ల తర్వాత నిజమయ్యాయి.

ప్రతిపక్ష నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయిని తన గురువుగా అంగీకరించి ఆయన ద్వారా తానూ ఎంతో ఉత్తేజం పొందానని దివంగత ప్రధాని పీవీ నరసింహారావు పార్లమెంటులో పేర్కొన్నారు. వాజ్‌పేయి తాను ప్రతిపక్షంలో ఉన్నా... ఇందిరాగాంధీ ధైర్య సాహసాలను శ్లాఘించిన ప్రజాస్వామ్యవాది. 10 సార్లు లోక్ సభకూ, 2 సార్లు రాజ్యసభకూ ఎన్నికయ్యారు. నాలుగు రాష్ట్రాలలో ఏడు నియోజక వర్గాల నుంచి గెలిచిన ఒకే ఒక్క నాయకుడు ఆయనే.

మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని జనతా ప్రభుత్వంలో భారత విదేశాంగ శాఖ మంత్రిగా విధులు నిర్వర్తించారు. 1996 సార్వత్రిక ఎన్నికల తర్వాత బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించి ప్రధానిగా వాజ్‌పేయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. స్పష్టమైన మెజారిటీ, ఇతర పార్టీల మద్దతు లేకపోవడంతో 13 రోజుల తర్వాత అటల్‌జీ రాజీనామా చేయాల్సి వచ్చింది. 1998–99లో 13 నెలలు ప్రధానిగా ఉన్నారు. మూడోసారి 1999 నుంచి 2004 వరకు ఐదేళ్ల పాటు పూర్తికాలం ప్రధానమంత్రిగా సేవలందించారు.

ఆయన ఆరోగ్యం ఎలా ఉందో కూడా ప్రపంచానికి తెలియకుండా అజ్ఞాతంలో కొన్నేళ్ళు ఉండి 2018 ఆగస్ట్ 16న దివంగతులు కావడంతో భారత్ ఒక అనర్ఘ రత్నాన్ని కోల్పోయింది. జయంతి, వర్ధంతులను నామమాత్రంగా జరపడం మినహా ఆయన్ను తలుచుకునేవారే కనపడటం లేదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 98481 28215

(నేడు మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి వత్సర ప్రారంభం)

యేసు అనే ప్రేమ

సందర్భం



శ్రీశ్రీ రవిశంకర్

ప్రేమకు నామ రూపాలు లేవు, అయినా అన్ని పేర్లలోనూ, అన్నిరూపాలలోనూ వ్యక్తమవుతుంది. ఈ సృష్టిలోని అతి పెద్ద రహస్యం ప్రేమ. ఈ సమస్త విశ్వాన్నీ ఆవరించి ఉన్న ప్రేమను గమనించడానికి మీకు నిశితమైన దృష్టి అవసరం. తన గూటిలో ఉన్న చిన్ని పిల్లకు ఆహారాన్ని అందిస్తున్న ఆ పక్షిని చూడండి. చిన్న పక్షి తన తల్లి రాక కోసం అలా వేచి ఉంది. అందులో ప్రేమ ఉంది. చేపలలో, ఆకాశంలో, నీటిలో, నేలపై అంతటా ప్రేమ ఉంది. అంతరిక్షంలో ప్రేమ ఉంది. ప్రేమ అనేది ధైర్యంతో వస్తుంది.

ప్రేమ యొక్క సంపూర్ణ వ్యక్తీకరణను మీరు యేసులో కనుగొంటారు. ప్రేమ అనేది విశ్వంలో అత్యంత బలమైన శక్తి. అయినప్పటికీ ప్రేమ మనల్ని సున్నితంగా చేస్తుంది. ప్రేమలో ఉన్నప్పుడు మనం అత్యంత బలహీనులం అయిపోతాం. అందుకే యేసు మానవాళికి సుపరిచితమైన భావనలను పడగొట్టాడు. 'బలవంతులు భూమిని వారసత్వంగా పొందుతారు' అని చెప్పడానికి బదులుగా, 'సాత్వికులు భూమిని వారసత్వంగా పొందుతారు. సాత్వికులు స్వర్గాన్ని వారసత్వంగా పొందుతారు' అని చెప్పాడు. అతడికి ఆ ధైర్యం ఉంది. ఎందుకంటే, ప్రేమ ఆ ధైర్యాన్ని కలిగిస్తుంది.



మీలో ప్రాణశక్తి పొంగిపొర్లుతూ ఉండకపోతే మీరు యేసు బోధలను అర్థం చేసుకోలేరు. అప్పుడది కేవలం ఒక సూత్రంలా మాత్రమే మీ తలకెక్కుతుంది. మీకు తెలుసా, యేసును అర్థం చేసుకోవాలంటే, మన హృదయంతో అతడిని అందుకోవాలి. మన హృదయంలో అతని ఉనికిని అనుభూతి చెందాలి. బుద్ధి అతడిని అర్థం చేసుకోలేదు. హృదయం మాత్రమే యేసును తెలుసుకోగలదు. ఒకచోట అధికారం ఉందని మీరు గమనిస్తే, అక్కడ ప్రేమ ఉండలేదు. ప్రేమ ఉన్న చోట అధికారం అవసరం లేదు. మిమ్మల్ని ప్రేమించే వ్యక్తి మీపై ఎక్కువ అధికారం కలిగి ఉండటం మీరు గమనించే ఉంటారు. యేసు తన చేతులు చాచి, 'రా, నువ్వు నా స్నేహితుడివి, భయపడకు, నన్ను బలిపీఠం మీద పెట్టకు. నాకు నీ హృదయంలో చోటివ్వు. నీ చుట్టూ కనిపించే ప్రతి ఒక్కరిలో నన్ను చూడు. నేను నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో, లేదా నువ్వు నన్ను ఎంతగా ప్రేమిస్తున్నావో ప్రతీ ఒక్కరినీ అంతగా ప్రేమించు. దాన్ని చుట్టుపక్కల అందరితో పంచుకో' అని పలికాడు. ప్రేమ యొక్క ఆ పూర్ణ స్వరూపాన్ని చూడటానికి మీకు ఇంకేం కావాలి?

క్రిస్మస్ కరోల్‌లోని ఒక అందమైన పాట – 'స్వర్గపు శాంతితో నిద్రపోండి' అని చెబుతుంది – దీని అర్థం ఏమిటి?

చిన్న మనసు పెద్ద మనసు ఒడిలో పడుకుంటే స్వర్గంలో ఉన్నట్లు ప్రశాంతంగా నిద్రిస్తుంది. చిన్న మనసు చిన్నపిల్ల లాంటిది – ఎప్పుడూ చురుగ్గా ఉంటుంది. ఏడుస్తూ... అది కావాలి, ఇది కావాలి అని మారాం చేస్తుంటుంది. అదెప్పుడూ పెద్ద మనసుపై ఆధారపడి ఉంటుంది. పెద్ద మనసు తల్లి లాంటిది. చిన్న మనసు పెద్ద మనసుకు దూరంగా ఉన్నప్పుడు, కంగారుపడి గందరగోళంలో మునిగిపోయి, ఏడుపు మొదలుపెట్టి, పరుగెత్తుకుంటూ తిరిగి పెద్ద మనస్సు దగ్గరకు వచ్చేస్తుంది. అక్కడ అది శాంతిని కనుగొంటుంది. ఉపశమనాన్ని పొందుతుంది. అక్కడ ఆ చిన్న 'నేను' అనే భావం, లేదా చిన్న మనసు, స్వర్గంలో ఉన్నంత ప్రశాంతంగా, విశ్వవ్యాప్తమైన పెద్ద మనసు ఒడిలో నిద్రిస్తుంది. పవిత్రత అనేది తల్లీ బిడ్డలు కలిసి ఉన్నప్పుడు కలిగేది. తల్లీ బిడ్డలు ఇరువురూ స్వర్గపు ప్రశాంతతలో ఉంటే, అదే ధ్యానం.

మీరు ప్రేమ అనే పదార్థంతో రూపొందించబడ్డారని మీరు తప్పక గుర్తించాలి. మీలో ప్రతి ఒక్కరూ ఈ భూమిపై ఉన్న ప్రత్యేకమైన బహుమతి. మీరే ఒక క్రిస్మస్ చెట్టు. సంవత్సరంలోని ఈ సమయంలో, మిగతా చెట్లన్నీ మోడులై ఉన్నప్పుడు, మీరు మాత్రం పచ్చగా, మీ శాఖలను పైకి ఎత్తి నిలబడి ఉన్నారు. మీరు మీ కోసం కాకుండా మీ చుట్టూ ఉన్న వారి కోసం బహుమతులను, దీపాలను తీసుకుని వచ్చారు. మీరు తీసుకువచ్చిన (మీలో ఉన్న) అన్ని బహుమతులు (సుగుణాలు, నైపుణ్యాలు) మీ కోసం కాదు, అవి మీ చుట్టూ ఉన్న వారి కోసమే అని గుర్తుంచుకోండి. మీ వద్దకు వచ్చే ఎవరికైనా మీవద్ద ఉన్న బహుమతుల్ని అందించండి. ఇలా చేయండి! ఇక మీ అవసరాలన్నీ ఎలా తీర్చబడుతున్నాయో మీరే చూస్తారు.

వ్యాసకర్త ఆధ్యాత్మిక గురువు

(నేడు క్రిస్మస్ పర్వదినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: శు.చతుర్దశి తె.4.58 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి పౌర్ణమి, నక్షత్రం: రోహిణి రా.9.41 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: ప.1.45 నుండి 3.17 వరకు, తదుపరి తె.3.24 నుండి 5.00 వరకు, దుర్ముహూర్తం: ప.12.22 నుండి 1.05 వరకు, తదుపరి ప.2.36 నుండి 3.24 వరకు, అమృతఘడియలు: సా.6.34 నుండి 8.11 వరకు ; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.31, సూర్యాస్తమయం: 5.28.

క్లుప్తంగా...

బహుజన ద్రోహులకు రాజకీయ సన్యాసం

1,183వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: బహుజనుల సంక్షేమానికి తూట్లు పొడుస్తున్న పార్టీలకు రాజకీయ సన్యాసం తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,183వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో ఆదివారం పలువురు మాట్లాడారు. బాబు 14 సంవత్సరాల పాలనలో తమను అణచివేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు అన్ని విధాలా మేలు చేసి ఇళ్ల స్థలాలు, ఇళ్లు అందించారని చెప్పారు. అధికారం అడ్డుపెట్టుకుని భారీ అవినీతికి తెర లేపిన బాబు అవినీతి కేసుల్లో పట్టుబడినా.. అనారోగ్యం సాకుతో వ్యవస్థలను తప్పుదారి పట్టించి బయట తిరుగుతున్నాడని, ఆయనను జైల్లో పెట్టి విచారణ చేసి తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

చంద్రబాబుకు తన పాలనపై నమ్మకం లేదు

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శ



వెంకటాచలం: పద్నాలుగేళ్ల తన పాలన చూసిన ప్రజలు మళ్లీ తమను గెలిపిస్తారనే నమ్మకం మాజీ సీఎం చంద్రబాబుకు లేదని, అందుకే గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి వ్యూహకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిషోర్(పీకే)ను ఆశ్రయించారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ఇవ్వడం, ఆనక తప్పడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవాచేశారు. 2014 ఎన్నికల్లో ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు... మళ్లీ 2024 ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావాలని అడ్డదారులు తొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్సార్‌సీపీకి వ్యూహకర్తగా పని చేసిన సమయంలో ప్రశాంత్ కిషోర్‌పై 'ఇదేమన్నా బీహార్ అనుకుంటున్నాడా.. బీహారీ గూండా తోక కత్తిరిస్తా..' అని చంద్రబాబు విమర్శలు చేశారని గుర్తుచేశారు. ప్రజలపై నమ్మకం లేని చంద్రబాబు, లోకేశ్ రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా టీడీపీని గెలిపించాలని ప్రశాంత్ కిషోర్‌ను ఆశ్రయించడం సిగ్గుచేటన్నారు.

జిందాల్‌తో స్టీల్ ప్లాంట్ ఒప్పందం రద్దు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

సాక్షి, అమరావతి : విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జిందాల్ స్టీల్‌తో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసి.. 3వ ఫర్నేస్ నిర్వహణను సెయిల్‌కు అప్పగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని ఆధునికమైన బ్లాస్టర్‌నెస్ 3ఫర్నేస్‌ను కేంద్ర ప్రభుత్వం 23 నెలలక్రితం కావాలని మూసివేసిందని తెలిపారు. ముడిసరుకు కొనడానికి నిధులు లేవనే పేరుతో స్టీల్‌ప్లాంటు ఉత్పత్తి తగ్గించి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టివేసిందని ఆరోపించారు. విశాఖ ఉక్కును కక్షపూరితంగా అమ్మినా, మూసినా రాష్ట్ర ప్రజానీకం అంగీకరించదని పేర్కొన్నారు. ఉక్కు కార్మికుల ఆందోళనకు సీపీఎం తొలి నుంచి అండగా నిలుస్తుందని వివరించారు.

బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడింది జగనే..

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్



మైలవరం: బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ క్లాస్ అని.. వారి ఆత్మగౌరవాన్ని కాపాడిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో ఆదివారం బీసీ సంఘం ఆధ్వర్యంలో బీసీల ఐక్యతా ర్యాలీ జరిగింది. స్థానిక ఆర్ అండ్ బీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గౌతు లచ్చన్న, మహాత్మా పూలే విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ స్థాయి నుంచి రాజ్యసభ స్థానాల వరకు, మంత్రి వర్గంలోనూ నామినేటెడ్ పదవుల్లోనూ, ఎమ్మెల్సీలుగా బీసీలకు రాజ్యాధికారంలో 65శాతం పైగా వాటా ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విజయవాడ ఎంపీ సీటును బీసీలకు కేటాయించాలని, ఎన్టీఆర్ జిల్లాలో రెండు అసెంబ్లీ టికెట్లు బీసీలకు కేటాయించాలని కోరారు. నియోజకవర్గ, జిల్లా కమిటీలకు అభ్యర్థులను నియమించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈతాకుల జగదీష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి పాల్గొన్నారు.

పగబట్టి.. బాబు పిచ్చిపట్టి..

రాష్ట్రంపై కక్ష కట్టింది నువ్వే రామోజీ..

- ఏ ప్రభుత్వమైనా పరిశ్రమలను ఎందుకు వెళ్లగొడుతుంది చెప్పు?
- చంద్రబాబు అధికారంలో లేకపోతే అవాస్తవాలతో రాష్ట్ర పరువును దెబ్బతీస్తారా?
- ముఖేష్ అంబానీ రాష్ట్రంలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు పెడుతూ ఒప్పందం చేసుకున్నది నిజం కాదా..
- రాష్ట్ర ప్రభుత్వం మద్దతు బాగుందని ఆయనన్న మాటలు తెలీదా!
- అంబానీ రూ.15,000 కోట్ల పెట్టుబడిని కక్షగట్టి వెళ్లగొట్టారని ఎలా రాస్తావు?
- అలాగే, ఆదానీ గ్రూపు రూ.63,664 కోట్ల పెట్టుబడులు పెడుతుంటే అదీ వెళ్లిపోయిందంటూ ఆ రాతలేంటి?
- కక్షకట్టి వెళ్లగొట్టారు అంటూ నువ్వు రాసిన వాళ్లు మరెందుకు భారీ పెట్టుబడులు పెడుతున్నారు ?
- నువ్వన్నట్లే పరిశ్రమలు వెళ్లిపోతుంటే జీఎస్‌డీపీలో పరిశ్రమల వాటా ఎలా పెరుగుతోంది?
- రూ.1.59 లక్షల కోట్ల ఎగుమతులతో దేశంలో ఆరో స్థానానికి రాష్ట్రం ఎలా ఎగబాకింది?
- వరుసగా మూడేళ్ల నుంచి సులభతర వాణిజ్య ర్యాంకుల్లో ఏపీ అగ్రస్థానంలో నిలుస్తోంది తెలుసా?
- పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన లీడ్ ఇండెక్స్–2023లో మన రాష్ట్రం టాప్ అచీవర్‌గా నిలిచింది.. ఇదైనా తెలుసా రామోజీ..
- 2019 నుంచి రాష్ట్రంలో 130 లార్జ్ అండ్ మెగా యూనిట్లు ప్రారంభమయ్యాయి
- వీటి ద్వారా 63,754 కోట్ల పెట్టుబడులు, 77,227 మందికి ఉపాధి లభించింది
- ఇక ఎంఎస్ఎంఈలతో సహా రాష్ట్రంలో 3,69,831 యూనిట్లు ఏర్పాటు ద్వారా రూ.14.18 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి
- వీటి ద్వారా ప్రత్యక్షంగా 32,30,425 మందికి.. పరోక్షంగా 64,60,850 మందికి ఉపాధి లభించనుంది

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి : గతంలో ఎప్పుడూలేని విధంగా రాష్ట్రంలో అంబానీ, ఆదానీ, మిట్టల్, టాటా, బిర్లా, జీఎంఆర్, సంఘ్వీ, భజాంకా, భంగర్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు పెట్టుబడులు పెట్టడానికి ఓ వైపు ముందుకొస్తుంటే.. మరోవైపు ఈనాడు రామోజీరావు ఇది తట్టుకోలేక పూనకం వచ్చినట్లు ఊగిపోతున్నారు. తన బాబు పాలనలో రాకుండా ఇప్పుడు వీరంతా రాష్ట్రానికి క్యూ కట్టడంపై ఆయన పగబట్టినట్లుగా రంకెలు వేస్తున్నారు. పరిశ్రమలపై కక్షగట్టి వెళ్లగొడుతున్నారని లేనిపోని కథలల్లి ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు కథనాలు వండి వారుస్తున్నారు. గతం కంటే ఇప్పుడు అధిక పెట్టుబడులు పెడుతున్నామంటూ అంబానీ, ఆదానీలు స్వయంగా ప్రకటించినా చెవికెక్కని రామోజీ.. ఆ కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయంటూ తన విషపుత్రిక ఈనాడులో నిస్సిగ్గుగా ఓ అడ్డగోలు కథనాన్ని అచ్చోసింది. గత ప్రభుత్వం కుదుర్చుకున్న పరిశ్రమలను ఈ ప్రభుత్వం కక్షగట్టి వెళ్లగొట్టిందంటూ రాసిన కథనం అవగాహనా రాహిత్యంతో పాఠకులను కావాలని తప్పుదోవ పట్టించేలా ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఖండించింది. 2019 నుంచి రాష్ట్రంలో భారీగా పరిశ్రమలు ఏర్పాటవుతూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని.. జీఎస్‌డీపీలో పరిశ్రమల వాటా పెరగడం, ప్రజల తలసరి ఆదాయం పెరగడం ఇందుకు నిదర్శనమని ఆ శాఖ పేర్కొంది. ఉదా..

- 2022–23లో దేశ జీడీపీ 15.90 శాతం వృద్ధి నమోదు చేస్తే రాష్ట్రం అంతకంటే ఎక్కువగా 16.22 శాతం వృద్ధిని నమోదు చేసింది.
- 2019–20లో రాష్ట్ర జీఎస్‌డీపీలో 22.04 శాతంగా ఉన్న పరిశ్రమల వాటా 2022–23 నాటికి అది 23.36 శాతానికి చేరింది. దీన్ని 30 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకెళ్తోంది.
- అలాగే, గతేడాదితో పోలిస్తే దేశంలో తలసరి ఆదాయం సగటున రూ.23,476 పెరిగితే మన రాష్ట్రంలో మాత్రం రూ.26,931 పెరిగింది.
- ఇక 2021–22లో రూ.1,92,587గా ఉన్న రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం 2022–23 నాటికి రూ.2,19,518కు చేరింది.
- ఇదే సమయంలో రాష్ట్ర వాణిజ్య ఎగుమతులు 10.59 శాతం వృద్ధితో రూ.1.59 లక్షల కోట్లకు చేరడం ద్వారా ఆరో స్థానానికి ఎగబాకిందని పరిశ్రమల శాఖ తెలిపింది.

"ఇప్పటికే రాష్ట్రంలో ఆయిల్ అండ్ గ్యాస్, టెలికాం, రిటైల్ వంటి వ్యాపారాల్లో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టాం. ఇప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతుతో మరో రూ.50,000 కోట్ల పెట్టుబడి పెట్టడానికి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్నాం".
– విశాఖ జీఐఎస్ సదస్సులో ముఖేష్ అంబానీ

"ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సమావేశం ఎల్లప్పుడూ సమగ్రంగా ఫలప్రదంగా జరుగుతుంది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన కీలక ప్రాజెక్టులు గంగవరం పోర్టు, వైజాగ్ డేటా సెంటర్ వంటి వాటిపై చర్చించాం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఈ రెండు ప్రాజెక్టులు అత్యంత కీలకమవుతాయని ఇరువురం భావిస్తున్నాం".
– ఈ ఏడాది సెప్టెంబర్ 29న సీఎంను కలిసిన అనంతరం గౌతమ్ ఆదానీ ట్వీట్



సులభతర వాణిజ్యంలో ఏపీ టాప్..

ఇక గత మూడేళ్లుగా పూర్తిగా పారిశ్రామికవేత్తల అభిప్రాయాలతో విడుదల చేస్తున్న సులభతర వాణిజ్య ర్యాంకుల్లో ఏపీ మొదటిస్థానంలో నిలుస్తోంది. ఇది కాకుండా ఎగుమతుల సన్నద్ధత ర్యాంకుల్లో 8వ స్థానానికి.. పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనకు సంబంధించి లీడ్స్–2023 ర్యాంకుల్లో టాప్ అచీవర్‌గా మన రాష్ట్రం నిలిచింది. వాస్తవ గణాంకాలిలా ఉంటే పరిశ్రమలు వెళ్లిపోతున్నాయి.. విద్యార్థులకు ఉద్యోగాల్లేవంటూ ఏ ఆధారాల్లేకుండా తప్పుడు వార్తలెలా రాస్తారంటూ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

ఐదేళ్ల వాస్తవ పెట్టుబడిని వక్రీకరించేశారు..

అదానీ డేటా సెంటర్ గురించి ఈనాడు ఈ మధ్య రెండు కథనాలను ప్రచురించింది. ఐటీ రంగం గురించి రాస్తున్నప్పుడు చంద్రబాబునాయుడు ప్రభుత్వ హయాంలో వచ్చే 20 ఏళ్లలో ఆదానీ డేటా సెంటర్ కోసం రూ.70,000 కోట్ల పెట్టుబడి పెడతామని ఒప్పందం చేసుకుంటే ఈ ప్రభుత్వ తీరుతో ఈ మొత్తాన్ని రూ.21,844 కోట్లకు తగ్గించుకుందని రాశారు. వెంటనే రెండ్రోజుల తర్వాత ప్రచురితమైన 'కక్షగట్టి పరిశ్రమలు వెళ్లగొట్టి'.. అన్న కథనంలో మొత్తం రూ.70,000 కోట్ల పెట్టుబడి రాష్ట్రం నుంచి తరలిపోయినట్లు చేతికొచ్చింది రాసిపారేశారు. నిజానికి.. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ఇరవై ఏళ్లు అంటే చాలా సుదీర్ఘ సమయమని, అప్పటికీ సాంకేతిక పరిజ్ఞానంలో పెనుమార్పులు వస్తాయి కాబట్టి వచ్చే ఐదేళ్లలో ఎంత వాస్తవ పెట్టుబడి పెడతారో డీపీఆర్ ఇవ్వాల్సిందిగా కోరింది. దీని ప్రకారం ఐదేళ్ల కాలానికి రూ.21,844 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ఆదానీ గ్రూపు స్పష్టంచేసి దానికనుగుణంగా ఇప్పటికే పనులను మొదలుపెట్టింది. ఇప్పుడు ఆదానీ డేటా సెంటర్‌ను వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ పేరుతో అభివృద్ధి చేస్తోంది. చంద్రబాబు హయాంలో కేవలం ప్రకటనలకే పరిమితమైన ఆదానీ గ్రూపు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మద్దతుతో భారీ పెట్టుబడులు పెడుతోంది. ఇదే విషయాన్ని ఆదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ (ఏపీసెజ్) సీఈఓ కరణ్ ఆదానీ విశాఖ జీఐఎస్ సదస్సులో స్పష్టంచేశారు. పోర్టులు, సిమెంట్ వంటి రంగాల్లో ఆదానీ గ్రూపు ద్వారా రాష్ట్రంలో సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టామని.. భవిష్యత్తులో ఈ రంగాల్లో తమ సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నట్లు కరణ్ ఆదానీ ప్రకటించారు. అదే విధంగా రాష్ట్రంలో డేటా సెంటర్, గ్రీన్ ఎనర్జీతో పాటు వివిధ రంగాల్లో కొత్తగా మరో రూ.43,664 కోట్ల పెట్టుబడులు పెట్టే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

సీఎం జగన్ చేతుల మీదుగా ఉత్పత్తి ప్రారంభమైన కొన్ని ముఖ్యమైన యూనిట్లు..

కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి	రంగం
గ్రాసిం ఇండస్ట్రీస్	861	1,300	కాస్టిక్ సోడా
ప్యానల్ ఆప్టో డిస్‌ప్లే టెక్నాలజీస్	1,230	2,200	టీవీ డిస్‌ప్లే ప్యానల్స్
ఫాక్స్‌లింక్ ఇండియా ఎలక్ట్రిక్	1,050	2,000	ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్
సన్నీ ఒప్పొ టెక్	280	1,200	కెమెరా మాడ్యూల్స్
ఏటీసీ టైర్స్	1,250	840	హాఫ్ హైవే టైర్స్
రాంకో సిమెంట్స్	1,790	1000	సిమెంట్
డిక్సన్	127	1800	సీసీ కెమెరాలు
గ్రీన్‌లామ్ సౌత్	800	1050	లామినేషన్స్
ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్	35	1,000	ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్
యూజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్	500	750	ఫార్మా
లారస్ సింథసిస్ ల్యాబ్	191	300	బల్క్ డ్రగ్
లారస్ ల్యాబ్	440	500	బల్క్ డ్రగ్
సెంచురీ ప్యానల్స్	1,000	2,266	ప్లైఉడ్

సీఎం జగన్ భూమిపూజ చేసిన పరిశ్రమలు..

కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి	రంగం
ఇంటలిజెంట్ సెజ్	70	2,000	పాదరక్షల ఉపకరణాలు
సెంచురీ ప్యానల్స్	1,600	2,000	ప్లైవుడ్ ప్యానల్స్
ఆదిత్య బిర్లా గార్మెంట్స్	110.38	2,112	గార్మెంట్స్
హిల్‌టాప్ సెజ్ ఫుట్‌వేర్	700	10,000	పాదరక్షలు
డిక్సన్ టెక్నాలజీస్	108	830	టెలివిజన్స్
ఫాక్స్‌లింక్ ఇండియా విస్తరణ	300	1,200	స్మార్ట్ వాచీలు, ఇయర్ పాడ్స్
ఏటీసీ టైర్స్ ఫేజ్–2	1,000	1,160	టైర్ల తయారీ
పిడిలైట్ ఇండస్ట్రీస్	202	280	వాటర్ ప్రూఫింగ్ ఉత్పత్తులు
మేఘా ఫ్రూట్ ప్రాసెసింగ్	186	677	ఆహార ఉత్పత్తులు
ఐనాక్స్ ఎయిర్ ప్రొడక్ట్స్	145	70	పారిశ్రామిక వాయువులు
ఆప్టిమస్ డ్రగ్స్	125	185	ఫార్మాస్యూటికల్స్
విన్‌విన్ స్పెషాల్టీ ఇన్సులేటర్స్	108	382	ఇన్సులేటర్స్
స్టీరాక్స్ లైఫ్ సైన్సెస్	88	450	బల్క్ డ్రగ్స్
సినాప్టిక్స్ ల్యాబ్స్	82	300	బల్క్ డ్రగ్స్
ఇషా రిసోర్సెస్	68	220	కోక్ అండ్ కోల్ స్క్రీనింగ్
అసాగో ఇండస్ట్రీస్	270	500	బయో ఇథనాల్
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	8,800	2,500	ఉక్కు తయారీ
క్రిభ్‌కో బయో ఇథనాల్	560	400	బయో ఇథనాల్
ఎకో స్టీల్ ఇండియా	540	500	బయో ఇథనాల్
లారస్ సింథసిస్ ల్యాబ్	240	450	బల్క్ డ్రగ్
లారస్ ల్యాబ్	240	450	బల్క్ డ్రగ్

ఏపీఐఐసీ లేఖలకు స్పందించని లులూ..

ఇక విశాఖలో అత్యంత ఖరీదైన భూమిని ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం గత ప్రభుత్వం లులూ గ్రూపునకు కేటాయించింది. కానీ. ఈ భూమికి చెల్లించాల్సిన మొత్తం లులూ గ్రూపు చెల్లించడంలో విఫలమైంది. ఏపీఐఐసీ అనేకసార్లు భూమి ధర మొత్తాన్ని చెల్లిస్తే భూమిని అప్పగిస్తామంటూ లేఖలు రాసినా స్పందన లేకపోవడంతో ఏపీఐఐసీ భూమిని కేటాయించలేదు. మరోవైపు.. ఓర్వకల్లు వద్ద జయరాజ్ స్టీల్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తోంది. సకాలంలో నిర్మాణం పూర్తి చేయకపోయినా ఎటువంటి పెనాల్టీలు విధించలేదు. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తిచేసుకుని వచ్చే ఏడాది మార్చి నాటికి వాణిజ్యపరంగా ఉత్పత్తిని ప్రారంభించడానికి సిద్ధంగా ఉంది.

అవగాహనారాహిత్యంతో వార్తల అల్లిక..

నిజానికి.. ఏదైనా ఒక పరిశ్రమ ప్రారంభం కావాలంటే ప్రతిపాదన దగ్గర నుంచి సాంకేతిక మదింపు, అనుమతులు పేరిట ఒక నిర్దిష్టమైన నియమ నిబంధనలు (ఎస్‌ఓపీ) ఉంటాయని, వీటిపై అవగాహన లేకుండా ఈనాడు వార్తలు రాసినట్లు ఉందని పరిశ్రమల శాఖ ఆ ఖండనలో పేర్కొంది. తమ వ్యాపార నిర్ణయాల్లో భాగంగా ఆయా కంపెనీలు పనులు ప్రారంభించలేదని స్పష్టంచేసింది. రానున్న కాలంలో ఎంఎస్ఎంఈలతో కలిసి రాష్ట్రంలో కొత్తగా 3,69,831 యూనిట్లు రానున్నాయని, వీటి ద్వారా రూ.14,18,943 కోట్ల పెట్టుబడులు రాష్ట్రంలోకి రావడమే కాకుండా 32,30,425 మందికి ఉద్యోగావకాశాలు, పరోక్షంగా 64,60,850 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, ఆ దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని పరిశ్రమల శాఖ తెలిపింది.

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఏపీఐఐసీ భూ కేటాయింపులు

సంవత్సరం	యూనిట్ల సంఖ్య	ఎకరాలు	పెట్టుబడి విలువ (రూ.కోట్లల్లో)	ప్రతిపాదిత ఉద్యోగాలు
2014–15	95	2,116	3,285.24	16,484
2015–16	216	4,713	6,620.79	64,323
2016–17	231	3,501	12,056.81	63,729
2017–18	947	2,897	29,428.40	2,06,229
2018–19	1,027	1,560	15,291.94	1,10,283
మొత్తం	2516	14,787	66,683.18	4,61,048

ప్రస్తుత ప్రభుత్వ హయాంలో (నోట్ ఇందులో రెండేళ్లు కరోనా సమయం కూడా కలిసి ఉంది)

సంవత్సరం	యూనిట్ల సంఖ్య	ఎకరాలు	పెట్టుబడి విలువ (రూ.కోట్లల్లో)	ప్రతిపాదిత ఉద్యోగాలు
2019–20	1,105	1,489	17,542.53	97,940
2020–21	617	827	6,814.36	57,533
2021–22	596	1798	12,212.06	47,966
2022–23	829	1243	29,266.50	89,422
2023–24	528	986	8,667.98	32,504
కొత్త ప్రతిపాదనలు	110	107.68	370.41	2,602
మొత్తం	3785	6,450.68	74,873.84	3,27,967

చంద్రబాబు ఏ పీకేతో కలిసినా పీకేదేం లేదు

ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్ : చంద్రబాబు, ప్రశాంత్ కిషోర్ కలిసి ఏం చేసినా ఊడేదేమీ లేదని ఎమ్మెల్యే కొడాలి శ్రీవేంకటేశ్వరరావు(నాని) అన్నారు. చంద్రబాబు అవుట్ డేటెడ్ పొలిటీషియన్ అని తాము, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సార్లు చెప్పామని గుర్తుచేశారు. కృష్ణా జిల్లా గుడివాడలోని తన నివాసంలో కొడాలి నాని ఆదివారం మీడియాతో మాట్లాడారు. శనివారం ప్రశాంత్ కిషోర్, చంద్రబాబుల సమావేశం జరిగిందని మూడు గంటల పాటు వారు ఏకాంతంగా చర్చించుకున్నారని, మధ్యమధ్యలో లోకేశ్ లోనికి, బయటకు వెళ్లి వస్తున్నారంటూ ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ 5 నాయుడు, ఈనాడు రామోజీరావు టీవీ, భూమి బద్దలయ్యేట్లు ప్రచారాలు చేశారని ఎద్దేవా చేశారు. 'ప్రశాంత్ కిషోర్‌ను 2014లో మేము వాడేశాం. బుర్రలో గుజ్జంతా అయిపోయింది. చంద్రబాబు ఒట్టిపోయిన గేదెలాగా ఆయనను తీసుకువెళ్లి కూర్చోబెట్టి మాట్లాడితే ఏం ప్రయోజనం ఉంటుంది'? అని ప్రశ్నించారు. 2014లో ప్రశాంత్ కిషోర్ తమకు ఎన్నికల వ్యూహకర్తగా ఉండగా.. 'బీహార్ నుంచి వచ్చినవాడు వాడేం చేస్తాడు తమ్ముళ్లూ, వాడు ఏం పీకుతాడు మనకన్నా గొప్ప వాళ్లు ఈ ప్రపంచంలో ఉన్నారా తమ్ముళ్లు..' అని ప్రశాంత్ కిషోర్‌ను చంద్రబాబు విమర్శించారని గుర్తుచేశారు. అప్పట్లో ఇదే రాధాకృష్ణ, రామోజీరావు, బీఆర్ నాయుడు బాబాయ్‌ను చంపడానికి వ్యూహం రచించేందుకు ప్రశాంత్ కిషోర్‌ను తెచ్చుకున్నాడని, కోడికత్తితో జగన్‌ను పొడిపించినట్లు నటించి ప్రజల్లో మెప్పు పొందాలని ప్రశాంత్ కిషోర్ వ్యూహం రచించాడని ప్రచారం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రశాంత్ కిషోర్‌ను తెచ్చుకుని లోకేశ్ ఏం చేస్తాడు? ప్రశాంత్ కిషోర్ ఆధ్వర్యంలో తండ్రి పీక కోస్తాడా? చంద్రబాబును చంపుతాడా? ఎందుకు ప్రశాంత్ కిషోర్ సాయం తీసుకుంటున్నారనేది వారికే తెలియాలన్నారు. ఐప్యాక్‌కు ప్రశాంత్ కిషోర్‌కు ఏ విధమైన సంబంధం లేదని కొడాలి నాని స్పష్టం చేశారు. వెస్ట్ బెంగాల్ ఎన్నికల అనంతరం తాను వ్యూహకర్తగా వ్యవహరించడం లేదని ప్రకటించి బీహార్‌లో ఒక రాజకీయ పార్టీని పెట్టి పాదయాత్ర చేసి ఖాళీగా ఉన్న ప్రశాంత్ కిషోర్‌ను తెచ్చి ఏం చేసుకుంటారని ఎద్దేవా చేశారు. మమతా బెనర్జీ కోరిక మేరకు చంద్రబాబును ఇండియా కూటమిలో చేరాలని అడగడానికి చర్చలు జరిపేందుకు వచ్చారని, చంద్రబాబు.. పవన్‌కళ్యాణ్‌ను అడ్డుపెట్టుకుని బీజేపీతో చర్చలు జరుపుతున్నారని వివరించారు. అటు పీకేతో, ఇటు పవన్ కళ్యాణ్(పీకే)తో చర్చలు జరుపుతూ ఎటూ తేల్చుకోలేక రెండు కళ్ల సిద్ధాంతాన్ని అనుసరిస్తూ ఏ పార్టీ అధికారంలోకొస్తుందో తెలియక కాంగ్రెస్‌తో ఉండాలా, బీజేపీతో ఉండాలా తోచక అయోమయంలో ఉన్నారని చెప్పారు. చంద్రబాబు ఏ పీకేతో పెట్టుకున్నా సీఎం జగన్‌ను పీకేదేం లేదని నానీ విమర్శించారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం

- మంత్రి మేరుగు నాగార్జున



ఒంగోలు: వచ్చే ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం అవుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఆయన ఆదివారం ఒంగోలులో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మీడియాతో మాట్లాడుతూ తాను ప్రస్తుతం వేమూరు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండగా, తన అవసరం సంతనూతలపాడు నియోజకవర్గంలో ఉందని భావించి అక్కడ ఇన్‌చార్జిగా తమ అధినేత సీఎం వైఎస్ జగన్ నియమించారని చెప్పారు. చంద్రబాబు చంద్రగిరిని వదిలి బీసీలు అత్యధికంగా ఉన్న కుప్పంలో, ఆయన తనయుడు లోకేశ్ కూడా బీసీలు అధికంగా ఉన్న మంగళగిరిలో పోటీ చేస్తున్నారని తెలిపారు. ఇతరులు నియోజకవర్గాలు మారితే మాత్రం రాజకీయ బదిలీలు అంటూ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. బీసీలకు దక్కాల్సిన రెండు స్థానాలను చంద్రబాబు, ఆయన కొడుకు తీసుకుని వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. రానున్న ఎన్నికల్లో సంతనూతలపాడు నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా అందరి ఆశీస్సులతో ముందుకు సాగుతానన్నారు. 'మాకు సీట్లు ఎక్కడ ఇవ్వాలో, ఎలా గెలిపించుకోవాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాగా తెలుసు. మా ఇమేజ్ కన్నా మా నాయకుడి బొమ్మ వల్లే మేం గెలుస్తున్నాం' అని మంత్రి నాగార్జున స్పష్టంచేశారు. ప్రశాంత్ కిషోర్ టీడీపీతో కలిసినంత మాత్రాన తాము భయపడే పరిస్థితి లేదన్నారు. సినీనటుడు పృథ్వీ కనీసం వార్డు సభ్యుడు కూడా కాదని, ఆయన వ్యాఖ్యలకు స్పందించాల్సిన అవసరం లేదన్నారు. ఇక పాదయాత్రను పవిత్రంగా చేయడం, ప్రజల సమస్యలు తెలుసుకోవడం, అధికారంలోకి వచ్చాక వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ఒక్క వైఎస్సార్ కుటుంబానికే సాధ్యమని చెప్పారు. లోకేశ్ విడతలవారీగా పాదయాత్ర ఎందుకు చేశాడో ఆయనకే తెలియదన్నారు. నారా భువనేశ్వరి చేపట్టిన పరామర్శ యాత్ర కాస్త ఇద్దరు, ముగ్గురికి చెక్కులు ఇచ్చి, చంద్రబాబు జైలు నుంచి రాగానే ముగించారని గుర్తుచేశారు.

మా నమ్మకం నువ్వే జగన్ అంటున్న బలిజలు

- ఉత్తర అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి రత్నాకర్



సాక్షి, అమరావతి: సామాజిక న్యాయమంటే ఏమిటో చేసి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఉత్తర అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్ అన్నారు. ఆయన ఆదివారం తాడేపల్లిలో మాట్లాడుతూ ఏ మాత్రం రాజకీయ నేపథ్యం లేని కుటుంబానికి చెందిన తనను గుర్తించి కేబినెట్ స్థాయి పదవిని ఇచ్చి గౌరవించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కడపకు చెందిన సి.రామచంద్రయ్యను ఎమ్మెల్సీగా, గురుమోహన్‌ను అన్నమయ్య జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా, మర్రి రవికుమార్‌ను రాజంపేట మునిసిపల్ వైస్ చైర్మన్‌గా, పోరుమామిళ్లకు చెందిన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని ఆప్కోస్ డైరెక్టర్‌గా నియమించిన సీఎం జగన్ బలిజలపై తనకున్న ప్రేమను చాటుకున్నారన్నారు. కేవలం నాలుగున్నరేళ్ల పాలనలో 10 మంది కాపు నేతలకు కీలకమైన మంత్రి పదవులు ఇచ్చారని తెలిపారు. రాబోయే రోజుల్లో కాపు, బలిజ సామాజికవర్గానికి మరింత రాజకీయ ప్రాధాన్యత ఇచ్చేందుకు సీఎం జగన్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. త్వరలోనే బలిజలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు కానుందని, బలిజలంతా ముక్తకంఠంతో మా నమ్మకం నువ్వే జగన్ అని అంటున్నారని రత్నాకర్ చెప్పారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ''క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రజలు కరుణ, దయ నుంచి ప్రేరణ పొందాలి. క్రిస్మస్ పర్వదినం ప్రేమ, దయాగుణం విశిష్టతను మరోసారి మనకు గుర్తు చేస్తుంది. మానవాళికి నిస్వార్థంగా ఎలా సేవ చేసి తరించాలో ఈ పండుగ మనకు చాటి చెబుతుంది. సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలంటే మనం ఎలాంటి ఆదర్శమయ జీవితం గడపాలో ఏసు క్రీస్తు బోధనలు మనకు విడమరిచి చెబుతాయి. ఇంతటి పర్వదినాన తోటి పౌరులు, ముఖ్యంగా క్రైస్తవ సోదర, సోదరీమణులకు నా హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు'' అని రాష్ట్రపతి ఆదివారం తన సందేశంలో పేర్కొన్నారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు

ఒకాలా(ఫ్లోరిడా): అమెరికాలో మళ్లీ తుపాకీ పేలింది. ఫ్లోరిడా రాష్ట్రంలోని ఒకాలా నగరంలోని షాపింగ్‌మాల్‌లో శనివారం మధ్యాహ్నం ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని ఆగంతకుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. అక్కడే ఉన్న ఒక మహిళ కాలికి బుల్లెట్ గాయమైంది. ఘటన తర్వాత ఆగంతకుడు తుపాకీని అక్కడే వదిలేసి పారిపోయాడు. ఈ కాల్పుల ఘటనలో అక్కడి వినియోగదారులకు స్వల్ప గాయాలయ్యాయి. ఒకతని చేయి విరిగింది. ఆగంతకుడు, బాధితుడి వివరాలను పోలీసులు వెల్లడించలేదు. అతను ఎందుకు కాల్పులు జరిపాడు అనే విషయాన్నీ పోలీసులు ఇంకా బహిర్గతం చేయలేదు. కాల్పుల శబ్దం విని అక్కడ ఉన్న చాలా మంది కస్టమర్లు ప్రాణభయంతో బయటకు పరుగులు పెట్టారు. ఆ ఘటన తలుచుకుంటే ఇంకా భయమేస్తోందని ప్రత్యక్షసాక్షులు కెల్విన్, డయానా చెప్పారు.

'గీతా పారాయణం'లో పార్టీల దూషణల పర్వం

కోల్‌కతా: దాదాపు 1,20,000 మందితో కోల్‌కతాలో జరిగిన మెగా భగవద్గీత పఠన కార్యక్రమం రాజకీయ రంగు పులుముకుంది. కార్యక్రమంలో పాల్గొన్న బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకంత మజుందార్ అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. మతాన్ని, రాజకీయాలను కలిపేయడం బీజేపీ అలవాటుగా మారిందంటూ తృణమూల్ మండిపడింది. ''గీతా పఠనానికి మేం వ్యతిరేకం కాదు. కానీ దాన్ని రాజకీయ లబ్ధికి వాడుకోకండి. లేదంటే ఈ కార్యక్రమం కంటే ఫుట్‌బాల్ మ్యాచ్ వంటిది ఏర్పాటు చేయడం మేలు'' అని టీఎంసీ నేత ఉదయన్ గుహ అన్నారు. ఈ కార్యక్రమానికి పోటీగా కాంగ్రెస్ దానికి దగ్గర్లోనే రాజ్యాంగ పఠనం కార్యక్రమం నిర్వహించింది. మరోవైపు గీతా పఠనానికి ప్రధాని మోదీ మద్దతుగా నిలిచారు. దీనితో సమాజంలో సామరస్యం పెంపొందుతుందంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

అన్నీ మంచి శకునములే!

పర్యావరణ లాభ సూచనలే



- ఓజోన్‌కు పూడుతున్న గండి
- ఎలక్ట్రిక్ వాహనాల్లో బాగా వృద్ధి
- 'అమెజాన్' నరికివేత తగ్గుముఖం
- 2023లో సానుకూల పరిణామాలు

ఓజోన్ పొరకు గండి పూడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వాడకం బాగా పెరుగుతోంది. పర్యావరణపరంగా వరుస దుర్వార్తల పరంపర నడుమ ఇలాంటి పలు సానుకూల పరిణామాలకు కూడా 2023 వేదికవడం విశేషం! బ్రెజిల్‌లో అమెజాన్ అడవుల క్షీణత బాగా తగ్గుముఖం పట్టడం మొదలు ఇటీవలి కాప్28 సదస్సులో కీలక పర్యావరణ తీర్మానం దాకా ముఖ్యమైన ఇలాంటి ఓ ఐదు పరిణామాలను గమనిస్తే...

\- సాక్షి, నేషనల్ డెస్క్

సంప్రదాయేతర ఇంధనోత్పత్తి పైపైకి...



శిలాజ ఇంధనాలకు వీలైనంత త్వరగా స్వస్తి పలికితేనే గ్లోబల్ వార్మింగ్ భూతాన్ని రూపుమాపడం సాధ్యమని పర్యావరణవేత్తలంతా ఎప్పటినుంచో చెబుతున్నదే. సౌర విద్యుత్ వంటి సంప్రదాయేతర ఇంధన వనరులకు మళ్లడం ఇందుకున్న మార్గాల్లో ముఖ్యమైనది. ఈ విషయంలో 2023లో ప్రపంచ దేశాలు చెప్పుకోదగ్గ ప్రగతినే సాధించాయి. అంతర్జాతీయంగా సంప్రదాయేతర ఇంధనోత్పత్తి ఈ ఒక్క ఏడాదే ఏకంగా 30 శాతం, అంటే 107 గిగాబైట్లకు పైగా పెరిగిందట! అంతర్జాతీయ ఇంధన సంస్థ ఈ మేరకు వెల్లడించింది. వాతావరణ కాలుష్య కారక దేశాల్లో అగ్ర స్థానంలో ఉన్న చైనాయే ఈ విషయంలోనూ అందరికంటే ముందుంది! చైనా సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం గత జూన్ నాటికే మిగతా ప్రపంచ దేశాలన్నింటి ఉమ్మడి సామర్థ్యాన్ని కూడా మించిపోయిందని ఒక నివేదిక తేల్చడం విశేషం. అదే సమయంలో చైనాలో బొగ్గు ఉత్పత్తి కూడా కొద్ది నెలలుగా తార స్థాయికి చేరినా, త్వరలోనే అది బాగా దిగొస్తుందని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తుండటం మరో సానుకూల పరిణామం. హాలోవీన్ వేడుక సందర్భంగా పోర్చుగల్ అక్టోబర్ 31 నుంచి వరుసగా ఆరు రోజుల పాటు కేవలం సంప్రదాయేతర ఇంధన వనరులను మాత్రమే వినియోగించి ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచింది.

ఓజోన్ క్రమంగా కోలుకుంటోంది...



అతినీల లోహిత కిరణాల వంటివాటి బారి నుంచి భూమిని కాపాడే కీలకమైన ఓజోన్ పొర కోలుకునే ప్రక్రియ 2023లో మరింతగా వేగం పుంజుకుంది. విచ్చలవిడి క్లోరోఫ్లోరో కార్బన్ల విడుదల తదితరాల కారణంగా ఓజోన్‌కు రంధ్రం పడిందని, అది నానాటికీ పెరుగుతోందని 1980ల నుంచీ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూ వస్తున్నారు. దీన్ని అరికట్టేందుకు అంతర్జాతీయంగా జరిగిన ప్రయత్నాలు ఫలితాలిస్తున్నట్టు వారు తాజాగా చెబుతున్నారు. ఇందుకోసం చేసుకున్న మాంట్రియల్ ఒప్పందం ప్రకారం క్లోరో ఫ్లోరో కార్బన్లకు పూర్తిగా స్వస్తి చెప్పాలన్న లక్ష్యాన్ని అందుకునేందుకు ప్రపంచ దేశాలు చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నాయి. ఈ కృషి ఇలాగే కొనసాగితే 2040 కల్లా ఓజోన్ పొర 1980లకు ముందునాటి స్థితికి మెరుగు పడటం ఖాయం'' అని ఐరాస తాజా నివేదికలో హర్షం వెలిబుచ్చింది. అయితే అంటార్కిటికా మీద మాత్రం ఓజోన్‌కు పడ్డ రంధ్రం గతంతో పోలిస్తే మరింతగా విస్తరించిందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.

అమెజాన్‌కు ఉద్దీపన

అమెజాన్ అడవులను ప్రపంచం పాలిట ఊపిరితిత్తులుగా, ఆకుపచ్చని వలగా అభివర్ణిస్తుంటారు. ప్రపంచంలోనే అతి పెద్ద వర్షాధారిత అడవులివి. బ్రెజిల్‌లో కొన్నేళ్లుగా అడ్డూ అదుపూ లేకుండా సాగుతూ వస్తున్న వాటి విచ్చలవిడి నరికివేతకు 2023లో భారీ బ్రేక్ పడింది. బ్రెజిల్ గురించే చెప్పుకోవడం ఎందుకంటే 60 శాతానికి పైగా అమెజాన్ అడవులకు ఆ దేశమే ఆలవాలం! గత జూలై నాటికే అక్కడ అడవుల నరికివేత ఏకంగా 22.3 శాతం దాకా తగ్గుముఖం పట్టిందట. గత ఆర్నెల్లలో ఇది మరింతగా తగ్గిందని పలు నివేదికలు ఘోషిస్తున్నాయి. 2030 నాటికి బ్రెజిల్లో అడవుల నరికివేతను పూర్తిగా అరికట్టడమే లక్ష్యమని ప్రకటించిన నూతన అధ్యక్షుడు లులా డసిల్వా ఆ దిశగా గట్టి చర్యలే తీసుకుంటున్నట్టు చెబుతున్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల జోష్



పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాలు ప్రపంచమంతటా దుమ్ము రేపుతున్నాయి. 2023లో వాటి అమ్మకాల్లో అంతర్జాతీయంగా విపరీతమైన పెరుగుదల నమోదైంది. అగ్ర రాజ్యం అమెరికాలోనైతే ఈవీల అమ్మకాలు ఆల్‌టైం రికార్డులు సృష్టించాయి! 2023లో అక్కడ 10 లక్షలకు పైగా పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడైనట్టు బ్లూంబర్గ్ నివేదిక వెల్లడించింది. చైనాలో కూడా 2023లో మొత్తం వాహనాల అమ్మకాల్లో 19 శాతం వాటా ఈవీలదేనట! పలు యూరప్ దేశాల ప్రజలు కూడా వాటిని ఇబ్బడిముబ్బడిగా కొనేస్తున్నారు. అక్కడ 2022తో పోలిస్తే ఈవీల అమ్మకాల్లో 55 శాతానికి పైగా వృద్ధి నమోదైంది! మొత్తమ్మీద 2023లో ప్రపంచవ్యాప్తంగా మొత్తం వాహన కొనుగోళ్లలో 15 శాతానికి ఈవీలేనని తేలింది. ప్రపంచ కాలుష్యంలో ఆరో వంతు వాటా రోడ్డు రవాణా వాహనాలదే. ఈ నేపథ్యంలో ఈవీలు ఎంతగా పెరిగితే ఈ కాలుష్యం అంతగా దిగొస్తుంది.

శిలాజ ఇంధనాలపై తీర్మానం

బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాల వాడకాన్ని పూర్తిగా నిలిపేయాలని ఇటీవల దుబాయ్‌లో జరిగిన కాప్28 అంతర్జాతీయ పర్యావరణ సదస్సు తీర్మానించడం విశేషం. పర్యావరణ పరిరక్షణకు కొన్నేళ్లుగా జరుగుతున్న ప్రయత్నాల్లో ఈ తీర్మానాన్ని కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ఏకంగా 100కు పైగా దేశాలు దీనికి సంపూర్ణంగా మద్దతు పలకగా, ఈ దిశగా శక్తివంచన లేకుండా ప్రయత్నించాలని మరో 50 పై చిలుకు దేశాలు ఈ సదస్సు వేదికగా అభిప్రాయపడ్డాయి. గతంలోనూ పలు కాప్ సదస్సుల్లో ఈ దిశగా ప్రయత్నాలు జరిగినా అవి చర్చల స్థాయిని దాటి తీర్మానం దాకా రాకుండానే వీగిపోయాయి. అందుకే ఇది చరిత్రాత్మక తీర్మానమని కాప్28 సదస్సుకు అధ్యక్షత వహించిన సుల్తాన్ అల్ జబర్ అభివర్ణించారు. ఇది దేశాల ఆర్థిక వ్యవస్థలనే పునర్నిర్వచిస్తుందని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు. దీనికి దేశాలు ఏ మేరకు కట్టుబడి ఉంటాయన్న దానిపై భూగోళం భవిష్యత్తు చాలావరకు ఆధారపడి ఉంటుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

COP28 UAE
UNITE. ACT. DELIVER

అవినీతికి దూరంగా ఉండండి: జిన్‌పింగ్

చైనా కమ్యూనిస్టు నేతలకు హితవు

బీజింగ్: అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని అధికార కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా నాయకులకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సూచించారు. కుటుంబ సభ్యులను, బంధువులను సైతం వాటికి దూరంగా ఉంచాలన్నారు. ఈ నెల 22న సీపీసీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుల భేటీలో జిన్‌పింగ్ ప్రసంగించారు. వ్యక్తిగతంగా క్రమశిక్షణ పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని స్పష్టం చేశారు. అవినీతిపై మనం పోరాటం చేస్తున్నారని, ఈ విషయంలో పార్టీ నేతలంతా సహకరించాలని కోరారు. కుటుంబ సభ్యులు, బంధువులు, మీ కింద పని చేసేవారు అవినీతి దూరంగా ఉండేలా కఠినమైన నిబంధనలు విధించాలని జిన్‌పింగ్ సూచించారు. ఇటీవలి కాలంలో కమ్యూనిస్టు నాయకుల అవినీతిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతరులకు ప్రయోజనాలు కల్పించి, వారి నుంచి లంచాలు, బహుమతులు స్వీకరిస్తున్నట్లు కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకత్వంగుర్తించింది. కొందరిపై విచారణ సైతం ప్రారంభించింది.

కశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం

మసీదులో ప్రార్థన వేళ మాజీ పోలీసు అధికారిని చంపేసిన ఉగ్రవాదులు

శ్రీనగర్: డెబ్బై రెండేళ్ల మాజీ పోలీసు అధికారిని కశ్మీర్ ఉగ్రవాదం బలితీసుకుంది. బారాముల్లా జిల్లాలోని షేరీ ప్రాంతంలోని గట్‌ముల్లా సమీప మసీదులో ఈ దారుణం చోటుచేసుకుంది. సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్ఎస్పీ)గా చేసి 11 సంవత్సరాల క్రితం రిటైర్ అయిన మొహమ్మద్ షఫీ మీర్.. దగ్గర్లోని మసీదులో ప్రార్థనలకు అందరికీ పిలుపునిచ్చే ముఅజ్జిన్‌గా సేవలందిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున మసీదుకొచ్చి అందర్నీ ప్రార్థనల కోసం పిలుస్తుండగా ఉగ్రవాదులు అకస్మాత్తుగా గుళ్ల వర్షం కురిపించారు. దాంతో ఆయన ఘటనాస్థలిలోనే మరణించారు. ''లౌడ్‌స్పీకర్‌లో ఆయన ఆజా పిలుపు హఠాత్తుగా ఆగిపోయింది. రెహమ్ (దయ) ఆయన పలికిన చివరి పదం'' అంటూ షఫీ బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఉగ్రవాదుల కోసం గాలిస్తున్నాయి. హింస ఏ రూపంలో ఉన్నా సహించేదిలేదని జేకేఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఆజాన్ చేస్తున్న వ్యక్తిని పొట్టనబెట్టుకున్నారు. ఉగ్రవాదులకు మత విలువలు కూడా లేవని అర్థమవుతోంది' అని జమ్మూకశ్మీర్ బీజేపీ అధికార ప్రతినిధి అల్తాఫ్ ఠాకూర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఉగ్రవాదం పీచమణిచేందుకు ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని కొత్తగా ఏర్పాటైన డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ చీఫ్ గులాం నబీ ఆజాద్ డిమాండ్ చేశారు.



వికసిత్ భారత్‌ను నిజం చేయండి: మోదీ

జమ్మూకశ్మీర్ విద్యార్థులతో ప్రధాని మాటామంతీ

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ యువతలో అద్భుత ప్రతిభాపాటవాలు దాగున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా రూపొందడంలో తమ వంతు కృషిచేయాలని వారికి పిలుపునిచ్చారు. జమ్మూకశ్మీర్‌లో ప్రతి జిల్లాలోని అత్యంత వెనుకబడిన ప్రాంతాలకు చెందిన దాదాపు 250 మంది విద్యార్థులతో మోదీ ఆదివారం ఢిల్లీలో మాట్లాడారు. క్రీడల పట్ల కశ్మీర్ ప్రజలు చూపే అమితాసక్తిపై విద్యార్థులను ఆయన అడిగి తెల్సుకున్నారు. హంగ్జౌలో ఆసియన్ పారా గేమ్స్‌లో కశ్మీర్ యువత ఆర్చర్ శీతల్ దేవి సాధించిన మూడు మెడల్స్ గురించి వారితో మాట్లాడారు. ''రోజూ యోగా చేయండి. మీరంతా బాగా చదివి, కష్టపడి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు శక్తివంచన లేకుండా కృషిచేయండి. 2047 కల్లా వికసిత భారత్ కలను నిజం చేయండి'' అని వారికి పిలుపునిచ్చారు.

మళ్లీ కోరలు చాస్తున్న కరోనా..!

- 656 పాజిటివ్ కేసులు నమోదు
- వ్యాధి విస్తృతిపై ఓ కన్నేయండి
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

న్యూఢిల్లీ: కరోనా కేసుల ఉధృతి నెమ్మదిగా ఊపందుకుంటోంది. గత 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 656 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 3,742కు చేరుకుందని కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం వెల్లడించింది. కేరళలో మరో వ్యక్తి కోవిడ్‌తో కన్నుమూయడంతో దేశంలో ఇప్పటిదాకా కోవిడ్‌తో మరణించిన వారి సంఖ్య 5,33,333కి ఎగబాకింది. భారత్‌లో తొలికేసు వెలుగుచూసిననాటి నుంచి ఇప్పటిదాకా 4,50,08,620 మందికి కరోనా సోకగా వారిలో 4,44,71,545 మంది కోలుకున్నారు. మరణాల రేటు 1.19 శాతంగా నమోదైంది. దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా 220.67 కోట్ల డోస్‌ల కోవిడ్ వ్యాక్సిన్ పంపిణీ పూర్తయింది.

ఆగ్నేయాసియా దేశాలు జాగ్రత్త

శ్వాససంబంధ కేసులు ఆగ్నేయాసియా దేశాల్లో పెరుగుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. కోవిడ్ వ్యాధి విస్తృతిపై ఓ కన్నేసి, నిఘా పెంచి, వ్యాప్తి కట్టడికి కృషిచేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా ప్రాంత డైరెక్టర్ డాక్టర్ పూనమ్ ఖేత్రపాల్ సింగ్ ఆగ్నేయాసియా దేశాలకు సూచించారు. ''పండుగల సీజన్ కావడంతో జనం ఒక్కచోట గుమిగూడే సందర్భాలు పెరుగుతున్నాయి. దీంతో కరోనా వ్యాప్తి పట్ల జనం అప్రమత్తంగా ఉండాలి'' అని ఆమె చెప్పారు. జేఎన్1 ఉపవేరియంట్‌కు వేగంగా సంక్రమించే గుణం ఉన్నప్పటికీ ఆందోళన చెందాల్సిన పనిలేదని డబ్ల్యూహెచ్‌వో స్పష్టంచేయడం తెల్సిందే. ఇప్పుడు అందుబాటులో ఉన్న కోవిడ్ వ్యాక్సిన్లు జేఎన్1సహా అన్నివేరియంట్ల కరోనా వైరస్‌ల నుంచీ సమర్థవంతంగా రక్షణ కల్పిస్తాయి'' అని ఆమె చెప్పారు. ముందస్తు చర్యల్లో భాగంగా భారత ప్రభుత్వం సైతం అవసరమైన చోట్ల కోవిడ్ నిబంధనలను తప్పక అవలంభించాలని రాష్ట్రాలకు ఇప్పటికే సూచించింది.

ఆ విమానం ఎట్టకేలకు టేకాఫ్ !

పారిస్: మానవ అక్రమ రవాణా అనుమానంతో మూ్డ్రోజులపాటు తమ అధీనంలో ఉంచుకున్న విమానాన్ని ఫ్రాన్స్ అధికారులు ఎట్టకేలకు విడిచిపెట్టారు. 303 మందికిపైగా ప్రయాణికులతో దుబాయ్ నుంచి బయల్దేరిన ఆ విమానం ఇంధనం నింపుకునేందుకు ఫ్రాన్స్‌లోని పారిస్ దగ్గర్లోని వ్యాట్రీ విమానాశ్రయంలో గురువారం దిగింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది భారతీయులే. ఈ విమానం ద్వారా మానవ అక్రమ రవాణా జరుగుతోందంటూ వచ్చిన సమాచారంతో ఫ్రాన్స్ అధికారులు దాన్ని తమ అధీనంలోకి తీసుకుని దర్యాప్తు మొదలెట్టడం తెల్సిందే. 303 మందిని విడివిడిగా విచారించాలని భావించిన నలుగురు జడ్జీలు, అసలు ఈ ప్రక్రియే అస్తవ్యస్తంగా ఉందంటూ మొత్తం కేసు విచారణనే రద్దుచేశారు. దాంతో విమానం టేకాఫ్‌కు అడ్డంకులు తొలిగాయి. వాస్తవానికి ఈ విమానం నికరాగువాకు వెళ్లాలి. తాజా ఉదంతం నేపథ్యంలో అది నికరాగువా వెళ్తుందా, లేక భారత్‌కో, దుబాయ్‌కో తిరిగొస్తుందా అన్నది ప్రస్తుతానికి తెలియరాలేదు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే కేదార్‌పై వేటు

ముంబై: సహకార బ్యాంక్‌లో రూ.150 కోట్ల మేర మోసాలకు పాల్పడ్డ కేసులో మహారాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే సునీల్ కేదార్‌పై శాసనసభ సభ్యత్వం రద్దయింది. అసెంబ్లీ సెక్రటేరియట్ ఈ మేరకు పేర్కొంది. ఆయన నాగ్‌పూర్ జిల్లా సావోనెర్ అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేదార్ నాగ్‌పూర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా ఉండగా మరో ఐదుగురితో కలిసి ఆర్థిక నేరానికి పాల్పడ్డారని ప్రత్యేక కోర్టు తేల్చింది. వారందరికీ ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది.

14 మంది ఇజ్రాయెల్ జవాన్లు మృతి

టెల్ అవీవ్: హమాస్ మిలిటెంట్ల భరతం పట్టడమే లక్ష్యంగా గాజా స్ట్రిప్‌పై వైమానిక, భూతల దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం, శనివారం హమాస్ మిలిటెంట్ల ఎదురుదాడిలో 14 మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. దీంతో ఈ యుద్ధంలో ఇప్పటివరకు బలైన ఇజ్రాయెల్ సైనికుల సంఖ్య 153కు చేరుకుంది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం ప్రకటించింది. అక్టోబర్ 7న ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. ఒకేసారి 14 మంది జవాన్లను కోల్పోవడం ఇజ్రాయెల్ జీర్ణించుకోలేకపోతోంది. గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భీకర స్థాయిలో విరుచుకుపడుతోంది. గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో గత 24 గంటల వ్యవధిలో 166 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. హమాస్ చెరలోని బందీలను విడిపించాలంటే యుద్ధం తప్పదని ఇజ్రాయెల్ అంటోంది. హమాస్‌పై పోరాటం వల్ల భారీ మూల్యమే చెల్లించాల్సి వస్తోందని, అయినప్పటికీ ముందుకెళ్లడం తప్ప మరో మార్గం లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. మరోవైపు ఆయనకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్‌లో జనం వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. నెతన్యాహు తక్షణమే పదవి నుంచి దిగిపోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎర్రసముద్రంలో మరో నౌకపై దాడి

25 మంది భారతీయ సిబ్బంది క్షేమం

న్యూఢిల్లీ: హమాస్‌పై దాడికి దిగిన ఇజ్రాయెల్‌కు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుపలికిన దేశాలను హౌతీ తిరుగుబాటుదారులు డ్రోన్ దాడులతో భయపెట్టే ప్రయత్నాలు ముమ్మరంచేశారు. … నెమ్మదిగా అంతర్జాతీయ జల రవాణా రంగం మీద ప్రభావం చూపుతోంది. గత కొద్ది వారాలుగా యెమెన్ తీరం వెంబడి ఎర్రసముద్ర జలాల్లో ప్రయాణించే సరకు రవాణా నౌకలపై హౌతీ రెబల్స్.. డ్రోన్ దాడులతో తెగబడుతున్నారు. లైబీరియా జెండా ఉన్న, ఇజ్రాయెల్‌కు చెందిన వాణిజ్యనౌక ఎంవీ చెమ్ ప్లూటోపై డ్రోన్ దాడి జరిగిన మరుసటి రోజే మరో చమురు రవాణా నౌక ఎంవీ సాయిబాబాపై డ్రోన్ దాడి చేశారు. ఎర్రసముద్ర జలాల్లో గబాన్ జెండాతో భారత్‌కు వస్తున్న ఈ నౌకపై శనివారం దాడి జరిగిందని ది అమెరికా సెంట్రల్ కమాండ్(సెంట్‌కామ్) ప్రకటించింది. ''సాయిబాబా నౌకలోని మొత్తం 25 మంది సిబ్బంది భారతీయులే. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. గాబాన్ జెండా ఉన్న ఎంవీ సాయిబాబా నౌక భారత్‌లోనూ షిప్పింగ్‌కు సంబంధించిన సర్టిఫికెట్‌ను తీసుకుంది'' అని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్‌చేసింది. నార్వే జెండాతో ఎర్రసముద్ర జలాల్లో రసాయన/చమురు ట్యాంకర్‌లతో పయనిస్తున్న ఎంవీ బ్లామనెన్ నౌకపైనా దాడికి ప్రయత్నించి తిరుగుబాటుదారులు విఫలమయ్యారని అమెరికా వెల్లడించింది. సౌదీ అరేబియా నుంచి చమురు సరకుతో భారత్‌కు వస్తున్న ప్లూటో నౌకపై ఇటీవలే అరేబియా సముద్రంలో పోరుబందర్ తీరానికి 217 నాటికల్ మైళ్లదూరంలో డ్రోన్ దాడి జరిగిన విషయం తెల్సిందే. అందులోనూ 20 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు.

ద్రోహినో, దేశభక్తుడినో ప్రజలే నిర్ణయిస్తారు

లోక్‌సభలో పొగ ఘటనపై బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా

మైసూరు(కర్ణాటక): లోక్‌సభలో పొగబెట్టిన ఘటనలో నిందితులకు పాస్‌లిచ్చి విమర్శలకు గురైన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా ఆ ఘటనపై తొలిసారిగా స్పందించారు. తాను దేశద్రోహినో, దేశ భక్తుడినో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లే నిర్ణయిస్తారన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. ''ఘటనను, దానిపై జరుగుతున్న దర్యాప్తును తప్పుదోవ పట్టించే ఉద్దేశం నాకు లేదు. దైవం, ఓటర్లే నేను ఎలాంటి వ్యక్తినో ఈసారి ఎన్నికల్లో ఫలితం ద్వారా నిర్ణయిస్తారు. అంతకుమించి నేను చెప్పదల్చుకుంది ఏమీ లేదు'' అన్నారు. మాజీ పాత్రికేయుడైన సింహా కర్ణాటకలోని మైసూరు–కొడగు లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు బీజేపీ తరఫున విజయం సాధించారు. డిసెంబర్ 13వ తేదీన లోక్‌సభ గ్యాలరీ నుంచి సభలోకి దూకిన ఇద్దరు ఆగంతకులు పొగ గొట్టాలు విసిరి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి కలకలం రేపడం తెల్సిందే. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ప్రతాప్ సింహా వాంగ్మూలాన్ని పోలీసులు నమోదుచేశారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ చెప్పారు.

హిందీ మాట్లాడేవాళ్లు... టాయిలెట్లు కడుగుతున్నారు

డీఎంకే ఎంపీ దయానిధి మారన్ వ్యాఖ్యలు

- సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన గత మార్చి నాటి వీడియో క్లిప్
- బీజేపీ, ఆర్జేడీ నాయకులు తదితరుల తీవ్ర ఆగ్రహం
- ఉత్తర భారతీయులను అవమానిస్తున్నారని ధ్వజం

చెన్నై/పట్నా: తమిళనాడుకు చెందిన అధికార డీఎంకే ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి దయానిధి మారన్ కొన్ని నెలల క్రితం చేసిన వ్యాఖ్యలపై ప్రస్తుతం రగడ మొదలైంది. తమిళనాడులో బీజేపీ, డీఎంకే మధ్య మాటల యుద్ధం సాగుతోంది. హిందీ రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బిహార్ కార్మికులు తమిళనాడులో మరుగుదొడ్లు కడుగుతున్నారంటూ మారన్ ఈ ఏడాది మార్చి నెలలో ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. మారన్ వైఖరిని బీజేపీ నేతలు తప్పుపడుతున్నారు. బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ సైతం స్పందించారు. మార్చి జరిగిన కార్యక్రమంలో దయానిధి మారన్ మాట్లాడుతూ... తమిళ భాషతోపాటు ఆంగ్ల భాషను తమ పార్టీ ప్రోత్సహిస్తోందని, తమిళనాడు ప్రజలు ఆయా భాషలను చక్కగా నేర్చుకుంటున్నారని చెప్పారు. తమిళనాడుకు చెందిన సుందర్ పిచాయ్ ఇప్పుడు గూగుల్ కంపెనీకి సీఈఓగా ఎదిగాడని గుర్తుచేశారు. ఒకవేళ సుందర్ పిచాయ్ హిందీ నేర్చుకొని ఉంటే నిర్మాణ రంగంలో సాధారణ కార్మికుడిగా పని చేసుకుంటూ ఉండేవాడని అన్నారు. తమిళనాడు విద్యార్థులు ఇంగ్లిష్ నేర్చుకొని ఐటీ కంపెనీల్లో పెద్ద హోదాల్లో ఉద్యోగాలు సంపాదిస్తున్నారని, మెరుగైన వేతనాలు పొందుతున్నారని తెలిపారు. హిందీ మాత్రమే నేర్చుకుంటున్న ఉత్తరప్రదేశ్, బిహార్ వాసులు తమిళనాడుకు వలస వచ్చి నిర్మాణ రంగంలో పని చేస్తున్నారని, రోడ్లు ఊడుస్తున్నారని, టాయిలెట్లు కడుగుతున్నారని చెప్పారు. హిందీ మాత్రమే నేర్చుకుంటే పరిస్థితి ఇలాగే ఉంటుందని అన్నారు. మారన్ మాట్లాడిన వీడియో క్లిప్ సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

డీఎంకే రంగు బయటపడింది: బీజేపీ

హిందీ రాష్ట్రాల ప్రజల గురించి ప్రస్తావిస్తూ మారన్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందీ మాట్లాడేవారిని, ఉత్తర భారతీయులను అవమానించడం డీఎంకే నేతలకు అలవాటుగా మారిందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా 'ఎక్స్'లో విమర్శించారు. ఆ పార్టీ నుంచి ఒకరి తర్వాత ఒకరు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. డీఎంకే నాయకులు సనాతన ధర్మంపై దాడి చేశారని చెప్పారు. ఇంత జరుగుతున్నా విపక్ష 'ఇండియా' కూటమి నేతలు నోరువిప్పడం లేదని ఆక్షేపించారు. ఇతరులను కించపర్చడం తగదని డీఎంకే నేతలకు హితవు పలికారు. మారన్ వ్యాఖ్యలు కొన్ని నెలల క్రితం నాటివే అయినప్పటికీ డీఎంకే అసలు రంగు మళ్లీ బయటపడిందని తమిళనాడు బీజేపీ ఉపాధ్యక్షుడు నారాయణన్ తిరుపతి పేర్కొన్నారు. ఉత్తర భారతీయులను అవమానించేలా, దూషించేలా డీఎంకే పెద్దలు తరచుగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. భవిష్యత్తులోనూ వారు వైఖరి మార్చుకుంటారన్న నమ్మకం తనకు లేదన్నారు.



అన్ని రాష్ట్రాలూ సమానమే: డీఎంకే

బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు వీడియోను వ్యాప్తిలోకి తీసుకొస్తున్నారని డీఎంకే అధికార ప్రతినిధి జె.కాన్‌స్టాండైన్ రవీంద్రన్ ఆరోపించారు. సమతావాద సమాజానికి తమ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. ఒక రాష్ట్రం ఎక్కువ, మరో రాష్ట్రం తక్కువ అనేది తమ విధానం కాదని, అన్ని రాష్ట్రాలూ సమానమేనని అన్నారు. మారన్ ఏనాడూ చెప్పని మాటలను చెప్పినట్లుగా బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ''మాతృ భాషతోపాటు ఆంగ్లమూ నేర్చుకుంటే మంచి అవకాశాలు లభిస్తాయన్నది మారన్ ఉద్దేశం. ఇంగ్లిష్ నేర్చుకున్నవారికి ఇండియాలోనే గాక ప్రపంచమంతటా డిమాండ్ ఉంది. మారన్ చెప్పిందీ అదే'' అన్నారు.

పరస్పరం గౌరవించుకోవాలి: తేజస్వి

దయానిధి మారన్ వ్యాఖ్యలను బిహార్ ఉపముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆదివారం ఖండించారు. తమ పార్టీ తరహాలోనే డీఎంకే కూడా సామాజిక న్యాయాన్ని నమ్ముతుందని చెప్పారు. అలాంటి పార్టీ నేత ఇతర రాష్ట్రాల వారిని అవమానించేలా మాట్లాడడం శోచనీయమని అన్నారు. కుల అసమానతలు, కొన్ని కులాల వారే ప్రమాదకరమైన పనులు చేయడం గురించి ప్రస్తావించి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. కానీ, ఉత్తరప్రదేశ్, బిహార్ ప్రజలందరినీ ఇందులోకి లాగడం సమంజసం కాదని చెప్పారు. ఇతర రాష్ట్రాల ప్రజలను గౌరవించాలని సూచించారు. పరస్పరం గౌరవించుకోవడం సముచితమని తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. తాము ఇతరులను గౌరవిస్తామని, వారి నుంచి గౌరవాన్ని కోరుకుంటున్నామని ఉద్ఘాటించారు.


సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 25 । డిసెంబర్ । 2023



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను ఆదివారం కేంద్ర ఎన్నికల సంఘం ఉప కార్యదర్శి సంతోష్ అజ్మీరా దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం ఆదివారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 7,742, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నేటి స్పందన రద్దు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమం క్రిస్మస్ పండుగ సందర్భంగా రద్దు చేసినట్లు కలెక్టర్ ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

శాంతి, సహనం, ప్రేమను పంచడమే క్రిస్మస్



పెడన: శాంతి, సహనం, ప్రేమను సమాజానికి పంచడమే క్రిస్మస్ పండుగ అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వ మానవాళికి ప్రేమతత్వంతో వెలుగులు పంచిన కరుణామయుడు, ప్రేమమూర్తి ఏసుక్రీస్తు పుట్టినరోజు సందర్భంగా మంత్రి జోగి రమేష్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ డీసీపీగా చక్రవర్తి



విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ)గా కె.చక్రవర్తి నియమితులయ్యారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నాన్‌కేడర్ ఎస్పీల బదిలీల్లో భాగంగా తిరుపతి టాస్క్‌ఫోర్స్(రెడ్ శాండిల్ యాంటీ స్మగ్లింగ్ విభాగం) ఎస్పీగా పని చేస్తున్న ఆయన్ని ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేశారు. ట్రాఫిక్ కార్యాలయంలో ఆదివారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణామాచార్యులు, చక్రపాణి ఆధ్వర్యంలో ధ్వజారోహణం వద్ద రక్షాబంధనం, వాస్తుపూజ, వాస్తు హోమం, అంకురారోహణ వంటి ప్రత్యేకపూజలు నిర్వహించారు. నాలుగురోజుల పాటు పవిత్రోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

బాక్సింగ్, ఫుట్‌బాల్ జట్లకు అభినందన

విజయవాడ స్పోర్ట్స్: సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల బాక్సింగ్, ఫుట్‌బాల్ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్లను ఎంపిక చేసినట్లు జట్ల మేనేజర్ జె.వి.నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఫుట్‌బాల్ జట్టుకు రాయుడు, దుర్గాప్రసాద్, జాషువా, మనోహర్, దీపక్, శామ్యూల్, పి. ప్రదీప్, హెచ్ కుమార్, తేజ, రాజా, విక్టర్, హర్షిత్, షణ్ముక, అజయ్, ప్రదీప్, జితేంద్ర, రాజ్‌పుత్, ప్రశాంత్ ఎంపికయ్యారని తెలిపారు. బాక్సింగ్ జట్టుకు అనిల్‌కుమార్‌రెడ్డి, రాజేష్, బాజీబాబా, పవన్‌కల్యాణ్, సాయికిరీటి, పవన్‌కుమార్, వీరాంజనేయులు, పృథ్వీరాజ్, సోనుభార్గవ్, ద్రావిడ్, వినయ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఫుట్‌బాల్ జట్టు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే పోటీల్లో, బాక్సింగ్ జట్టు యూనివర్సిటీ ఆఫ్ చండీగఢ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. వీరిని లయోల ప్రిన్సిపాల్ కిషోర్ అభినందించారు.

కేయూ ఖోఖో మహిళల జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల ఖోఖో మహిళల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు సిద్ధార్థ మహిళా కళాశాల వ్యాయామ అధ్యాపకురాలు, జట్టు మేనేజర్ వి.లక్ష్మీకనకదుర్గ తెలిపారు. కళాశాలలో నిర్వహించిన ఎంపికల్లో క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన కె.హారిక, భవాని, త్రివేణి, ఇందు, ఎస్.సౌజన్య, కె.చైతన్య, టి.దేవీప్రియ, పి.లావణ్య, ఎం.బిందులత, కె.హల్లెలూయా, శ్రీదేవి, ఎస్.కె.అభిద, జి.శ్రీవర్ష, బి.మౌనిక, దుర్గాభవాని ఎంపికైనట్లు చెప్పారు. కళాశాల ప్రాంగణంలో డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన ఆదివారం అభినందించారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలోని సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): ఏపీ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హేమచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ మతాలకు చెందిన అభ్యర్థులు గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలకు వివిధ ఇన్‌స్టిట్యూషన్స్ ద్వారా ఉచితంగా కోచింగ్ అందిస్తున్నామని, ఆయా పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీసీఈడీఎంఎంబ్ల్యూడీ.ఓఆర్‌జీడాట్‌కామ్ వెబ్‌సైట్ లేదా స్వాతి థియేటర్ వద్ద ఉన్న సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ మైనార్టీస్ కార్యాలయంలో లేదా 0866–2970567 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

శుభోదయ తరుణం



విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని సెయింట్‌పాల్ కథెడ్రల్ చర్చిలో ప్రార్థనలు

మరియ తనయుడు జనియించిన సుదినం. లోకరక్షకుడి జన్మదినం విశ్వమంతా పర్వదినం. మానవాళికి శాంతి సందేశం అందించడానికి ఏసు భువి పైకి అరుదెంచిన రోజు క్రిస్మస్. పండగ సందర్భంగా తారల కాంతిలో ఆరాధనా మందిరాలు ప్రకాశించాయి. చర్చిల ఆవరణల్లో శాంతి సందేశాలు పాటల రూపంలో ప్రతిధ్వనించాయి. రాగాలాపనతో విశ్వాసుల మది ఆనందంతో ఉప్పొంగింది. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జిల్లాలోని చర్చిలు విద్యుత్ దీపాల నడుమ జిగేల్‌మంటున్నాయి. సోమవారం పండుగ సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు, గీతాలాపనలతో చర్చిలు సందడిగా మారాయి. క్రైస్తవుల ఇళ్లు నక్షత్రాల కాంతులు, క్రిస్మస్ ట్రీలతో కాంతులీనుతున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్,విజయవాడ



విజయవాడలో పీటర్ లూథరన్ చర్చికి విద్యుత్ కాంతులు

హైవేపై హాయిగా..

- ఉమ్మడి జిల్లాలో రహదారులకు రాజయోగం
- పెండింగ్‌లో ఉన్న హైవే పనులపై ప్రత్యేక దృష్టి
- కొలిక్కి వచ్చిన భూసేకరణ సమస్య
- ఎయిర్ పోర్టు వద్ద హాఫ్ ఫ్లైఓవర్ నిర్మాణం
- బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ వద్ద జరుగుతున్న వెస్ట్ ,ఈస్ట్ వైపు సర్వీస్ రోడ్డు పనులు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో రహదారులకు రాజయోగం పట్టింది. పెండింగ్‌లో ఉన్న రోడ్ల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో.. త్వరలో హైవేపై ప్రయాణం హాయిగా సాగనుంది. దీనిలో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో భూసేకరణ సమస్యలను అధిగమించి పనులు మొదలుపెట్టారు. జిల్లాలోని హైవేల పనులు, ఫ్లై ఓవర్లు పూర్తయితే వాహనాలు రయ్..రయ్‌మని ముందుకెళ్లడమే.



విమానాశ్రయం వద్ద నిర్మించిన హాఫ్ ఫ్లైఓవర్

సాక్షిప్రతినిధి,విజయవాడ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోంది. పెరుగుతున్న వాహన రాకపోకలకు అనుగుణంగా ప్రధాన పట్టణాలు, నగరాల మధ్య రాకపోకలకు వీలుగా ఉండేలా రోడ్ల విస్తరణ చేస్తున్నారు. దీనిలో భాగంగా విజయవాడ–మచిలీపట్నం (ఎన్‌హెచ్–65)లో పెండింగ్‌లో ఉన్న పనులను అధికారులు శరవేగంగా చేస్తున్నారు.

గన్నవరం విమానాశ్రయం వద్ద వాహన రాకలకు ఇబ్బంది కలగకుండా, ప్రమాదాల నివారణకు వీలుగా హాఫ్ ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు. ఈ పనులు తుది దశకు చేరాయి. ప్రధానంగా బెంజ్‌సర్కిల్ ఫ్లైఓవర్‌కు సంబంధించి తూర్పు, పశ్చిమ వైపు సర్వీస్ రోడ్లు, భూసేకరణ సమస్యలను అధిగమించి పనులు ప్రారంభించారు. మొత్తానికి ఉమ్మడి కృష్ణా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న హైవే పనులు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారు.



నందిగామ వద్ద శరవేగంగా ఫ్లైఓవర్ పనులు

త్వరలో ఫ్లైఓవర్‌పై ప్రయాణం

విమాన ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా విమానాశ్రయానికి ముందు హాఫ్ ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే వాహనాల రద్దీ, ప్రమాదాల నివారణకు ఉపయోగపడుతుంది. ఇక్కడ 1.415 కిలోమీటర్ల పొడవుతో రెండు లైన్ల ఫ్లైఓవర్‌ను రూ 23.77 కోట్లతో నిర్మిస్తున్నారు. విమానాశ్రయాన్ని విస్తరించి, కొత్తగా ఏర్పాటు చేస్తున్న గేటు వద్దకు ఈ హాఫ్ ఫ్లైఓవర్‌ను అనుసంధానించనున్నారు. దీని మీదుగా రాకపోకలు సాగనున్నాయి.

మార్గం సుగమం

మచిలీపట్నం–విజయవాడ–హైదరాబాద్ (ఎన్‌హెచ్–65) హైవేలో పెండింగ్‌లో బైపాస్ పనులను అధికారులు చేపడుతున్నారు. ఈ హైవే నాలుగు లైన్ల రహదారి అయినా, బైపాస్‌ల వద్ద మాత్రం ఆరులైన్లు నిర్మించారు. ఇందులో కంచకచర్ల, నందిగామ బైపాస్‌ల వద్ద ఆరులైన్ల రోడ్లను ఏర్పాటు చేశారు. నందిగామకు సంబంధించి ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్డుకు, భూసేకరణ వివాదంతో ఎదురయ్యాయి. దీంతో కొంతమంది రైతులు కోర్టును ఆశ్రయించారు. అక్కడ రోడ్డు అసంపూర్తిగా ఉండటం, తరుచూ ప్రమాదాలు జరుగుతుండటంతో, రవాణాశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న..ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి, భూసేకరణపై దృష్టి సారించారు. వీరు రైతులతో చర్చించి భూసేకరణ సమస్యను కొలిక్కి తెచ్చారు. దీంతో పనులకు మార్గం సుగమమైంది. ఈ బైపాస్‌కు ప్రస్తుతం 880మీటర్ల మేర ఫ్లైఓవర్ నిర్మాణం, 2.1 కి.మీ. మేర సర్వీసు రోడ్డు పనులను రూ.17 కోట్ల తో చేపడుతున్నారు. విజయవాడ–మచిలీపట్నం రహదారిలో పనులను రూ.35 కోట్లతో చేస్తున్నారు.

పనులు పూర్తి చేస్తున్నాం



జాతీయ రహదారుల్లో పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి, పనుల పూర్తికి చర్యలు తీసుకొంటున్నాం. ఎన్–65లో అసంపూర్తిగా పనులపై దృష్టి సారించాం. ప్రధానంగా నందిగామ వద్ద భూ సేకరణ సమస్యను అధిగమించాం. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. విజయవాడ–బందరు జాతీయ రహదారిపై పెండింగ్ పనులు తుది దశకు చేరాయి. బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ వద్ద వెస్ట్, తూర్పు వైపు సర్వీస్ రోడ్డు నిర్మాణంలో భూసేకరణ అంశం కొలిక్కి రావడంతో పనులు ప్రారంభమయ్యాయి. విమానాశ్రయం వద్ద హాఫ్ ఫ్లైఓవర్ పనులు దాదాపు పూర్తయ్యాయి. జాతీయ రహదారిపై పెండింగ్, అసంపూర్తి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నాం.

–నారాయణరెడ్డి, పీడీ, నేషనల్ హైవే అథారిటీ

వెస్ట్, ఈస్ట్ సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభం....

బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ వెస్ట్, ఈస్ట్ సైడ్ సర్వీస్ పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ భూసేకరణను అధికారులు పూర్తి చేశారు. సర్వీస్ రోడ్డుకు అడ్డుగా ఉన్న భవనాలను తొలగిస్తున్నారు. విద్యుత్ స్తంభాలను మారుస్తున్నారు. పశ్చిమం వైపు సర్వీస్ రోడ్డు 2.47 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నారు. దీనికి రూ.25 కోట్లను వెచ్చిస్తున్నారు. బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ మెయిన్ క్యారేజీని రూ7.5 కోట్లతో విస్తరిస్తున్నారు. బెంజి సర్కిల్ ఫ్లైఓవర్ తూర్పు వైపున పెండింగ్‌లో ఉన్న 860 మీటర్ల సర్వీస్ రోడ్డు పనులు చేస్తున్నారు. బెంజిసర్కిల్ నుంచి పోరంకి వరకు ఆరు కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. ప్రధాన జంక్షన్‌లో స్ట్రీట్ లైట్లు అమరుస్తున్నారు. పోలార్ బ్లింకర్లు ఏర్పాటు చేస్తున్నారు. బ్లాక్ స్పాట్లలో ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.



బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ వద్ద వెస్ట్ సైడ్ సర్వీస్ రోడ్డు పనులు

'సామాజిక' యాత్రను విజయవంతం చేయాలి

- పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి
- కంకిపాడులో సభ ఏర్పాట్ల పరిశీలన



కంకిపాడు: సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. కంకిపాడులో ఈ నెల 28న సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో సభా ప్రాంగణ స్థలాన్ని ఆదివారం పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. కంకిపాడులో సింహాలబొమ్మ వద్ద వేదిక ప్రాంగణం ఏర్పాటుచేయాలని సూచించారు. అనంతరం పార్టీ శ్రేణులతో మాట్లాడారు. సాధికార బస్సు యాత్రను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజాభాగస్వామ్యం ఉండాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించి చైతన్యం పరచాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సీహెచ్‌సీ చైర్మన్ మేదం ద్రావు కుటుంబరావు, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, కమ్మ, ఉమన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌లు రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, ఎంపీటీసీ చిట్టూరి ప్రసాద్, నాయకులు బండి నాంచారయ్య, కంకిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆరుద్రోత్సవం

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి ఆరుద్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. 27వ తేదీ ఉదయం యాగశాలలో రుద్రహోమం జరుగుతుందని చెప్పారు.

క్రీడా స్ఫూర్తి నింపేందుకే ఆడుదాం ఆంధ్రా

ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):రాష్ట్రంలోని యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఆడుదాం ఆంధ్రా పేరుతో యువతకు పోటీలు నిర్వహిస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. ఆడుదాం – ఆంధ్రా విజయవంతం చేయాలంటూ ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో శాతవాహన కళాశాల నుంచి శిఖామణి సెంటర్ వరకు ఆదివారం ఉదయం ర్యాలీ చేశారు. శాతవాహన కళాశాల మైదానం వద్ద మొదలైన ర్యాలీ విశాలాంధ్ర రోడ్డు, చలసాని చౌక్, నిమ్మతోట సెంటర్, నైస్ బార్ జంక్షన్ మీదుగా శిఖామణి సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనడానికి విజయవాడ పరిధిలో ఇప్పటి వరకు 33 వేల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో 4500 టీమ్‌లు ఎంపికయ్యాయని, డిసెంబర్ 26 నుంచి 45 రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా పోటీలు జరుగుతాయని చెప్పారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడంతో పాటుగా ప్రతిభ చూపిన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన యువతకు శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ఉత్సాహ పూరిత వాతావరణంలో ఆడుదాం ఆంధ్రా పోటీలు జరుగుతాయన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పేర్లు నమోదు చేసుకున్న వారికి ఉచితంగా ఆట పరికరాలను సైతం అందజేస్తున్నామని వివరించారు. క్రీడాకారులుగా ఎదగటానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి యువతకు అవకాశం కల్పించారన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌తో పాటుగా యాప్ ద్వారా కూడా ఆడుదాం ఆంధ్రాలో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. పోటీలు జరిగే ప్రాంతంలో స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చునన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ యువత తమలోని ప్రతిభను ప్రదర్శించడానికి ఆడుదాం ఆంధ్రా పోటీలు వేదిక అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కడియాల బుచ్చిబాబు, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గతో పాటుగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యేలు విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, కమిషనర్ స్వప్నిల్‌దినకర్, అవినాష్ తదితరులు

శరవేగంగా..

- దీక్ష విరమణ ఏర్పాట్లు
- తుది దశకు క్యూలైన్ పనులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే భవానీ దీక్ష విరమణ మహోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. వినాయకుడి గుడి వద్ద నుంచి ప్రారంభమైన క్యూలైన్ల ఏర్పాటు దాదాపు పూర్తయింది. కనకదుర్గనగర్‌లో ప్రసాదం కౌంటర్ల కోసం క్యూలైన్లు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. లక్ష్మీ గణపతి ప్రాంగణంలో షెడ్డు నిర్మాణం, మహా మండపం దిగువన హోమ గుండాల పనులు జరుగుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో హోమగుండాల నిర్మాణం పూర్తవుతుందని ఆలయ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. సీతమ్మ వారి పాదాల వద్ద భవానీలు తలనీలాలు సమర్పించడానికి కేశ ఖండనశాల షెడ్డు, స్నాన ఘాట్లలో జల్లు స్నానాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీక్ష విరమణలపై ఆలయ ఈవో కె.ఎస్.రామారావు ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్నారు. దేవస్థాన చైర్మన్ కర్నాటి రాంబాబు పనులు నెలాఖరుకు పూర్తి కావాలని సూచిస్తున్నారు. వీరితోపాటు కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టీకే రాణా ప్రత్యేక దృష్టి పెట్టారు.



లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో భారీ షెడ్డును ఏర్పాటు చేస్తున్న దృశ్యం



ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు

రేపు గిరిప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.ఎస్.రామారావు పేర్కొన్నారు. లోక కల్యాణార్థం, భక్తజన శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రతి పౌర్ణమి రోజు శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం తెల్లవారుజామున 5.55 గంటలకు ఘాట్ రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా మహా మండపానికి ఊరేగింపు చేరుకుంటుంది. దీనిలో భవానీలు, అయ్యప్పలు, శివ దీక్షాపరులతో పాటు అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు కోరారు.

సాయంత్రం జ్యోతుల మహోత్సవం

భవానీ దీక్షలను పురస్కరించుకుని 26వ తేదీ సాయంత్రం జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు సత్యనారాయణపురంలోని శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి అమ్మవారి భక్తులు ఉత్సవ మూర్తులతో ఊరేగింపు ప్రారంభమవుతుంది.

ఏపీ యాదవ సంఘాల జేఏసీ ఆవిర్భావం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ యాదవ సంఘాల జేఏసీ ఆవిర్భవించింది. కమిటీ చైర్మన్‌గా మద్దుల వెంకట కోటయ్య యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక య్యారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం రాష్ట్ర యాదవ సంఘాల సమావేశం జరిగింది. దీనిలో జేఏసీని ఏర్పాటు చేసి చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఎన్నికైన మద్దుల వెంకట కోటయ్య యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న యాదవ సంఘాలన్నింటినీ ఏకతాటిపైకి తేవడానికి జేఏసీగా ఏర్పడినట్లు తెలిపారు. త్వరలో జేఏసీ పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. యాదవుల ప్రధాన డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఫిబ్రవరిలో రాష్ట్ర యాదవ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. దీనికి దేశంలోని యాదవ ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్య మంత్రులు, మాజీ కేంద్ర మంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర యాదవ సంఘ నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు బుసగాని లక్ష్మయ్య యాదవ్, పిన్నిక లక్ష్మి ప్రసాద్ యాదవ్, ఉప్పుటూరి పేరయ్య యాదవ్, రమేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసు సిబ్బందికి ఎస్పీ క్రిస్మస్ శుభాకాంక్షలు



కోనేరుసెంటర్: జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్పీ పి. జాషువ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. లోక రక్షకుడు ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన చూపిన ప్రేమ, కరుణ, దయ, శాంతి సుగుణాలను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని కోరారు. అలాగే తోటి వారి పట్ల జాలి కలిగి ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పోలీసు కుటుంబాలతో పాటు జిల్లా ప్రజలంతా ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ ల్యాబ్ టెక్నీషియన్స్ ఉమ్మడి కృష్ణా కమిటీ ఎన్నిక



సయ్యద్ వజీరుద్దీన్ అధ్యక్షుడు



నాళం మురళీకృష్ణ ప్రధాన కార్యదర్శి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ ల్యాబ్ టెక్నీషియన్స్/ల్యాబ్ అటెండెంట్స్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి కృష్ణా అధ్యక్షుడిగా సయ్యద్ వజీరుద్దీన్ ఖాదీర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ రమణ, వైస్ ప్రెసిడెంట్‌లుగా టి.రాజారత్నబాబు, వి.చిన్నబాబు, కె.వెంకటనాథ్, టి.శివప్రసాద్ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నాళం మురళీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్. ప్రభాకర్, జాయింట్ సెక్రటరీలుగా జీఎస్ దీక్షితులు, వి.కృష్ణకిషోర్, ఎంఎస్ కోటేశ్వరరావు, జీవీవీ శ్రీనివాసరావు, కోశాధికారిగా టి.గోపీనాథ్ ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 14 మంది కార్యవర్గ సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఎన్నికల పరిశీలకులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రామకృష్ణయ్య, సలహాదారుడిగా టి. సురేష్‌బాబు వ్యవహరించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

జిల్లా ప్రజలకు కలెక్టర్ ఢిల్లీరావు క్రిస్మస్ శుభాకాంక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏసుక్రీస్తు జీవితం, బోధనలు అనుసరణీయమని పేర్కొన్నారు. నిస్వార్థమైన ప్రేమతో ప్రతి ఒక్కరినీ ఆదరించాలన్న ఏసు క్రీస్తు బోధనలు అనుసరిస్తూ ఆనందమయ జీవితం గడపాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సమయంలో దానధర్మాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. జిల్లా ప్రజలు జీసస్ ఆశీస్సులు పొంది సుఖసంతోషాలతో జీవించాలని కోరారు.

క్రీస్తు జననం సర్వ మానవాళికి మహోదయం



క్రిస్మస్ సందేశాన్నిస్తున్న ఆర్‌సీఎం, సీఎస్ఐ బిషప్‌లు తెలగతోటి రాజారావు, జార్జి కొర్నేలియస్

పటమట(విజయవాడతూర్పు): క్రీస్తు జననం సర్వ మానవాళికి మహోదయమని, రక్షణ వరమని విజయవాడ కథోలిక పీఠం(ఆర్‌సీఎం) బిషప్ తెలగతోటి రాజారావు, కృష్ణా గోదావరి అధ్యక్ష ఖండం (సీఎస్ఐ) బిషప్ టి. జార్జి కొర్నేలియస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో క్రిస్మస్ సందేశమిచ్చారు. దేవుడు తన ఏకైక కుమారుడిని ఈ లోకానికి పంపిన శుభదినమే క్రిస్మస్ అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని మతాలు, కులాలు, వివిధ జాతుల ప్రజలు నిర్వహించుకునే ఈ గొప్ప మహోత్సవం క్రిస్మస్ అని పేర్కొన్నారు. కరుణ, జాలి, దయకు క్రీస్తు కేంద్ర బిందువని చెప్పారు. ప్రపంచ స్థితి గతులు మార్చిన దేవుడు ఏసు క్రీస్తు అన్నారు. క్రీస్తులో ఉన్న సుగుణాలను ముందుకు తీసుకెళ్లటమే నిజమైన క్రైస్తవ్యమని పేర్కొన్నారు. క్రీస్తు ఈ లోకానికి వెలుగన్నారు. అంధకారం నుంచి వెలుగుల జీవితాన్ని ప్రసాదించి మరింత ఆనందం చేకూరుతుందన్నారు.

27న నగరంలో గౌడ ఆత్మీయ సదస్సు



గౌడ సంఘీయుల ఆత్మీయ సదస్సు కరపత్రాన్ని విడుదల చేస్తున్న చలపాటి వెంకటేశ్వరరావు

పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 27వ తేదీన నగరంలోని గురునానక్ కాలనీ రోడ్‌లోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంఘీయుల ఆత్మీయ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి గౌడ సంఘ ప్రతినిధులు హాజరుకావాలని రాష్ట్ర గౌడ సంఘం అడహక్ కమిటీ కన్వీనర్ చలపాటి వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం పటమట న్యూ ఆర్టీసీ కాలనీలోని ఆయన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గౌడ ప్రజల ఆత్మ గౌరవాన్ని వ్యక్తపరిచే ఈ కార్యక్రమానికి ప్రతి గౌడ హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంఘీభావం వ్యక్తం చేస్తూ ఏలూరు పెదవేగి తదితర మండలాల్లో గల గౌడ పెద్దలను ఆయన కలిశారు. అనంతరం ఆయన కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. వీరంకి రామచంద్రరావు, దాసరి ప్రసాదు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా లక్ష్మీ, మట్టా రమాశంకర్, ఏఎంసీ చైర్మన్ మేక లక్ష్మణరావు, మధు గంగాధర్, మారగాని కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఉద్యోగం సాధించిన ఫైర్‌మన్



సాదం పృథ్వీ యాదవ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: అగ్నిమాపక కేంద్రంలో ఫైర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న సాదం పృథ్వీ యాదవ్ పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపిక అయ్యాడు. ఇటీవల ఏపీ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో పృథ్వీ యాదవ్ సివిల్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. నందివాడ మండలం తమిరిశ గ్రామానికి చెందిన సాదం పృథ్వీ యాదవ్ 2020లో అగ్నిమాపకశాఖలో ఫైర్‌మెన్‌గా ఉద్యోగం సాధించినప్పటికీ ఎస్ఐ కావాలనే దృఢమైన పట్టుదలతో కష్టపడి తన కలను సాకారం చేసుకున్నాడు. పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపిక అయిన ఆయనను తోటి ఉద్యోగులు అభినందించారు.

ఏకేఎఫ్ఐ కార్యవర్గ సభ్యుడిగా శ్రీకాంత్



రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న శ్రీకాంత్

విజయవాడస్పోర్ట్స్: అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏకేఎఫ్ఐ) కార్యవర్గ సభ్యుడిగా విజయవాడకు చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఢిల్లీలోని హోటల్ క్రౌన్ ప్లాజాలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో సమాఖ్య నూతన అధ్యక్షుడు వినీత్‌జైన్, కార్యదర్శి జితేంద్రఠాగూర్ ప్యానల్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ప్యానల్‌లోనే శ్రీకాంత్ కార్యవర్గ సభ్యుడిగా చోటు దక్కించుకుని రిటర్నింగ్ అధికారి, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి ఒ.పీ. సైని చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఏకేఎఫ్ఐ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన శ్రీకాంత్‌ను ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరారెడ్డి, సంఘ ప్రతినిధులు అభినందించారు.

వీఆర్ఏల నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక



జిల్లా కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న అమరావతి జేఏసీ సభ్యులు

ఇబ్రహీంపట్నం:ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం జరిగింది. అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు సూచనల మేరకు నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా సందిపాముల ఏసు రత్నం, ప్రధాన కార్యదర్శిగా షేక్ మీరావలి, కోశాధికారిగా పరదేశి, ఉపాధ్యక్షుడిగా నవీన్, సంయుక్త కార్యదర్శిగా షబ్బీర్, ఇద్దరు కార్యవర్గ సభ్యులు, ఒక సలహాదారుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమరావతి జేఏసీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మయ్య, రాంబాబు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సాయి మహేష్ బాబు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ మధుబాబు, నూతన కమిటీని అభినందించారు.

దుర్గమ్మకు విదేశీ వనిత నృత్యార్చన



చిన్నారులతో కలిసి నృత్య ప్రదర్శన ఇస్తున్న వీవెన్ లై సియూ పింగ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం విదేశీ వనిత నృత్యార్చన అందించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై సింగ్‌పూర్‌లో స్థిరపడిన చైనాకు చెందిన మహిళ వివియన్ లై సియు పింగ్ నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఇండియాకు విచ్చేసిన వీవెన్ లై సియూ పింగ్ తొలి సారిగా అమ్మవారి సన్నిధిలో నృత్య ప్రదర్శన ఇచ్చినట్లు పేర్కొన్నారు. 62 ఏళ్ల వయస్సులో చక్కటి అభినయంతో లయబద్ధంగా పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇవ్వగా, భక్తులు ఎంతో ఆసక్తిగా నృత్య ప్రదర్శనను వీక్షించారు. అమ్మవారి సన్నిధిలో నృత్య ప్రదర్శన ఇచ్చేందుకు అవకాశం కల్పించిన చైర్మన్ రాంబాబు, ఈవో రామారావుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. నృత్య ప్రదర్శన అనంతరం అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందచేశారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- స్ఫూర్తి పేరుతో పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28,661 మంది విద్యార్థులకు పంపిణీ
- నిష్ణాతులైన ఉపాధ్యాయులతో కూర్పు
- అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): రాబోయే పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా జిల్లా పరిషత్ పాలకవర్గం, విద్యాశాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. ప్రతి సంవత్సరం పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారందరూ ఉత్తీర్ణత సాధించే దిశగా స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నారు. గత సంవత్సరం జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో 'స్ఫూర్తి' పేరుతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసి ఉత్తీర్ణత పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. అదే రీతిలో ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలనే దిశగా సర్వసభ్య సమావేశంలో పాలకవర్గ సభ్యులు సూచన మేరకు స్టడీ మెటీరియల్‌ను అందజేసేందుకు చర్యలు తీసుకున్నారు.

జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో....

ఈ ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలనే దిశగా జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ నెల 21వ తేదీన జిల్లా స్థాయి కార్యక్రమాన్ని పామర్రు నియోజకవర్గంలో నిర్వహించి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ పి. రాజాబాబు, పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్, జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, డీఈవో తాహెరాసుల్తానా చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28,661 మంది విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. కృష్ణా జిల్లాలో 11,623, ఎన్టీఆర్ జిల్లాలో 12,832, ఏలూరు జిల్లాలో 4,206 మంది విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేసేలా జిల్లా పరిషత్, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం, ఉత్తీర్ణతే ధ్యేయం

నిష్ణాతులైన ఉపాధ్యాయులతో స్ఫూర్తి స్టడీమెటీరియల్‌ను రూపొందించారు. విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఒక్కొక్క సబ్జెక్టుకు సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఐదుగురు ఉపాధ్యాయులతో రూపొందించటం జరిగింది. విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ఏ, బీ, సీ, డీ కేటగిరీల వారీగా విభజించి వారికి ఉత్తమమైన మార్కులు వచ్చేలా ఈ స్టడీ మెటీరియల్‌ను రూపొందించారు. దీంతో పాటుగా ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయులు దత్తత తీసుకుని ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాబోధన చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల్లో నైపుణ్యత, ఉత్తమ మార్కులు సాధించే దిశగా ఈ నెల 30వ తేదీ నుంచి రివిజన్ టెస్ట్‌లు కూడా నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ఉపాధ్యాయులు పునరంకితం కావాలి



పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు మంచి పేరు తెచ్చేలా ఉపాధ్యాయులు పునరంకితం కావాలి. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంగా తాము స్టడీ మెటీరియల్‌ను అందజేయటం జరిగింది. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖాధికారులు ఉత్తమమైన ఉపాధ్యాయులతో దీనిని రూపొందించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలి.

ఉప్పాల హారిక, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

మంచి ఫలితాలు సాధించేలా చర్యలు



పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందేలా ఉపాధ్యాయులు చాలెంజ్‌గా తీసుకోవాలి. వెనుకబడిన విద్యార్థి ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నాడో గుర్తించి ఆ దిశగా విద్యా బోధనలు చేసి మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా పరిషత్ పాలకవర్గం విద్యార్థులకు అందజేసిన స్ఫూర్తి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

తాహెరాసుల్తానా, జిల్లా విద్యాశాఖాధికారి

బాలికలను రక్షించిన పోలీసులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్నేహితురాలిని కలవాలని ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలికలను గవర్నర్‌పేట పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు బాలికలు తమ స్నేహితురాలిని కలిసేందుకు శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వచ్చారు. వారిలో ఒకరి నాయనమ్మ బయట ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించడంతో అక్కడ నుంచి రైలు ఎక్కి విజయవాడ చేరుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున కంట్రోల్ రూం సమీపంలోని గ్లోబల్ హాస్పిటల్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గస్తీలో ఉన్న పోలీసులు గమనించి ప్రశ్నించారు. వారి వివరాలు తెలుసుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సీఐ నాగమురళీ పర్యవేక్షణలో వారిని కృష్ణలంకలోని ప్రజ్వల హోంలో ఉంచి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అప్పటికే బాలికల తల్లిదండ్రులు రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్‌లో తమ పిల్లలు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. గవర్నర్‌పేట పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు బాలికలు తల్లిదండ్రులు విజయవాడకు చేరుకున్నారు. ప్రజ్వల హోం సంరక్షణలో ఉన్న బాలికలను పోలీసులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



పాయకాపురం(విజయవాడరూరల్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, మెడికల్ కమ్ ఫ్యాన్సీ స్టోర్ అగ్నికి ఆహుతైన ఘటన ఆదివారం తెల్లవారుజామున ప్రకాష్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ ఎస్.గణేష్ తెలిపారు. ప్రకాష్‌నగర్‌లో వరికల్ల శ్రీనివాస్, మరో పోర్షన్‌లో పెరికోటి యోగినాథ్ అద్దెకు ఉంటున్నారు. ఆ ఇంటి యజమాని ఎస్ఎల్ఆర్‌పీ శర్మకు చెందిన మెడికల్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు అగ్ని మాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదం సమాచారం తెలిసిన వెంటనే విద్యుత్‌శాఖ సిబ్బంది కరెంటు సరఫరా నిలుపుదల చేశారు. మంటలు ఎగిసిపడుతున్న సందర్భంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి అదుపుచేశారు.

రూ.రెండు లక్షల విరాళం

తాడేపల్లిరూరల్: కె.కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి విజయవాడకు చెందిన వి.సుబ్బారెడ్డి, సుబ్బలక్ష్మి దంపతులు రూ.2 లక్షలు విరాళం అందజేశారు.



దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవ మూర్తికి పూజలు



మాస్కులు ధరించి అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు

- తెలంగాణ, కర్ణాటక నుంచి భారీగా భక్తులు రాక
- రూ.500 టికెట్ దర్శనానికి గంటన్నర సమయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వరుస సెలవుల నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. తెలంగాణ, కర్ణాటక నుంచి భారీగా భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి తోడు ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల తాకిడి కనిపించింది. ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంతో పాటు పలు సేవల్లో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆయా సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండున్నర గంటల సమయం పడితే, రూ. 500 టికెట్ క్యూలైన్‌లో గంటన్నర సమయం పట్టింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులతో అన్ని క్యూలైన్లు కిటకిటలాడాయి. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు.

భార్యను హతమార్చి.. భర్త ఆత్మహత్య

- కుటుంబ కలహాలతో భార్యపై దాడిచేసిన భర్త
- ఆపై కలుపు మందుతాగి ఆస్పత్రిలో మృతి
- ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో మృతి చెందిన వివాహిత
- తల్లిదండ్రుల మృతితో అనాథగా మారిన నాలుగేళ్ల చిన్నారి



చికిత్స పొందుతూ మృతి చెందిన సూర్యనారాయణ



హత్యకు గురైన రామలక్ష్మి మృతదేహం

గుడివాడరూరల్: భార్యాభర్తల మధ్య విభేదాలు నాలుగేళ్ల చిన్నారిని అనాథను చేశాయి. కోపంతో భార్యను కత్తితో పొడిన ఓ భర్త ఆపై పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. తీవ్రంగా గాయపడిన భార్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త కూడా మృతి చెందాడు. ఈ ఘటన గుడివాడ ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. తాతపూడి రామలక్ష్మికి (26) ఐదేళ్ల క్రితం భీమవరం జిల్లా గణపవరం మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన తాతపూడి సూర్యనారాయణతో (33) వివాహమైంది. వారికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. అనుమానంతో రోజూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్తపై రామలక్ష్మి పోలీసు కేసు పెట్టింది. ఈ క్రమంలో నాలుగు నెలల నుంచి ఆమె గుడివాడలోని పుట్టింట్లో తల్లిదండ్రులతో కలసి ఉంటోంది. భార్యాభర్తల మధ్య నెలకొన్న కలహాలపై పెద్ద సమక్షంలో మాట్లాడుకుందామని రామలక్ష్మి కుటుంబ సభ్యులు సూర్యనారాయణను ఆదివారం గుడివాడకు పిలిపించారు. వచ్చీరావడంతోనే ఇంట్లో ఉన్న భార్య రామలక్ష్మిపై తనతో తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా పొడిచాడు. అడ్డుకోబోయిన ఆమె తండ్రి వెంకన్నపైనా కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రామలక్ష్మిని స్థానికులు 108లో గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. రామలక్ష్మి తండ్రి వెంకన్న తీవ్ర గాయాలకు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ పి.శ్రీకాంత్, వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్ తన సిబ్బందితో కలసి పరిశీలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలుపు మందుతాగి సూర్యనారాయణ మృతి...

భార్యను కత్తితో పొడిచిన అనంతరం సూర్యనారాయణ కలుపు మందుతాగి పడిపోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అంబులెన్స్‌లో గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సూర్యనారాయణ మృతి చెందాడు. తల్లిదండ్రుల మృతితో నాలుగేళ్ల చిన్నారి అనాథగా మిగిలాడు. రామలక్ష్మి హత్యతో ఎన్టీఆర్‌కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. రామలక్ష్మి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

క్లుప్తంగా

నగర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ అంటే సేవ, శాంతి, సంతోషమని ఏసుక్రీస్తు క్షమా, ప్రేమ, శాంతి, కరుణ భావం కలిగిన వారు అని, ఏసు తన జీవితం ద్వారా మంచి మార్గంలో ఎలా నడవాలో చూపించారని పేర్కొన్నారు. ప్రజలందరూ క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ప్రజలందరూ వారి కుటుంబ సభ్యులు ప్రేమానురాగాలతో సంతోషాలను అందరికీ పంచాలని కోరారు.

నేటి 'స్పందన' రద్దు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా నిలిచే స్పందన కార్యక్రమం సోమవారం రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం క్రిస్మస్ సెలవు కారణంగా రద్దు చేస్తున్నామన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో జరిగే స్పందన కూడా రద్దు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా రామకృష్ణాపురం శ్రీదుర్గాదేవి దేవాలయంలో వెంకటేశ్వరస్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. లక్ష్మీనారాయణులకు ప్రీతికరమైన ధనుర్మాసం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు, భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త రాజు పర్యవేక్షించారు

ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తండ్రి మందలించాడని ఇంజినీరింగ్ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లపూడి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు .. గొల్లపూడి సాయిపురం కాలనీకి చెందిన అల్లం పాపారావు మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి కళాశాలలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మొదటి సంవత్సరానికి సంబంధించి కొన్ని సబ్జెక్టులు మిగిలిపోయాయి. ఎందుకు మిగిలిపోయాయని తండ్రి మందలించాడు. దీంతో అవమానంగా భావించిన పాపారావు ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తాను వెళ్లిపోతున్నానని, తన కోసం వెతక వద్దని లేఖ రాసి పెట్టి వెళ్లాడు. తల్లిదండ్రులు అతనికి ఫోన్ చేయగా స్విచ్ఆఫ్ వచ్చింది. స్నేహితులు, చుట్టుపక్కల వారిని విచారించిన ఆచూకీ తెలియలేదు. దీంతో పాపారావు తండ్రి అల్లం ఆంజనేయులు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


పాయకాపురం(విజయవాడరూరల్): సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా సూచించారు. ఆదివారం శాంతి నగర్‌లో ఫర్జానా మెడికల్ షాపు వద్ద 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ అధ్యక్షతన ముస్లిం మైనార్టీ మహిళల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగుల్ మీరా మాట్లాడుతూ మహిళల సమస్యలపై రాష్ట్ర కమిటీ నిత్యం పనిచేస్తుందని చెప్పారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేందుకు కుట్టుమిషన్లు, బండ్లు అందచేసి అండగా ఉంటామని పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గం అధ్యక్షురాలిగా షేక్ రజియా, 57వ డివిజన్ మహిళా అధ్యక్షురాలిగా షేక్ హసీనా, ఉపాధ్యక్షురాలిగా షేక్ నన్ని, ప్రధాన కార్యదర్శిగా షేక్ మల్లికబేగం, కోశాధికారిగా షేక్ ఆలియా, 60వ డివిజన్ అధ్యక్షురాలిగా షేక్ అమీనా, ప్రధానకార్యదర్శిగా షర్మిల ఎన్నికయ్యారు. వారికి నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాఫీజ్, షస్తక్ సాజిద్ అలీ, రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

పెనమలూరు: ఇటీవల హర్యానాలో జరిగిన సీబీఎస్‌సీ సౌత్‌జోన్ జాతీయ స్థాయి పోటీలో ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో కానూరు స్కాట్ స్ప్రైస్ విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారు. అండర్–14 బాలికల విభాగంలో విద్యార్థినులు ఎ.శ్రీజ, ఎ.జేతశ్రీ, ఎం.ఇషిత సింధులు ప్రతిభ చాటి బంగారు పతకాలు గెలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచినేని శాంతి, సీఈఓ జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ విద్యార్థులను అభినందించారు.

క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రం వన్‌టౌన్

- శతాబ్ద కాలంగా అలరారుతున్న చర్చిలు
- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు



సెయింట్ పాల్స్ బసిలికా చర్చి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రంగా అలరారుతోంది. నగరంలోని పశ్చిమ నియోజకవర్గం పురాతన క్రైస్తవ ప్రార్థనా మందిరాలకు నిలయంగా ఉంది. వన్‌టౌన్‌లో పలు చర్చిలకు వందేళ్లు పూర్తయ్యాయి. మరికొన్ని చర్చిలు ప్లాటినం జూబ్లీ వేడుకలను పూర్తి చేసుకున్నాయి. నగరంలో బ్రిటీష్ పాలకుల ఆధ్వర్యంలో జరిగిన రైల్వే వంతెన, కృష్ణానది ఆనకట్ట తదితర నిర్మాణాలకు వందలాది మంది ఆంగ్లో ఇండియన్స్ బెజవాడకు వచ్చారు. అలాగే 19వ శతాబ్దంలో బ్రిటీష్ పాలకుల ఆదేశానుసారం నగరానికి వచ్చిన సైనికులు స్థానికంగా స్థావరాన్ని ఏర్పాటు చేసుకొని జీవించే వారు. వారంతా తమ కోసం నగరంలోని వన్‌టౌన్ కేంద్రంగా పలు క్రైస్తవ ప్రార్థనా మందిరాలను ఏర్పాటు చేసుకున్నారు. కాలక్రమంలో ఆ ప్రార్థనా మందిరాలు శాఖోపశాఖలుగా అభివృద్ధి చెంది నగరానికి వెన్నె తెస్తున్నాయి. ఒక చర్చి నుంచి కొంత మంది విడిపోయి మరో ప్రార్థనా మందిరాన్ని ఏర్పాటు చేయడం లేదా, పెరిగిన భక్తుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో చర్చిలను ఏర్పాటు చేయడం వంటి కారణాలతో నగరంలో పలు చోట్ల విశాలమైన, అపురూపమైన క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఆయా ప్రార్థనా మందిరాలు ప్రతి రోజూ ప్రజలకు శాంతి సందేశాన్ని అందజేస్తున్నాయి.

ప్రముఖ చర్చిలు

వన్‌టౌన్ తారాపేటలో ఆర్సీఎం ఆధ్వర్యంలో సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చి కొనసాగుతుంది. ఈ చర్చికి 1884వ సంవత్సరం నుంచి ఫాదర్ జే.పయాత్తి బోధకునిగా ఉన్నట్లు అందుబాటులో ఉన్న రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అయితే కొన్నేళ్ల తరువాత ఈ చర్చి పూర్తిస్థాయిలో ప్రార్థనా మందిరంగా అందుబాటులోకి వచ్చింది. అదేవిధంగా దక్షిణ ఇండియా సంఘం(సీఎస్‌ఐ) ఆధ్వర్యంలో గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా 'సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి'ని 1900వ సంవత్సరంలో స్థాపించినట్లు చర్చి ప్రాంగణంలో ఉన్న శిలాఫలకం వివరిస్తుంది. ఈ ప్రార్థనా మందిరంలో ప్రతి ఆదివారం ప్రత్యేక ఆరాధనా కార్యక్రమాలు జరుగుతున్నాయి. అలాగే మరో రాయల్ హోటల్ సెంటర్ వద్ద ఉన్న 'సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి'ను 1906వ సంవత్సరంలో స్థాపించారు. నగరంలో ప్రథమ లూథరన్ చర్చిగా పేర్కొనే 'సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి'ను గాంధీహిల్ వెనుక వైపు ఉన్న పాడివీధిలో 1935వ సంవత్సరంలో స్థాపించినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. అంతేకాకుండా నగరంలో మొదటి ఎయిర్ కండిషన్ చర్చి కూడా ఇదే కావడం విశేషం. అదేవిధంగా ఫైజర్‌పేటలోని 'తెలుగు బాప్టిస్ట్ చర్చి'ను 1935లో స్థాపించారు. పెజ్జోనిపేటలోని ఆర్సీఎం చర్చిని స్థాపించి అర్ధ శతాబ్దం దాటింది. ఈ చర్చిలన్నీ ప్రారంభంలో చిన్నచిన్నవిగా ఏర్పడి కాలక్రమంలో విశాలమైన ప్రాంగణాల్లో ప్రజలందరినీ ఆకర్షించే విధంగా అలరారుతున్నాయి.

సామాజిక సేవా కార్యక్రమాలు

నగరంలోని అన్ని ప్రముఖ చర్చిల ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు పని చేస్తున్నాయి. విద్యాసంస్థలు, వీధి బాలల సంరక్షణ, మహిళలకు శిక్షణ, ప్రాథమిక వైద్యం, వృద్ధాశ్రమం వంటి వివిధ రంగాల్లో సేవలందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నాయి. అంతేకాకుండా చక్కని సేవా కార్యక్రమాలతో మిగిలిన సంస్థలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి.

అనేక సంస్థలకు వన్‌టౌన్ కేంద్రం

జిల్లాలోని వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న పలు చర్చిలకు, క్రైస్తవ సామాజిక సేవా సంస్థలకు వన్‌టౌన్‌లోని చర్చిలు కేంద్రాలుగా ఉన్నాయి. అదేవిధంగా గొల్లపూడి, పెద్దఅవుటపల్లి, పెజ్జోనిపేట వంటి ప్రాంతాల్లో ఉన్న చర్చిలు సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చికి అనుబంధంగా ఏర్పడినవేనని వన్‌టౌన్‌లోని క్రైస్తవ ప్రముఖులు తెలిపారు.

ఒకటో తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు

వన్‌టౌన్‌లోని వివిధ చర్చిల్లో ఈ నెల 20వ తేదీ నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు జనవరి మొదటి తేదీ వరకూ కొనసాగుతాయి. అలాగే క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని ఆయా చర్చిలను అత్యంత సుందరంగా అలంకరించారు. ముఖ్యంగా ఈ చర్చిలకు స్థానిక నివాసితులైన క్రైస్తవులతో పాటుగా నగరం చుట్టపక్కల ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది క్రైస్తవులు వన్‌టౌన్‌లోని చర్చిలకు విచ్చేసి ఆరాధానా కార్యక్రమాల్లో పాల్గొంటారు. కేవలం క్రిస్మస్, గుడ్‌ఫ్రైడ్ వంటి పర్వదినాల్లోనే కాకుండా ప్రతి ఆదివారం ఆయా క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ఆరాధనకు వచ్చిన ప్రజలతో కళకళలాడుతూ ఉంటాయి.



వన్‌టౌన్‌లోని సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి



విద్యుత్ కాంతుల్లో సీఎస్‌ఐ ఆల్ సెయింట్ చర్చి



పటమట చర్చిలో కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు

సంక్షేమ పాలన చేతల్లో చూపిన జగనన్న



రజక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో రజకుల సంక్షేమం, అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతల్లో చూపారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రజకుల కోసం ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి, వారి సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. రజక ఆత్మీయ సమావేశం ఆదివారం పున్నమ్మతోటలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవినేని అవినాష్ రజక సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రాజకీయంగా, సామాజికంగా ఉన్నత స్థాయి కల్పించామని, రూ.కోట్లు వెచ్చించి దోబీఖానాలు అభివృద్ధి చేసి, వృత్తికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు.

ఎల్లప్పుడూ అండగా ఉంటా..

నాడు దేవినేని నెహ్రూకు రజకులు వెన్నంటి ఉండి నడిచారని, నేడు ఆయన తనయుడిగా నన్ను మీరంతా మద్దతు తెలియచేయడం సంతోషంగా ఉందని అవినాష్ తెలిపారు. 19వ డివిజన్ దోబీఖానాలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని, త్వరలో ప్రహరీ కూడా నిర్మిస్తామన్నారు. 22వ డివిజన్‌లోని దోబీఘాట్‌లో అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా మీ మద్దతు ఇలాగే ఉండాలని, మీకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని అవినాష్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రెహానా నాహీద్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉకోటి శేషగిరి, సంఘం పెద్దలు వంశీ, ఏడుకొండలు, పోనుగుపాటి శ్రీనివాస్, శంకర్, మురళీ, గోపాలకృష్ణ, సుబ్బారావు, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో ఆధ్యాత్మికత, సేవలను రెండు కళ్లుగా చేసుకుని పనిచేస్తున్నామని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. మందిరంలో ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యాన నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ దాతలు, భక్తుల సహకారంతో షిరిడీలో మాదిరిగా అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏటా చలికాలంలో దుప్పట్లు పంపిణీ, నగర పాలక సంస్థ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు, నిత్యాన్నదానం, ఉచిత హోమియో, అల్లోపతి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో భక్తుల ఆకాంక్షల మేరకు సేవలు మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

● నగరంలో క్రిస్మస్ సందడి



బీసెంట్ రోడ్డులో కొనుగోలుదారుల రద్దీ


క్రిస్మస్ సందర్భంగా నగరంలోని అన్ని దుకాణాల్లో ఆదివారం రద్దీ నెలకొంది. ప్రధానంగా బీసెంట్ రోడ్డు, లెనిన్ సెంటర్‌లోని దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

- గుణదల పుణ్యక్షేత్రంలో సమష్టి బలిపూజ
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

గుణదల (విజయవాడ తూర్పు): సర్వ మానవాళిని రక్షణ మార్గంలో నడిపించేందుకు లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ఈ లోకానికి అరుదెంచారని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. పుణ్యక్షేత్ర ప్రధానాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక పై సమష్టి దివ్య బలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఫాదర్ జయరాజు మాట్లాడుతూ.. దైవ కుమారుడైన క్రీస్తు లోకానికి వెలుగన్నారు. సర్వమానవాళి పాప పరిహారార్థమై ఆయన మానవ రూపిగా జన్మించడం జరిగిందన్నారు. క్రీస్తు జన్మదిన వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవడం విశేషమన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. బైబిల్ గ్రంథంలోని క్రీస్తు జనన విశేషాలను వివరించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని పశువుల పాకను ఏర్పాటు చేసి బాలఏసు ప్రతిమను ఉంచారు. భక్తులు బాల ఏసును దర్శించుకుని ఆధ్యాత్మికంగా గడిపారు. భక్తుల కోసం ఆలయ గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ దాసి సురేష్, సహాయ గురువులు, మఠకన్యలు పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగులో గుణదల చర్చి

నర్సింగ్ స్కూల్‌లో ఆరోగ్యంపై అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): చేతులు తరచూ శుభ్రం చేసుకోవటంతో పాటు మాస్కులు ధరించాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెల్లవారుజాము, రాత్రిపూట ప్రయాణాలు మానుకోవాలని తెలిపారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ అల్లోపతి వైద్యులు డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలి

పెనమలూరు: కంకిపాడులో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు ప్రాంత నేతలతో ఎమ్మెల్యే పార్థసారథి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు బాగుపడాలంటే వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌ను సీఎంని చేసుకోవాలని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికే సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు చాంద్‌బాషా, సిద్దిక్, వేమూరి బాలకృష్ణ, వల్లభనేని మణికంఠ, పఠాన్‌అహ్మద్, నేరెళ్ల బుజ్జి, సైకం చినబాబు, రవి, మనోజ్ పాల్గొన్నారు.

కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలి

విజయవాడకల్చరల్: కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలని కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు సూచించారు. వాగ్దేవీ కళాపీఠం, విజయవాడ కవన వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. పూర్ణచందు మాట్లాడుతూ కవులు సమాజ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ద్విశతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులు అంశంగా ప్రసంగించారు. వాగ్దేవీ కళాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ గానుగుల యుగంధరా చార్య మాట్లాడుతూ సంస్థ ద్వారా వర్ధమాన కవులకు వేదిక కల్పిస్తున్నట్లు వివరించారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జోస్యపల్లి వేంకటచలపతిరావు వివిధ కవితా ప్రక్రియలు అంశంగా ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. కవులను నిర్వాహకులు సత్కరించారు.



ఫుట్‌పాత్ పనులు త్వరగా పూర్తి చేయాలి



ఫుట్‌పాత్ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్‌మైదాన్‌లో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంజీ రోడ్డు వైపు ఉన్న ఫుట్‌పాత్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వారంలోగా క్వాలిటీలో ఎటువంటి లోపం లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్‌ను ఆదేశించారు. జనవరి 20వ తేదీ నాటికి అన్ని పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటుకు తీసుకురావాలన్నారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయలక్ష్మి, తదితరులు

విజయవాడకల్చరల్: కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. చంద్రమోహన్ కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తి సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రాష్ట్రంలోని కళాకారుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నంది నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరచూరి విజయలక్ష్మి, ప్రభల శ్రీనివాస్, పైడిపాటి వెంకన్న, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులను, అతిథులను ఎమ్మెల్యే విష్ణు ఘనంగా సత్కరించారు.

పేదలకు సహాయం చేయడమే నిజమైన క్రిస్మస్




నిత్యావసర వస్తువులను అందజేస్తున్న పాస్టర్ సజ్జా రత్నకుమార్

ఆటోనగర్(విజయవాడతూర్పు): పేదలకు సేవ చేయడంలో ఉండే ఆనందం మరి ఎందులో ఉండదని, క్రిస్మస్ అంటే వేరొకరికి సహాయం చేయడం అని మెస్సీయ ఫెలోషిప్‌చర్చి పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ అన్నారు. ఆదివారం రాత్రి చర్చి ఆవరణలో క్రిస్మస్ పండుగ సందర్భంగా 70 మంది పేదలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. మరో 50 మంది వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా క్రిస్మస్ పండుగ రోజున పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. అంతే కాకుండా నెల నెలా వృద్ధులకు ఆర్థిక సహాయం కూడా చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం యూత్ సెమీక్రిస్మస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సజ్జా జ్యోతి, క్రైస్తవులు పాల్గొన్నారు.

విజయవాడకు సమీపంలోని పెనమలూరుకు చెందిన ఆటోడ్రైవర్ వెంకట్ (38)కు ఇటీవల ఆకస్మికంగా కాలు, చేయి చచ్చుబడిపోయాయి. విజయవాడలోని యనమలకుదురుకు చెందిన నగర పాలక సంస్థ డ్రెయినేజీ విభాగ ఉద్యోగి రాజేష్ (42) విధుల్లో ఉండగా.. చేయి చచ్చుబడింది. క్షణాల్లోనే గుర్తించిన స్థానికులు వెంకట్, రాజేష్‌లను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తక్షణమే సీటీ స్కాన్ చేసిన వైద్యులు వారు బ్రెయిన్ స్ట్రోక్ బారినపడినట్టు గుర్తించారు. వెంటనే త్రోంబొలైసిస్ ఇంజెక్షన్స్ ఇచ్చారు. వైకల్యం రాకుండా ఇద్దరినీ కాపాడగలిగారు. సాధారణంగా 55-60 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) సంభవించేది. ఇటీవల కాలంలో 45 ఏళ్లలోపు వారిలో ఈ కేసులు అధికమవుతున్నాయి.

యంగ్ స్ట్రోక్



- 30-45 ఏళ్లలోపు వారిలో పెరుగుతున్న బ్రెయిన్ స్ట్రోక్ కేసులు
- మహిళల్లో హార్మోన్ల ఇబ్బందులతో స్ట్రోక్
- వంశపారంపర్యం, జీవనశైలే కారణమంటున్న వైద్యులు
- స్మోకింగ్, డ్రగ్స్ కూడా స్ట్రోక్‌కు దారి తీస్తున్నాయని వెల్లడి





విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో న్యూరాలజీ ఐసీయూ

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఇటీవల కాలంలో స్ట్రోకింగ్ యంగ్ (45 ఏళ్లలోపు వారిలో బ్రెయిన్ స్ట్రోక్) కేసులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిపై వైద్యులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వస్తున్న వారిలో స్ట్రోకింగ్ యంగ్ కేసులు ఎక్కువగా ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. కదలిక లేని జీవన విధానం.. తీవ్రమైన ఒత్తిళ్లు.. రక్తం, రక్తనాళాల్లో లోపాలు.. ధూమపానం.. హెరాయిన్ లాంటి మత్తు పదార్థాల వినియోగం.. వంశపారంపర్య కారణాలు 30 ఏళ్లకే బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతున్నాయి.


25% 'స్ట్రోకింగ్ యంగ్' కేసులే

ఒకప్పుడు వయస్సు 55, 60 ఏళ్ల వారు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యేవారు. కానీ.. ప్రస్తుతం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్న వారిలో 25 నుంచి 30 శాతం మంది 30–45 ఏళ్లలోపు యువతే ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వాస్పత్రిలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు బ్రెయిన్ స్ట్రోక్‌తో వస్తున్నారు. స్ట్రోక్ తీవ్రతను బట్టి జనరల్ మెడిసిన్, ఏఎంసీ, న్యూరాలజీ విభాగాల్లో చికిత్స అందిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో వస్తున్న వారిలో రక్తంలో గడ్డలు ఏర్పడి మెదడుకు సరిగా రక్తప్రసరణ జరగకపోవడం వలన వచ్చే స్ట్రోక్ (ఇస్కిమిక్) 80 శాతం మంది, రక్తనాళాలు చిట్లిపోయి (హెమరైజ్) 20 శాతం మంది ఉంటున్నారు.

గోల్డెన్ అవర్‌లో గుర్తించడం ముఖ్యం

ఇప్పుడు బ్రెయిన్ స్ట్రోక్‌కు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. లక్షణాలను గుర్తించి.. నాలుగు గంటల్లోపు ఆస్పత్రికి చేరుకుంటే స్ట్రోక్ కారణంగా వైకల్యం బారినపడకుంటా వైద్యులు కాపాడగలుగుతున్నారు. ఇస్కిమిక్ స్ట్రోక్ వచ్చిన వారికి త్రోంబొలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా రక్తంలోని పూడికలు కరిగేలా చేస్తున్నారు. ముఖం, చేయి, కాలు ముఖ్యంగా శరీరం ఒకవైపున ఆకస్మిక తిమ్మిరి, బలహీనత ఏర్పడటం, ఆకస్మికంగా గందరగోళం ఏర్పడటం, మాట్లాడటం, అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, కంటిచూపు మందగించడం, తల తిరగడం, బ్యాలెన్స్ తప్పడం, ఆకస్మికంగా తీవ్రమైన తల నొప్పి వంటివి బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలుగా వైద్యులు చెబుతున్నారు.

యువకుల్లోనూ కేసులు



ఇటీవల 45 ఏళ్లలోపు యువత బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతోంది. స్ట్రోక్ కేసుల్లో 25% యువతే ఉండటం గమనార్హం. బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడినవారు 4 గంటల్లోపు ఆస్పత్రికి చేరుకుంటే వైకల్యం లేకుండా కాపాడవచ్చు.

– డాక్టర్ దారా వెంకట రమణ, న్యూరాలజిస్ట్, జీజీహెచ్

స్ట్రోక్‌కు కారణాలివీ

పెద్ద వయసుల వారిలో రక్తపోటు, మధుమేహం స్ట్రోక్‌కు కారణమవుతోంది. అయితే.. 45 ఏళ్ల లోపు వారిలో హోమోసిస్టీన్, సికిల్ సెల్ అనీమియా, రక్తంలో జన్యుపరమైన లోపాలు, హెరాయిన్ వంటి డ్రగ్స్ వినియోగం, మితిమీరిన మద్యపానం, ధూమపానం, ప్రమాదాల్లో తలకు గాయాలైన వారిలో ఎక్కువగా స్ట్రోక్ వస్తున్నట్టు వైద్యులు చెపుతున్నారు. వీరితో పాటు కదలిక లేని జీవన విధానం కారణంగా కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి స్ట్రోక్‌కు గురవుతున్న కేసులూ ఉంటున్నాయి. మహిళల్లో హార్మోన్స్ ఇబ్బందులు, రక్తనాళాల్లో లోపాల కారణంగా స్ట్రోక్ రావచ్చంటున్నారు. గుండె లోపాలు ఉన్న వారిలోనూ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువ.



ఆలయం ఏదైనా మీ ఇంట్లోనే టికెట్

- రాష్ట్రంలోని 8 ఆలయాల్లో దైవ దర్శనం, పూజ టికెట్లతోపాటు గదుల బుకింగ్ ఆన్‌లైన్
- 30 నుంచి 90 రోజుల ముందే బుక్ చేసుకునే సౌకర్యం
- 2022 జూలై నుంచి ఇప్పటివరకు ఆన్‌లైన్ సేవలను వినియోగించుకున్న 10.20 లక్షల మంది భక్తులు
- 2,98,720 మంది ఆన్‌లైన్ పూజా టికెట్లు పొంది ప్రశాంతంగా దైవ దర్శనం



సాక్షి, అమరావతి: ఏడాదిన్నర క్రితం దేవదాయ శాఖ పరిధిలోని 8 ప్రధాన ఆలయాల్లో ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఆన్‌లైన్ సేవలు సూపర్ సక్సెస్ అయ్యాయి. 8 ఆలయాల్లో ఏడాదిన్నర కాలంలో 10 లక్షల మందికి పైగా భక్తులు ఆన్‌లైన్ సేవల్ని వినియోగించుకున్నారు. భక్తుల రద్దీ బాగా ఎక్కువగా ఉండే రోజుల్లో సైతం భక్తులు 30 నుంచి 90 రోజుల ముందుగానే దర్శన టిక్కెట్లు, పూజలు, ఇతర సేవ టికెట్లతో పాటు ఆలయాల్లో అద్దె గదుల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. తద్వారా దైవ దర్శనాలకు వెళ్లిన రోజు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ఇష్టదైవాలను కొలిచారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 మార్చి 3న మొదటిసారి శ్రీశైలం ఆలయంలో ఆన్‌లైన్ సేవలను ప్రాథమికంగా ప్రారంభించారు. ఆ తర్వాత 2022 జూలై 21వ తేదీ నుంచి ప్రధాన ఆలయాలైన సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ దుర్గగుడి, పెనుగంచిప్రోలు, కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాల్లో అన్ని రకాల సేవలను పూర్తిస్థాయి ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దశలవారీగా పెద్ద ఆలయాలన్నింటిలోనూ ఈ రకమైన ఆన్‌లైన్ సేవలను విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కాగా, ఈ సేవలు ప్రారంభించిన 2022 జూలై 21 నుంచి ఈ ఏడాది డిసెంబర్ 23 తేదీ వరకు 10,20,943 మంది భక్తులు వినియోగించుకున్నట్టు దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు. కొన్ని ఆలయాలు కొన్ని రకాల సేవలను గరిష్టంగా 30 రోజుల ముందుగా మాత్రమే ఆన్‌లైన్ అందుబాటులో ఉంచుతుండగా.. ఆలయాలు, అక్కడి సేవల ఆధారంగా గరిష్టంగా 90 రోజుల ముందుగా కూడా ఈ సేవలు పొందే వీలు కల్పించినట్టు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ఆలయాలకు వెళ్లే భక్తులు భక్తి పారవశ్యంతో దైవ దర్శనం పూర్తి చేసుకునేలా ప్రభుత్వపరంగా అన్ని చర్యలు చేపడుతున్నాం. ఆలయాల పైరవీలు, అక్రమాలకు తావు లేకుండా సేవ, దర్శన టికెట్లు ముందుగా కూడా భక్తులు ఆన్‌లైన్ ద్వారా పొందేలా ఏర్పాటు చేశాం. ఆలయాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి ప్రభుత్వ ఖజానా నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దుర్గగుడికి నిధులు కేటాయించారు. కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి పురాతన ఆలయాల పునఃనిర్మాణంతో పాటు కొత్త ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.

– కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ)

అత్యంత సులభ విధానంలో బుకింగ్

ఆలయాల్లో పూజలు, సేవలు, దర్శన టికెట్లు భక్తులు సులభంగా ముందస్తుగానే బుక్ చేసుకోవడానికి వీలుగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ప్రభుత్వం పూర్తిగా ఆధునికీకరించింది. ఏ ఆలయానికి ఆ ఆలయం కాకుండా అన్ని ఆలయాలకు సంబంధించి ఈ రకమైన సేవలను ఒకేచోట నుంచి భక్తులు పొందేలా వెబ్‌సైట్‌ను రూపొందించారు. భక్తులు తమ ఫోన్ నంబర్ ఉపయోగించి ఈ సేవలు పొందేలా చర్యలు తీసుకున్నారు.

సేవ	సేవలు పొందిన వారి సంఖ్య	లభించిన ఆదాయం (రూపాయల్లో)
దర్శన టికెట్లు	6,55,782	36,87,15,337
పూజ/సేవా టికెట్లు	2,98,780	50,93,00,317
అద్దె గదులు	66,381	9,90,37,601
మొత్తం	10,20,943	97,70,53,255

కురబలకు జగనన్న అండ

- కుప్పంలో కురబలను బాబు పట్టించుకోలేదు
- అన్ని కులాలకు జగన్‌మోహన్‌రెడ్డితోనే గుర్తింపు
- కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీలు



కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్సీ

కుప్పంరూరల్(చిత్తూరు జిల్లా): కుప్పం నియోజకవర్గ ఓటర్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్న కురబలను చంద్రబాబు అసలు పట్టించుకోలేదని, వారికి గుర్తింపు తెచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. కనకదాస జయంతిని పురస్కరించుకుని ఆదివారం కుప్పం ఏరియా ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన కనకదాస విగ్రహావిష్కరణ, కురబ కులస్తుల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు 35 ఏళ్లు ఎమ్మెల్యే, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా కుప్పం నియోజకవర్గంలో అధికంగా ఉన్న కురబలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, వారి సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కులాలతో పాటు కురబలకూ సముచిత స్థానం కల్పించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కురబలు ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులుగా పనిచేస్తున్నారన్నారు. తనను గెలిపించిన కుప్పం ప్రజల కోసం చంద్రబాబు శాశ్వత తాగు, సాగు నీటి సదుపాయం కల్పించలేకపోయారని విమర్శించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి కుప్పానికి కృష్ణా జలాలను తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఇన్ని చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి రుణం ఒక ఓటుతో తీర్చుకోవాలని కోరారు. ముస్లింల కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 4 శాతం రిజర్వేషన్ తీసుకువచ్చారని, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ తమకు అన్ని విధాలా సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే కురబ కులస్తులంతా ఉంటామని ప్రకటించారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ కుప్పంలో కురబ కులస్తుల కోరిక మేరకు కనకదాస జయంతి రోజున కనకదాస మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఇటీవల గుండె పోటులో మృతి చెందిన గుడుపల్లె మండలం, సోడిగానిపల్లి సర్పంచ్ గోవిందు కుటుంబాన్ని మంత్రి పెద్దిరెడ్డితోపాటు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా కల్పించారు.

జిల్లా వార్తలు

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

రేపు గుంటూరులో 'ఆడుదాం – ఆంధ్రా' పోటీలను ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మైదానంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి విడదల రజిని, శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి, మాజీ ఎమ్మెల్సీ డొక్కా తదితరులు

నెహ్రూ నగర్: ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరులో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాట్లను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, ఎమ్మెల్యే ముస్తఫా, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఒక వైపు ప్రజల ఆరోగ్యంతోపాటు, ప్రతిభను గుర్తించటానికి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రభుత్వమే పూర్తి ఖర్చు భరిస్తూ 2024 ఫిబ్రవరి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటికే ఆడుదాం ఆంధ్రా క్రీడలకు 1,25,000 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి స్థిరమైన స్థానం ఉందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే పట్టం కట్టబోతున్నారని పేర్కొన్నారు. రాజకీయపార్టీలన్నీ కలసి వచ్చి పోరాటం చేసినా వైఎస్ జగన్‌ను ఓడించే సత్తా లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి క్రీడలను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం అన్ని గ్రామ, వార్డు స్థాయిలో పోటీలను ప్రారంభించటం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో క్రికెట్ విజేతలకు రూ.5లక్షల బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర నాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్లు బాల వజ్ర బాబు, సజీల, డీసీసీబీ చైర్మన్ ఆర్.సీతా రామాంజనేయులు, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ సాంబశివ రావు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా...

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం 9.55 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి తాడేపల్లి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.

- అక్కడి నుంచి 10.05 బయలుదేరి నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు 10–20కు చేరుకుంటారు. అక్కడ 10 నిమిషాలు ప్రజా ప్రతినిధులతో మాట్లాడతారు.
- అక్కడి నుంచి బయలుదేరి 10.35కు లయోలా పబ్లిక్ స్కూల్‌కు చేరుకుంటారు. అక్కడ ట్రోఫీలను, సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. శాప్(స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) జెండా, జాతీయ జెండా ఎగురవేస్తారు.
- 10.50 నుంచి 11.10 వరకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన సందేశం ఇస్తారు. దీంతోపాటు క్రీడా పరికరాలను బహూకరించనున్నారు.
- 11.25 నుంచి 11.50 వరకు ఖోఖో, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడాకారులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు.
- 11–55కు నల్లపాడు పాలిటెక్నిక్ హెలిప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి 12–15 తాడేపల్లి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12–25 నిమిషాలకు ముఖ్యమంత్రి నివాసానికి చేరుకోవడంతో పర్యటన ముగుస్తుంది.

అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి యాక్షన్ ప్లాన్

బీఐటీసీ వైస్‌చైర్మన్ వినయ్‌సాగర్



కృష్ణానదిలో బోట్ రైడింగ్ చేస్తున్న వినయ్‌సాగర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణానదిలో సహజసిద్ధంగా ఏర్పడి దేశంలోనే ప్రసిద్ధిగాంచిన భవానీద్వీపానికి పూర్వవైభవం తీసుకువచ్చి, పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) వైస్ చైర్మన్ గుర్రంకొండ వినయ్‌సాగర్ ఆదివారం 'సాక్షి'కి తెలిపారు. ప్రభుత్వ సహకారంతో భవానీ ద్వీపాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.భవానీ ఐలాండ్‌లో అడ్వెంచర్ టూరిజానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. ఏపీ పర్యాటకశాఖకు పెద్ద అసెట్‌గా ఉన్న భవానీ ద్వీపాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి వివిధ రాష్ట్రాలకు సలహాదారుగా చేయూతనిచ్చిన అనుభవంతో రాష్ట్రంలో అడ్వెంచర్ టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమర్పించినట్లు చెప్పారు. యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వాటర్ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్, వైఎస్సార్ అడ్వంచర్ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్, అడ్వెంచర్ స్పోర్ట్స్ ప్రొడక్ట్స్ మేన్యుఫ్యాక్చరింగ్ హబ్, సేఫ్టీ మానిటరింగ్ గ్రిడ్, అడ్వంచర్ ప్రొడక్ట్స్ ప్రొటో టైపింగ్ ల్యాబ్, మాస్టర్స్ ఇన్ ఇండస్ట్రియల్ మేన్యుఫ్యాక్చరింగ్ (అడ్వంచర్ ప్రొడక్ట్స్) వంటి అనేక ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు చెప్పారు. తాను తయారుచేసిన ప్రతిపాదనలు ఇచ్చిన ఆరునెలల తరువాత కేంద్ర ప్రభుత్వం కూడా అదే ప్రతిపాదనలకు సమానంగా 'నేషనల్ స్ట్రాటజీ ఫర్ అడ్వెంచర్ టూరిజం' అనే గైడ్‌లైన్స్‌ను విడుదల చేయడం విశేషమన్నారు. అందులోభాగంగా మనరాష్ట్రం ఒక నోడల్ ఏజెన్సీని తయారు చేసుకుంటే కేంద్రం నిధులు విడుదల చేస్తామని ప్రకటించడం గమనార్హమన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన బాధ్యత మేరకు అడ్వెంచర్ టూరిజం మార్కెటింగ్ అండ్ బ్రాండింగ్‌పై తనకున్న పట్టు, అనుభవం, శ్రద్ధతో భవానీ ఐలాండ్ కార్పొరేషన్‌ను లాభాల బాటలో పయనింపచేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. రానున్న నాలుగైదు ఏళ్లలో ప్రపంచంలో అడ్వెంచర్ టూరిజం రెండు వందల లక్షల కోట్ల మార్కెట్‌కు చేరుకుంటుందని మార్కెట్ రీసెర్చ్ సర్వేలు చెబుతున్నాయన్నారు. దేశంలో సరైన సేఫ్టీ రెగ్యులేషన్లు, అవగాహన, ప్రత్యేక శ్రద్ధ లేనందున ఆ మార్కెట్‌ను క్యాష్ చేసుకోలేకపోతున్నామని తెలిపారు. తన ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకువచ్చి అడ్వెంచర్ టూరిజం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని వినయ్ సాగర్ వివరించారు.

వెంకటపాలెం టీటీడీ ఆలయంలో వైభవంగా ప్రాకారోత్సవం



స్వామివారి పల్లకి సేవలో డొక్కా మాణిక్య వరప్రసాద్, భక్తులు

వెంకటపాలెం(తాడికొండ): తుళ్ళూరు మండలం వెంకటపాలెం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామి వారికి ఆదివారం ప్రాకోరోత్సవం వైభవంగా నిర్వహించారు. వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఆలయంలో తిరుచ్చి వాహనంపై వేంచేసిన స్వామి వారిని ఆలయ మాఢ వీధుల్లో పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొని స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్నారు. ఆలయ డిప్యూటీ ఈవో వెంకటయ్య మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయానికి 25 వేల మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారని చెప్పారు. ఆలయ నిర్మాణం జరిగిన తరువాత తొలిసారి స్వామి వారు తిరుమాడ వీధుల్లో తిరుచ్చి వాహనంపై వేంచేసి భక్తులకు దర్శనం కల్పించారని తెలిపారు.

రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

తెనాలి: గుంటూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 9వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలురు, బాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభసభలో ముఖ్య అతిథి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో భాగం కావాలని చెప్పారు. విద్యార్థి దశలోనే ఆసక్తి కలిగిన ఏదొక క్రీడలో సాధన చేయడం అలవరచుకోవాలని సూచించారు. మనిషి పరిపూర్ణ వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రంలో క్రీడల వ్యాప్తికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా తెనాలిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో హ్యాండ్‌బాల్ అకాడమీని నిర్వహిస్తున్నట్టు గుర్తుచేశారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. తొలుత ఎమ్మెల్యే శివకుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వార్డు కౌన్సిలరు మట్లపూడి సంధ్యారాణి, డబుల్‌హార్స్ సంస్థ మేనేజరు కృష్ణప్రసాద్, పి.సత్యనారాయణరాజు, డీఎస్‌డీవో జి.వెంకటేశ్వరరావు, కోచ్ నాగరాజు, సునీల్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని తండ్రీకొడుకుల మృతి



సుబ్రహ్మణ్యేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): టిప్పర్ ఢీకొని తండ్రీకొడుకులు మృతి చెందిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు మండలం కానూరుకు చెందిన కాలేపు సుబ్రహ్మణ్యేశ్వరరావు(43) ఫొటో డిజైనర్‌గా పనిచేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అత్తయ్యను చూసేందుకు ఆదివారం సాయంత్రం 6.45 గంటలకు భార్య శ్యామల, కుమారుడు జయంత్ (6)తో కలిసి ద్విచక్రవాహనంపై కానూరు నుంచి అజిత్‌సింగ్‌నగర్‌కు బయలుదేరారు. రామవరప్పాడు ఫ్లై ఓవర్ రింగ్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డులో నున్న వైపు వెళ్తుంగా రెండో ఫ్లై ఓవర్ దాటిన తరువాత వేగంగా వచ్చిన టిప్పర్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుబ్రహ్మణ్యేశ్వరరావు అక్కడిక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జయంత్‌ను హుటాహుటిన 108లో ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించి జయంత్ ఆస్పత్రిలో మృతి చెందాడు. భర్త, కుమారుడు మృతి చెందడంతో శ్యామల కన్నీరుమున్నీరుగా విలపించారు. గుణదల సీఐ పి.కృష్ణమోషన్, ఎస్ఐలు సత్య శ్రీనివాస్, వెంకట్రావుతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్యామల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకృష్ణదేవరాయలు శాసనాన్ని పరిరక్షించాలి



శాసనాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొప్పునూరు అటవీ ప్రాంతం గుండాల శిథిలాలయం దగ్గర భూమిలో కూరుకుపోయి ఉన్న క్రీ.శ.1516నాటి తెలుగు శాసనాన్ని ప్రభుత్వం పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ) సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. చారిత్రక సంపదను పరిరక్షించుకుని భవిష్యత్ తరాలకు అందించడానికి తమ సెంటర్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆదివారం మాచర్ల పరిసర ప్రాంతాల్లో పర్యటించినట్లు ఆయన తెలిపారు. క్రీస్తు శకం 1516 సంవత్సరంలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు కొండవీడు, నాగార్జున కొండలను జయించి పాలిస్తున్న సమయంలో ఆయన చేసిన దానాల గురించిన వివరాలు నాపరాతిపై చెక్కిన ఈ శాసనంలో ఉన్నాయని వివరించారు. ఈ శాసనం చారిత్రక ప్రాధాన్యతను గ్రామస్తులకు వివరించామని, ఈ శాసనాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. పీఠంపై నిలబెట్టి చారిత్రక వివరాల బోర్డును ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామస్తులు సతీష్ పావులూరి, శివశంకర్, మణిమేల, దుర్గంపూడి యుగ్‌నాథ్‌రెడ్డి, రమేష్, డి.ఆర్.శ్యాం సుందరరావు తనకు సహకరించారని శివనాగిరెడ్డి తెలిపారు.

'కృష్ణా' లారీ ఓనర్ల సంఘానికి నూతన పాలకవర్గం



నియామక పత్రాన్ని అందజేస్తున్న వెంకటేశ్వరరావు

విజయవాడ స్పోర్ట్స్: ది కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రధాన అధికారి పొలడుగు వెంకటేశ్వరరావు వెల్లడించారు. అసోసియేషన్ హాలులో ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా నాగుమోతు రాజా, ఉపాధ్యక్షులుగా కాజ వెంకట సత్యచలపతిరావు, కుచ్చర్లపాటి సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శిగా వీరవెంకటసత్యనారాయణ, కార్యదర్శులుగా రావి శరత్‌రాజు, చెన్నుపాటి వినయ్, కోశాధికారిగా పొట్లూరి చంద్రశేఖర రావు ఎన్నికైనట్లు వివరించారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

క్లుప్తంగా...

శాస్త్రోక్తంగా వైకుంఠ ద్వాదశి చక్రస్నానం



పుష్కరిణిలో శాస్త్రోకంగా చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల: శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ముందుగా శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను శ్రీవారి ఆలయం నుంచి శ్రీ భూవరాహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. పుష్కరిణిలో ఉదయం 4.30 నుంచి 5.30 గంటల నడుమ స్నపన తిరుమంజనం, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవాన్ని చేపట్టారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. కాగా, శ్రీవారిని శనివారం అర్ధరాత్రి వరకు 67,906 మంది వైకుంఠ ద్వారం గుండా దర్శనం చేసుకుని హుండీలో రూ.2.50 కోట్లు వేశారు.

వినాయకునికి వెండి తొడుగులు సమర్పణ



ఈవోకు వెండి తొడుగులు అందిస్తున్న భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి ఎన్‌ఆర్‌ఐలు వెండి తొడుగులు సమర్పించారు. ఆలయ పునఃనిర్మాణానికి విరాళాలు ఇచ్చిన ఎన్‌ఆర్‌ఐలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఆదివారం కాణిపాకం ఆలయంలో ద్వారాలకు, అంతరాలయంలో అలంకరించడానికి రూ.3 కోట్ల విలువైన 340 కిలోల వెండి తొడుగులను ఈవో వెంకటేశుకు అందజేశారు. వీరికి స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని ఈవో కల్పించారు. వెండి తొడుగులను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఈవో తెలిపారు.


ఏయూ స్నాతకోత్సవం వాయిదా



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం 91, 92 సంయుక్త స్నాతకోత్సవం వాయిదా పడిందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీన జరగాల్సిన సంయుక్త స్నాతకోత్సవాన్ని వాయిదా వేశామని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు సమాచారాన్ని ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

'కార్తికేయ' స్కాం సూత్రధారి అరెస్టు

- 19 రాష్ట్రాల్లో తలదాచుకున్న నిందితుడు
- నాలుగు నెలల తరువాత మహారాష్ట్రలో అరెస్ట్



కాకినాడ క్రైం: వందలాది మంది డిపాజిటర్లను నట్టేట ముంచి..రూ.21 కోట్ల భారీ మోసానికి పాల్పడి.. పరారీలో ఉన్న కార్తికేయ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వ్యవస్థాపకుడు 64 ఏళ్ల కోడి వీర వెంకట సత్యనారాయణ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఎవరూ గుర్తు పట్టలేనంతగా వేషధారణ మార్చుకుని మహారాష్ట్ర శివారు సరిహద్దుల్లో లగ్జరీ జీవితాన్ని అనుభవిస్తున్న నిందితుడు సత్యనారాయణను కాకినాడ టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ నాయక్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అరెస్ట్ చేసింది. కేసు వివరాల్లోకి వెళితే.. 62 మంది సభ్యులతో 2003 ఫిబ్రవరి 28వ తేదీన కార్తికేయ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీని సత్యనారాయణ స్థాపించాడు. కాకినాడ నూకాలమ్మ గుడి సమీపంలోని దంటు వారి వీధిలో కార్యాలయం ఏర్పాటు చేశాడు. సొసైటీ ఏర్పడిన అనతి కాలంలోనే భారీ వడ్డీ ఆశ చూపి, వందలాది మంది డిపాజిటర్లను ఆకర్షించగలిగాడు. ఈ క్రమంలోనే 341 మంది డిపాజిటర్ల నుంచి 1,600 డిపాజిట్ల రూపంలో మొత్తం రూ.21 కోట్లు వసూలు చేశాడు. కొన్ని నెలల క్రితం మెచ్యూరిటీ గడువు పూర్తయినా సొమ్ము తిరిగి ఇవ్వకపోవడంతో సొసైటీ సభ్యులు, డిపాజిటర్లతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కుంభకోణంపై నాలుగు నెలల క్రితం కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో నాలుగు నెలల వ్యవధిలో ఆరుగురు నిందితులను అరెస్టు చేయగా.. కీలక నిందితుడు సత్యనారాయణ 19 రాష్ట్రాల్లో సంచరిస్తూ.. పోలీసులకు చిక్కకుండా ముప్పుతిప్పలు పెట్టాడు. అయితే తీవ్రంగా గాలించిన పోలీసులు ఎట్టకేలకు మహారాష్ట్రలో అరెస్ట్ చేసి.. నిందితుడిని రాజమహేంద్రవరం జిల్లా జడ్జి కోర్టులో ఆదివారం హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

జేఈఈకి భారీగా నమోదు

2024 జనవరి సెషన్‌కు 12.30 లక్షల మందికి పైగా దరఖాస్తు



2023 తొలిసెషన్ కంటే 3.70 లక్షల మంది ఎక్కువ • ఏపీ నుంచి 1,34,703 మంది రిజిస్ట్రేషన్

సాక్షి, అమరావతి: ఐఐటీ, ఎన్‌ఐటీ తదితర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ పరీక్షకు విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జనవరిలో జరగనున్న తొలిసెషన్‌కు దాదాపు 12.30 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇది 2023లో జరిగిన రెండు సెషన్ల రిజిస్ట్రేషన్ల కంటే 68 వేలు ఎక్కువ. 2023 జనవరి సెషన్‌తో పోలిస్తే 3.70 లక్షల మంది అభ్యర్థులు పెరిగారు. మొత్తం దరఖాస్తుదారుల్లో పురుషులు 8,23,842 మంది, మహిళలు 4,06,486 మంది ఉన్నారు. పేపర్–1 (బీటెక్, బీఈ)కు 6.40 లక్షల మంది, పేపర్–2 (ఆర్కిటెక్చర్, ప్లానింగ్)కి 5,89,834 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఇచ్చిన గడువు ముగిసింది. జనవరి 24వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ మధ్య నిర్వహించనున్న ఈ పరీక్షలకు అడ్మిట్ కార్డులను ఎన్‌టీఏ జనవరి రెండోవారం నుంచి అందుబాటులో ఉంచనుంది. ఫిబ్రవరి 12వ తేదీ ఫలితాలను వెల్లడించనుంది.

రాష్ట్రం నుంచి పెరిగిన దరఖాస్తులు

తెలుగు రాష్ట్రాల్లో జేఈఈ మెయిన్ రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరుగుతున్నాయి. 2024 జనవరి సెషన్‌కు 1,62,624 మంది దరఖాస్తుదారులతో మహారాష్ట్ర మొదటిస్థానంలో ఉంది. 2023లో జరిగిన రెండు సెషన్లకు కలిపి మహారాష్ట్రలో 1,39,696 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2023లో రెండు సెషన్లకు కలిపి ఆంధ్రప్రదేశ్‌లో 1,01,745 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పుడు 2024 తొలిసెషన్‌కే 1,34,703 మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. 2023లో రెండు సెషన్లకు కలిపి తెలంగాణలో 95,411 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పుడు జనవరి సెషన్‌కు 1,26,746 మంది నమోదయ్యారు. ఆ తర్వాతి స్థానాల్లో ఉత్తరప్రదేశ్ (1,25,272 మంది), కర్ణాటక (79,229) ఉన్నాయి.

గతేడాది నుంచి మార్పు

కరోనా తర్వాత రిజిస్ట్రేషన్లలోనే కాకుండా తరువాత పరీక్షలకు హాజరవుతున్న వారిసంఖ్య తగ్గిపోయింది. జేఈఈ మెయిన్‌కు, జేఈఈ అడ్వాన్స్‌కు కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. 2017 నుంచి 2022 వరకు గణాంకాలు ఈ తగ్గుదలను స్పష్టం చేస్తున్నాయి. ఏటా ఈ పరీక్షకు లక్ష నుంచి లక్షన్నర మంది వరకు తగ్గిపోయారు. కానీ.. 2023 సెషన్లు ఈ పరిస్థితిని మార్చేశాయి. 2023లో జేఈఈ మెయిన్‌కు సుమారు 11.62 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది షెడ్యూల్ ప్రకటన ఆలస్యం కావడంతోపాటు పరీక్షలకు వ్యవధి ఎక్కువ లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల వాయిదా కోసం కొందరు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించగా కోర్టు అందుకు అంగీకరించలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో పరీక్షకు హాజరయ్యే వారిసంఖ్య తక్కువగానే ఉండవచ్చని అభిప్రాయపడినా.. దరఖాస్తుదారుల సంఖ్య భారీగా పెరిగింది. జేఈఈ మెయిన్ పరీక్షకు 2017లో 11,86,454 మంది దరఖాస్తు చేయగా 2022లో ఆ సంఖ్య 10,26,799కు తగ్గింది. 2017లో 11,22,351 మంది పరీక్షకు హాజరు కాగా 2022 నాటికి వారిసంఖ్య 9,05,590కి తగ్గింది. 2023లో దరఖాస్తులు పెరగడంతోపాటు 11.13 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. ఇక జేఈఈ మెయిన్ తరహాలోనే అడ్వాన్స్‌కు దరఖాస్తులతోపాటు అర్హత సాధిస్తున్నవారు పెరుగుతున్నారు. 2023లో అడ్వాన్స్ పరీక్షకు అర్హులైన 2.50 లక్షల మందిలో 1.89లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 43,773 మంది అడ్వాన్స్‌లో ర్యాంకులు సాధించారు.

2017 నుంచి 2023 వరకు మెయిన్ పరీక్షకు నమోదు చేసుకున్న, పరీక్ష రాసిన విద్యార్థుల వివరాలు

సంవత్సరం	నమోదు చేసుకున్నవారి సంఖ్య	పరీక్షకు హాజరైనవారి సంఖ్య
2017	11,86,454	11,22,351
2018	11,48,000	10,43,000
2019	12,37,892	11,47,125
2020	11,74,000	10,23,000
2021	10,48,012	9,39,008
2022	10,26,799	9,05,590
2023	11,62,000	11,13,325



2017 నుంచి 2023 వరకు అడ్వాన్స్‌కు అర్హత సాధించిన, అడ్వాన్స్‌కు దరఖాస్తు చేసుకున్న, ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలు

సంవత్సరం	అడ్వాన్స్‌కు అర్హత సాధించినవారు	అడ్వాన్స్‌కు దరఖాస్తు చేసుకున్నవారు	ర్యాంకులు సాధించినవారు
2017	2,21,834	1,71,000	51,000
2018	2,31,024	1,65,656	31,988
2019	2,45,194	1,74,432	38,705
2020	2,50,681	1,50,838	43,204
2021	2,50,597	1,41,699	41,862
2022	2,10,251	1,55,538	40,712
2023	2,50,000	1,89,744	43,773

పోటీతత్వంతో ఉండేది కొందరికే

ఐఐటీల్లో 17 వేల వరకు సీట్లుండగా ఎన్‌ఐటీ తదితర జాతీయ విద్యాసంస్థల్లోని సీట్లన్నీ కలిపి మరో 39 వేల వరకు పెరిగాయి. వీటికి ఏటా పోటీపడుతున్న 12 లక్షల మందికి పైగా విద్యార్థుల్లో సీరియస్‌గా ప్రిపేర్ అవుతున్నది కొందరేనని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. 50 శాతం మంది ఏదో దరఖాస్తు చేశామనిపించుకోవడమే తప్ప పరీక్షలకు అసలు సిద్ధం కావడంలేదని పేర్కొంటున్నారు.

పైత్యం దాటి పైశాచికం

▶ మొదటి పేజీ తరువాయి

ఆదుకోవాల్సిన యాసిడ్ దాడి బాధితురాలిపై కక్షపూరితంగా సుప్రీంకోర్టుకెక్కిన అమానవీయ చరిత్ర చంద్రబాబుదే! నాడు ఆయన నాయీ బ్రాహ్మణులను వేలెత్తి బెదిరించడం.. మత్స్యకారులను కించపరచిన ఘటనలు కళ్లముందే కదలాడుతున్నాయి!

నాడూ నేడూ అదే చిత్తశుద్ధి

పరిపాలనకు మానవీయతను అద్ది సీఎం జగన్ జనరంజకంగా పాలిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్ జగన్ రాజీలేని పోరాటం చేశారు. సమస్యల పరిష్కారానికి వేదికగా ఉండాల్సిన శాసనసభను నాటి సీఎం చంద్రబాబు రాజకీయ కుట్రలకు కేంద్రంగా మార్చడాన్ని నిరసిస్తూ 2017 అక్టోబర్ 25న అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించి వైఎస్ జగన్ ప్రజల్లోకి వెళ్లారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు భరోసా కల్పిస్తూ 'ప్రజా సంకల్పం' పాదయాత్రను 2017 నవంబర్ 6న ప్రారంభించారు. ఇడుపులపాయ నుంచి ప్రారంభించి 3,648 కి.మీ. నడిచి 2019 జనవరి 9న ఇచ్ఛాపురంలో ముగించారు. పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలతో మమేకమై వారి కష్టాలు విన్నారు. అధికారంలోకి వచ్చాక వాటిని పరిష్కరిస్తానని హామీ ఇస్తూ 'నేను ఉన్నాను.. నేను విన్నాను' అంటూ భరోసా కల్పించారు. పాదయాత్ర హామీలనే మేనిఫెస్టోగా ప్రకటించి 2019 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో విజయం సాధించి అధికారంలోకి వచ్చారు. ఒక వ్యక్తిగా, ఒక ప్రభుత్వంగా ఎంతమందికి మేలు చేయగలమో అంతమందికి శక్తి వంచన లేకుండా మంచి చేయాలన్నది సీఎం జగన్ సంకల్పం. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించాలని, గొంతు విప్పలేని వారికి అండగా నిలవాలంటూ దిశానిర్దేశం చేశారు. అదే స్ఫూర్తితో పాలన కొనసాగిస్తున్నారు. ఇచ్చిన హామీల్లో 99.5 శాతం అమలు చేశారు. అర్హతే ప్రామాణికంగా, వివక్షకు తావు లేకుండా అందరికీ సంక్షేమ పథకాలను అందించారు. డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో ఇప్పటికే రూ.2.43 లక్షల కోట్లను జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.67 లక్షల కోట్ల మేర ప్రయోజనాన్ని చేకూర్చారు.

సొంత ఖర్చులతో ఎందరికో పునర్జన్మ

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సైతం అనారోగ్య సమస్యలతో తన వద్దకు వచ్చిన ఎందరికో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత ఖర్చులతో వైద్యం అందించారు. అనేక మందికి శస్త్ర చికిత్సలు చేయించారు. నాడు అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కారు వారి కష్టాలను పెడచెవిన పెట్టింది కాబట్టే బాధితులు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌ను ఆశ్రయించారు. వారి సమస్యలు విన్న వైఎస్ జగన్ సొంత ఖర్చులతో వైద్యం, శస్త్రచికిత్సలు చేయించి బాధితుల కన్నీళ్లు తుడిచారు. అధికారంలోకి వచ్చాక అనునిత్యం ప్రజా సమస్యలతోపాటు రంగాలవారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. ఏ కార్యక్రమంలో పాల్గొన్నా దారి పొడవునా ఎంతోమంది ప్రజలను కలుసుకుని విధి వంచితులు, అనారోగ్యంతో బాధ పడుతున్న వారి పట్ల అత్యంత మానవీయ దృక్పథంతో స్పందిస్తూ ఆపన్నహస్తం అందిస్తున్నారు. సీఎం జగన్ అభయం ఇచ్చిన గంటల వ్యవధిలోనే బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు చెక్కులను పంపిణీ చేస్తున్నారు. అక్కడితో ఆగిపోకుండా వారి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యేలా సంపూర్ణంగా చేయూత అందిస్తున్నారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారికైతే చికిత్సలు, సర్జరీలు చేయించడం దగ్గర నుంచి జబ్బు నయం అయ్యే వరకూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. టీడీపీ హయాంలో ఇలాంటి సహాయం అందిన దాఖలాలు లేవు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతిపత్రాలను సైతం చంద్రబాబు గాలికొదిలేశారు.

సమస్యల పరిష్కారంలో దిక్సూచి

ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పాలకులకు సీఎం వైఎస్ జగన్ దిక్సూచిలా నిలుస్తున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'స్పందన' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకూ 25,26,936 సమస్యల పరిష్కారం కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోగా 25,21,050 సమస్యలను అధికారులు పరిష్కరించారు. మిగతా 5,886 సమస్యలను సైతం పరిష్కరించడంలో నిమగ్నమయ్యారు. సమస్యపై ప్రజల నుంచి ఫిర్యాదు అందిన దగ్గర నుంచి పరిష్కారం అయ్యేవరకూ అర్జీదారులకు అది ఏ దశలో ఉందో ఎప్పటికప్పుడు తెలియచేసే వ్యవస్థను తీసుకొచ్చారు. స్పందన కార్యక్రమానికి మరిన్ని మెరుగులు దిద్దిన ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' ద్వారా మరింత సమర్థంగా ఫిర్యాదులను పరిష్కరిస్తోంది. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ఇప్పటివరకూ 3,53,774 ఫిర్యాదులు అందగా 3,24,876 సమస్యలను పరిష్కరించారు. మరో 28,898 సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇలాంటి కార్యక్రమాలను చేపట్టేందుకు గత ప్రభుత్వాలు సాహసించని పరిస్థితి. సమస్యలు పరిష్కారం కాకపోతే రాజకీయంగా దెబ్బ తింటామనే భయంతో ఇలాంటి కార్యక్రమాలకు చంద్రబాబు దూరంగా ఉన్నారు. ప్రజా వినతుల పరిష్కారాన్ని ఒక లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకు సాగుతున్న ప్రభుత్వంపై విషం చిమ్మడం ఏ తరహా పాత్రికేయం రామోజీ?

చేయి ఎత్తి పిలిచిన ప్రతి ఒక్కరి దగ్గరికీ

జిల్లాల పర్యటనల్లోనే కాకుండా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భాల్లో కూడా సీఎం జగన్ ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తూ వాటి పరిష్కార బాధ్యతను తన కార్యదర్శికి అప్పగిస్తున్నారు. ప్రతి రోజూ వాటిపై సమీక్షిస్తున్నారు. తన కాన్వాయ్ వెళ్తున్న సమయంలో ఎవరైనా చేయి ఎత్తితే చాలు.. సీఎం జగన్ ఆగి మరీ వారి వద్దకు వెళ్లి సమస్య గురించి ఆరా తీసిన సందర్భాలు కోకొల్లలు.

వికేంద్రీకరణతో గుమ్మం వద్దకే సేవలు

సీఎం జగన్ అధికారంలోకి రాగానే వికేంద్రీకరణతో పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాలను 2019 అక్టోబర్ 2న ప్రారంభించగా 2020 జనవరి 26 నుంచి పూర్తి స్థాయిలో సేవలను ప్రజలకు అందిస్తున్నారు. ఇప్పటివరకూ 9.72 కోట్ల సేవలను ప్రజలకు అందించారు. సెలవు రోజులు మినహాయిస్తే రోజుకు సగటున 75 వేలకుపైగా సేవలను అందించడం గమనార్హం.

సంతృప్త స్థాయిలో పెన్షన్లు

టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చినా అర్హులందరికీ పూర్తి స్థాయిలో పథకాలు అందేవి కావు. పెన్షన్ తీసుకుంటున్న వారు ఎవరైనా చనిపోతేనే వారి స్థానంలో కొత్తగా పెన్షన్ మంజూరు చేస్తామని తేల్చి చెప్పిన అమానవీయ పాలన చంద్రబాబుది. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోనే అర్హులకు మంజూరు చేస్తున్నారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోనే అందిస్తున్నారు. ఇంటి దరఖాస్తుదారులకు 90 రోజుల్లోనే స్థలం పట్టా ఇవ్వడంతోపాటు ఇల్లు కట్టుకోవడానికి నిధులను మంజూరు చేస్తున్నారు.

అమానవీయ పాలనకు చిరునామా చంద్రబాబు

- యాసిడ్ దాడిలో గాయపడ్డ మహిళ అనూరాధ ఆర్థిక సాయం కోసం ప్రభుత్వాన్ని అర్థిస్తే చంద్రబాబు పాలనలో పట్టించుకోలేదు. అనూరాధకు సాయం చేయాలని హైకోర్టు తీర్పు ఇస్తే దాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లిన మనస్తత్వం చంద్రబాబుది.
- తమ జీతాలు పెంచాలంటూ నాయీ బ్రాహ్మణులు సచివాలయానికి వచ్చి వేడుకుంటే తోకలు కత్తిరిస్తానంటూ అహంకారంతో బెదిరించిన నైజం చంద్రబాబుది.
- 2014 ఎన్నికల హామీ మేరకు తమకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని కోరిన మత్స్యకారులను తాట తీస్తానంటూ హూంకరించిన అమానవీయ పాలకుడు చంద్రబాబు.
- హామీలను అమలు చేయాలని అభ్యర్థించిన ముస్లిం మైనార్టీ యువకులపై దేశద్రోహం కేసులు బనాయించి జైళ్లలో పెట్టించిన ఘనత కూడా చంద్రబాబుదే.
- చంద్రబాబు జిల్లాల పర్యటనకు వెళ్లిన సమయాల్లో ఒక్క అభాగ్యుడినైనా కలసి సహాయం చేసిన దాఖలాలు మచ్చుకైనా లేవు. స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడిన సందర్భాలు లేవు.
- పుష్కరాల్లో తన ప్రచార పిచ్చితో 27 మంది మరణిస్తే కనీసం వారి కుటుంబాలను పరామర్శించని అనైతిక ధోరణి చంద్రబాబుది. వారికి పరిహారం ఇప్పించడానికి స్థానిక ప్రజాప్రతినిధులు గత ప్రభుత్వంతో యుద్ధం చేయాల్సి వచ్చింది.
- టీడీపీ హయాంలో తమ విజ్ఞాపనలు తీసుకోవడం లేదని కరకట్టలోని చంద్రబాబు నివాసం వద్ద ఒక మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించారు. సచివాలయం వద్ద కూడా ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది.
- చంద్రబాబు సీఎంగా ఉండగా కార్యాలయంలో ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన కార్యదర్శి సతీష్ చంద్ర తలుపును నాటి మంత్రి అయ్యన్న పాత్రుడు తన్నుకుంటూ వెళ్లారు. అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న వల్లభనేని వశీ సైతం రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని నాటి సీఎం కార్యాలయ అధికారులపై నిరసన వ్యక్తం చేశారు.
- అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఏ రోజూ వినతి పత్రాలు స్వీకరించలేదు. ఫొటోషూట్ కోసం అప్పుడప్పుడు ఒకటి రెండు వినతిపత్రాలు తీసుకున్నా బుట్టదాఖలు చేసేవారు. సుదీర్ఘ సమీక్షలతో కాలం గడిపేవారు.
- రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వారికి పరిహారం ఇవ్వాల్సి వస్తుందని కుటుంబ సమస్యలు, మద్యం తాగి మరణించారంటూ తప్పించుకుని అమానవీయంగా ప్రవర్తించిన చంద్రబాబును రామోజీరావు భుజనికెత్తుకుని కీర్తిస్తున్నారు.

మళ్లీ పరాజయం తప్పదనే..

రాష్ట్రంలో 55 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రజాదరణ రోజు రోజుకు పెరుగుతోంది. చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ జత కట్టినా ఆ జోడీకి ప్రజా స్పందన లభించడం లేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలనూ వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని టైమ్స్ నౌ సహా పలు జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లో వెల్లడవడంతో రామోజీ ఆందోళన చెందుతున్నారు. 2019 ఎన్నికలకు మించి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఘోర పరాజయం తప్పదని, ఆ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని గ్రహించారు. చంద్రబాబుతో కలిసి ప్రజాధనం దోపిడీకి సహకరించిన రామోజీ టీడీపీ ఉనికిని కాపాడటం కోసం సీఎం జగన్‌పై బురద జల్లుతూ తప్పుడు కథనాలను అచ్చేయడం నిత్యకృత్యంగా మార్చుకున్నారు.

ఆందోళన కాదు.. ఆదుకున్నదెవరో ఆలోచించండి

ఎప్పటికప్పుడు అంగన్‌వాడీల ఆకాంక్షలను నెరవేరుస్తున్న సీఎం జగన్

- కనీస వేతనాలు అడిగిన అంగన్‌వాడీలపై చంద్రబాబు కర్కశత్వం
- రోడ్లపై గుర్రాలతో తొక్కించి..భాష్పవాయువు ప్రయోగం
- నిరంకుశత్వంతో అంగన్‌వాడీల గొంతు నొక్కిన టీడీపీ
- 2018లో పాదయాత్రలో అంగన్‌వాడీల గౌరవ వేతనం పెంచుతామని మాట ఇచ్చిన జగన్
- సీఎం హోదాలో మాట నిలబెట్టుకుంటూ వేతనాల పెంపు
- దేశంలోనే అత్యున్నతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం
- బాబు 5ఏళ్లలో నెలకు సగటు వేతనం వర్కర్లకు రూ.6,950, హెల్పర్లకు రూ.3,900
- సీఎం జగన్ నాలుగున్నరేళ్లుగా ప్రతి నెలా వర్కర్లకు రూ.11,500, హెల్పర్లకు రూ.7వేలు అందజేత
- దేశంలోనే అత్యధిక వేతనం అందిస్తున్న రాష్ట్రాల జాబితాలో ఏపీ
- వర్కర్లు, హెల్పర్లకు బెనిఫిట్స్ రెట్టింపునకు అంగీకారం



సాక్షి, అమరావతి: ప్రతిపక్షనేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన ఒక్కమాట.. అంగన్‌వాడీ వ్యవస్థ రూపురేఖలను మార్చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల సౌకర్యాలు, సేవలను అత్యున్నత రీతిలో మెరుగుపరచి ఆ వ్యవస్థను అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. అంతకుముందు చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం పాలనలో కనీస వేతనం ఇవ్వమని కోరిన అంగన్‌వాడీలపై అత్యంత కర్కశంగా ప్రవర్తించారు. రోడ్లపై పరుగెత్తించి గుర్రాలతో తొక్కించారు. మహిళలని చూడకుండా భాష్పవాయువును ప్రయోగించారు. ఇది నియంతృత్వ పాలనకు పరాకాష్ట. చరిత్ర మర్చిపోని దారుణ గాయం. చంద్రబాబు ఐదేళ్ల నిరంకుశత్వంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అరకొర జీతాలతోనే జీవితాలను నెట్టుకొచ్చారు. బాబుగారి జమానాలో నెలకు సగటు వేతనంగా వర్కర్లకు రూ.6,950, హెల్పర్లకు రూ.3900 మాత్రమే అందింది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చినమాటను నిలబెట్టుకుంటూ వారి వేతనాలను భారీగా పెంచారు. గడిచిన నాలుగున్నరేళ్లుగా ప్రతి నెలా వర్కర్లకు రూ.11,500, హెల్పర్లకు రూ.7వేలు అందిస్తూ ఆర్థిక భరోసా అందిస్తున్నారు. ఇప్పుడు దేశంలో అంగన్‌వాడీలకు అత్యధిక వేతనం అందిస్తున్న జాబితాలో వర్కర్ల వేతనంలో 6వ స్థానం, హెల్పర్ల వేతనంలో 4వ స్థానంలో ఏపీ నిలుస్తున్నది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, వేతనాలు, సేవల విషయంలో జాతీయస్థాయిలో నీతి ఆయోగ్ సైతం ప్రశంసలు కురిపించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ఈ వాస్తవాలను పరిశీలిస్తున్న ప్రజలు.. ఆందోళన కాదు.. ఆదుకున్నదెవరో అంగన్‌వాడీలు ఆలోచించాలని చర్చించుకోవడం గమనార్హం.

మాట ఇచ్చి.. నిలబెట్టుకుని

బడుగు, బలహీనవర్గాలకు మేలుచేసే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, వాటిలో సేవలందిస్తున్న వర్కర్లు, ఆయాల విషయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలి నుంచీ సానుకూల దృక్పథాన్ని కనబరుస్తున్నది. గ్రామాల్లోని అంగన్‌వాడీలను ఆధునీకరించడంతో పాటు వర్కర్లు, హెల్పర్లకు మెరుగైన జీతాలిచ్చి సమాజంలో గౌరవంగా నిలబెట్టింది. చంద్రబాబు అణిచివేత పాలనలో అంగన్‌వాడీల గొంతునొక్కేస్తే.. సీఎం జగన్ పాలనలో జీతాలు పెంచడంతో జీవన ప్రమాణాలు వృద్ధి చెందాయి. చంద్రబాబు ప్రభుత్వం 2014 నుంచి 2016 వరకు అంగన్‌వాడీ వర్కర్లకు కేవలం రూ.4,200 మాత్రమే గౌరవ వేతనం ఇచ్చింది. ఎన్నికలు సమీపిస్తుండంతో కంటితుడుపుగా 2016లో రూ.ఏడు వేలకు పెంచింది. 2018లో సుదీర్ఘ పాదయాత్ర సందర్భంగా అంగన్‌వాడీలకు అప్పటికి తెలంగాణలో ఇస్తున్న దానికంటే గౌరవ వేతనం పెంచుతానని ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ ప్రకటించారు. అప్పుడుగానీ చంద్రబాబుకు అంగన్‌వాడీలు గుర్తుకురాలేదు. దీంతో ఎన్నికలకు ఆర్నెల్ల ముందు హడావుడిగా వేతనాలు పెంచినట్టు మోస పూరితంగా జీవో ఇచ్చారు. కానీ, జీవోను ఎక్కడా అమలు చేయలేదు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ తెలంగాణ కంటే అధికంగా ఇస్తామన్న మాట నిలబెట్టుకుంటూ వర్కర్లకు రూ.11,500, హెల్పర్లకు రూ.7వేల చొప్పున వేతనాలను పెంచారు.

మరింత మేలు చేసే నిర్ణయాలు

- అంగన్‌వాడీల విజ్ఞప్తి, ఆకాంక్షల మేరకు కార్యకర్తలు, సహాయకులకు గరిష్ట వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- అంగన్‌వాడీ కార్యకర్తలకు తమ సర్వీసు చివరి నాటికి బెనిఫిట్స్‌ను రూ.50వేల నుంచి రూ.లక్షకు, హెల్పర్లకు రూ.20వేల నుంచి రూ.40వేలకు పెంచనుంది.
- అంగన్‌వాడీ సహాయకులను అంగన్‌వాడీ కార్యకర్తలుగా ప్రమోట్ చేసేందుకు గరిష్ట వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచింది.
- అంగన్‌వాడీ కార్యకర్తలకు టీఏ, డీఏలను రాష్ట్ర ప్రభుత్వం నిధుల నుంచి విడుదల చేయనుంది.
- మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయనుంది.

ఇది కదా అంగన్‌వాడీల ప్రభుత్వం

- అంగన్‌వాడీలకు గౌరవమైన జీతాలు అందిస్తుండడంతో పాటు మంచి పనితీరును కనబరిచిన వర్కర్లు, హెల్పర్లకు నెలకు రూ.500 ప్రోత్సాహకంగా అందిస్తోంది. ఇలా ఏడాదికి సుమారు రూ.27.80 కోట్లను ప్రభుత్వం అదనంగా చెల్లిస్తున్నది.
- 2013 నుంచి అంగన్‌వాడీలకు ప్రమోషన్లు నిలిచిపోయాయి. చంద్రబాబు దీనిని పట్టించుకోలేదు. సీఎం జగన్ ఒక్కరే అంగన్‌వాడీల సేవలను గుర్తించి ప్రమోషన్లు కల్పించింది. 560 గ్రేడ్–2 సూపర్‌వైజర్ల పోస్టులను భర్తీ చేశారు.
- ఇక్కడ మరింత మేలు చేకూరుస్తూ సూపర్‌వైజర్ పోస్టుల పరీక్షల వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచారు.
- 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ఈ వయోపరిమితి పెంపు ఎంతో మేలు చేసింది. తద్వారా ఎక్కువ మంది పోటీపడే అవకాశం దక్కింది.
- ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి రూ.1,313కోట్లు అందించింది. నవరత్నాల్లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతుభరోసా, జగనన్న వసతిదీవెన, ఆరోగ్య శ్రీని వర్తింపజేస్తున్నది.
- స్మార్ట్ ఫోన్లు ఇచ్చి అంగన్‌వాడీలకు పనిని సులభతరం చేసింది. 85.47 కోట్లతో 56,984 స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసింది. మొబైల్ డేటా కోసం ఏడాదికి రూ.12 కోట్లు చెల్లిస్తున్నది.
- ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు రూ.2లక్షల ప్రమాదబీమాను అందిస్తున్నది. ఒక్కొక్కరికీ 6 చొప్పున రూ.16 కోట్ల విలువైన యూనిఫాం శారీలు ఇచ్చింది.
- నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల స్థాయిల్లో అంగన్‌వాడీల్లో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది.
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు గతంలో మాదిరిగా వంటచేసి ఇచ్చే ఇబ్బంది లేకుండా హోం రేషన్ పద్ధతిని తీసుకొచ్చింది. దీని వల్ల అంగన్‌వాడీలకు పనిభారం తగ్గడంతో పాటు పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందిస్తున్నాయి.

తెలంగాణ

రవాణాశాఖ కమిషనర్‌గా జ్యోతి బుద్ధప్రకాశ్

సాక్షి, హైదరాబాద్‌: జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ ముగిసిన వెంటనే ఆరుగురు ఐఏఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీచేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళికేరికి పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎక్సైజ్ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్‌ను రవాణాశాఖ కమిషనర్‌గా బదిలీ చేయగా, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న ఈ.శ్రీధర్‌ను ఎక్సైజ్ కమిషనర్‌గా నియమించింది. ఆయనకు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీఎస్‌ఐఐసీ) వైస్ చైర్మన్‌అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టును అదనంగా అప్పగించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్‌ను పౌర సరఫరాల బాధ్యతల నుంచి తప్పించింది. ఆ స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి దేవేందర్ సింగ్ చౌహాన్‌ను నియమించింది. మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పొట్రుకు రంగారెడ్డి కలెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. జీహెచ్‌ఎంసీలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న శృతి ఓజాను ఇంటర్‌విద్య కార్యదర్శిగా, ఇంటర్ బోర్డు డైరెక్టర్‌గా నియమించింది. ఇప్పటివరకు ఆ బాధ్యతలను సీసీఎల్‌ఏ నవీన్‌మిత్తల్ అదనంగా నిర్వహిస్తున్నారు. గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టియానా జెడ్ చొంగ్తు స్థానంలో ఈవీ నర్సింహారెడ్డిని డైరెక్టర్‌గా నియమించింది.

'ప్రతిఫలం' కథాసంపుటి ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్‌): ప్రముఖ రచయిత, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ రచించిన 'ప్రతిఫలం' కవితా సంపుటిని ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విమల సాహితి సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథులుగా పాల్గొన్న ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం.నర్సింహప్ప మాట్లాడుతూ జస్టిస్ చంద్రకుమార్ రాసిన 'ప్రతిఫలం' తెలుగు సాహిత్యంలో అపూర్వమైన కవితా సంపుటి అని ప్రశంసించారు. సమాజంలోని అనేక సమస్యలపై స్పందిస్తూ.. ఒక న్యాయమూర్తిగా తన అనుభవాలను జోడించి అద్భుతమైన కథలు ఆవిష్కరించారన్నారు. ఈ కథలు సమాజంలోని అన్ని వర్గాల వారిని ఆలోచింపజేస్తాయని పేర్కొన్నారు. కవి, విమర్శకుడు డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో 'కూచిపూడి డ్యాన్స్ లెసన్'

హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 3,783 మంది కళాకారుల ప్రదర్శన

గచ్చిబౌలి (హైదరాబాద్‌): తెలుగు వారి ప్రాచీన నృత్యం కూచిపూడి డ్యాన్స్ లెసన్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. ఏకకాలంలో 3,783 మంది కళాకారులు కూచిపూడి నృత్యం చేసి కళా వైభవాన్ని ప్రపంచానికి చాటారు. ఆదివారం రాత్రి గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళా వైభవం పేరిట లార్జెస్ట్ కూచిపూడి డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారు. స్టేడియం నలుమూలలా ఏడు నిమిషాలపాటు కళాకారులు నృత్యం చేస్తూ అలరించారు. గురువు పసుమర్తి శేషు బాబు ఆధ్వర్యంలో కళాకారులు ఏకకాలంలో నృత్యం చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అడ్జుడికేటర్ రిషినాథ్ నిర్వాహకులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క హాజరయ్యారు.

ఠాక్రేకు టీపీసీసీ వీడ్కోలు

త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్న మున్షీ

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి అధిష్టానం తప్పించిన నేపథ్యంలో మాణిక్‌రావ్ ఠాక్రే తన సొంత రాష్ట్రానికి వెళ్లిపోయారు. గోవా ఇన్‌చార్జిగా నియమితులైన ఆయనకు ఆదివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పలువురు టీపీసీసీ నేతలు కలిసి అభినందనలు తెలిపారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు హర్కర వేణుగోపాల్, అంజన్‌కుమార్ యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, ఏఐసీసీ సభ్యుడు ఎం.ఎ.ఫహీం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు భూపతిరెడ్డి నర్సారెడ్డి, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ తదితరులు ఆయనను కలిసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఠాక్రేకు టీపీసీసీ పక్షాన జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలోనే మహారాష్ట్రకు వెళ్లినట్టు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, కొత్త ఇన్‌చార్జిగా నియమితులైన దీపాదాస్ మున్షీ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్టు సమాచారం.

మురళీ కృష్ణుడిగా యాదాద్రీశుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఉదయం శ్రీస్వామి వారిని మురళీకృష్ణుడిగా(శ్రీవేణుగోపాలస్వామి), రాత్రి గోవర్ధనగిరిధారిగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం అలంకార సేవలను ఆచార్యులు ఆలయ తిరు, మాడ వీధుల్లో భక్తుల మధ్య ఊరేగించారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, ప్రధానార్చకులు, అధికారులు పాల్గొన్నారు.

అయినవారిపైనే అకృత్యాలు

ఆఫీస్ పని ముగించుకుని ధరణి (పేరు మార్చాం) ఇంటికెళ్లింది. భర్త పవన్ ఓ పెద్దాయనతో మాట్లాడుతున్నాడు. ఆ పెద్దాయన ఎవరా అనుకుంటూ గదిలోకి వెళ్లబోయింది ధరణి. ఇంతలో భర్త పవన్.. 'ధరణీ.. ఈయన నీకు మావయ్య అవుతారట. చిన్నప్పుడు మీ ఇంటి పక్కనే ఉండేవారట. నువ్వు ఈయన చేతుల్లోనే పెరిగావట. ఈ ఊళ్లో బంధువుల ఇంటికి వచ్చారట. నువ్వు ఇక్కడే ఉంటున్నావని తెలిసి చూసి పోదామని వచ్చారట' అన్నాడు. ధరణి లోనికి వెళ్లిపోయింది. చిన్ననాటి ఘటనలు ఆమె కళ్లముందు కదలాడాయి. తనకు ఆరేళ్ల వయసు ఉన్నప్పుడు.. పక్కింట్లో ఉండే ఆ పెద్దాయన తనను ఆడించేవాడు. ఆ ముసుగులో ఎక్కడ పడితే అక్కడ చేతులు వేసేవాడు. అలా రోజురోజుకు అతడి అకృత్యాలు పెరుగుతూ వచ్చాయి. ఆ విషయాలు గుర్తొచ్చి ధరణి వళ్లు జలధరించింది. కళ్లు కోపంతో ఎరుపెక్కాయి. ఆ పెద్దాయనకు భార్య కాఫీ తీసుకొస్తుందనుకున్నాడు పవన్. ఎంతసేపటికీ ధరణి బయటకు రాలేదు. 'తనకు నేను గుర్తు రాలేదనుకుంట' అంటూ ఆ పెద్దాయన మెల్లగా జారుకున్నాడు. ధరణి లాంటి బాలికలు, మహిళలు తెలిసిన వారి చేతిలోనే అత్యాచారాలకు గురవుతున్నారని జాతీయ నేర గణాంకాల సంస్థ తాజా నివేదిక వెల్లడించింది.



- 96 శాతం అత్యాచార కేసుల్లో దోషులు తెలిసిన వారే
- కుటుంబ సభ్యుల నుంచి సహోద్యోగుల వరకు నిందితులే
- మొదటి స్థానంలో రాజస్థాన్
- అప్రమత్తత, అవగాహనే పరిష్కారం అంటున్న పోలీసులు

సాక్షి, అమరావతి: కుటుంబ సభ్యులు.. బంధువులు.. స్నేహితులు.. సహోద్యోగులు.. సోషల్ మీడియా ఫ్రెండ్స్.. అందరూ తెలిసినవారే. కానీ.. అందరూ తమ మంచి కోరుకునే వారేనని బాలికలు, మహిళలు అనుకుంటే పొరపాటే. బాగా తెలిసిన ఆ గోముఖాల మాటున ఎన్నో వ్యాఘ్రాలుంటాయి. అవకాశం చిక్కితే.. ఒంటరిగా ఉంటే కబళించేందుకు ఏమాత్రం వెనుకాడవు. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదిక మరోసారి ఈ విషయంలో బాలికలు, మహిళలను అప్రమత్తం చేస్తోంది. దేశంలో బాలికలు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారిలో అత్యధికులు వారికి బాగా తెలిసిన వారేనని నివేదిక వెల్లడించింది. ఏకంగా 96 శాతం అత్యాచార కేసుల్లో దోషులు బాధిత మహిళలకు బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల వారు, సహోద్యోగులేనని సవివరంగా నివేదించింది. 2022లో దేశంలో మహిళలపై అత్యాచారాలకు సంబంధించి ఎన్‌సీఆర్‌బీ తాజాగా విడుదల చేసిన ఈ నివేదిక విస్మయపరిచే వాస్తవాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా సగటున రోజుకు 88 మంది మహిళలు అత్యాచారానికి గురవుతున్నారని ఆ నివేదిక తెలిపింది.

స్నేహం.. ప్రేమ.. పెళ్లి పేరిట

2022లో దేశవ్యాప్తంగా 31,516 అత్యాచార కేసులు నమోదయ్యాయి. వాటిలో 14,582 కేసుల్లో స్నేహం, ప్రేమ, పెళ్లి పేరిట నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డారు. 248 కేసుల్లో లైంగిక దాడి / సామూహిక లైంగిక దాడి, హత్యలకు బరితెగించారు. ఈ కేసుల్లో మొత్తం 29,900 మంది దోషులుగా తేలారు. వారిలో ఏకంగా 28,873 మంది లైంగిక వేధింపులకు గురైన బాలికలు, మహిళలకు తెలిసిన వారే అకృత్యాలకు పాల్పడటం గమనార్హం. కేవలం 1,027 మంది మాత్రమే బాధిత మహిళలకు ఏమాత్రం పరిచయం లేనివారు లేదా ఇప్పటికీ ఇంకా గుర్తించనివారు ఉన్నారు.

అత్యధికంగా రాజస్థాన్‌లో..

దేశంలో విస్తీర్ణం, జనాభా పరంగా పెద్ద రాష్ట్రాలుగా గుర్తింపు పొందిన 13 రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాల్లో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో అత్యాచార కేసుల్లో 5,399 మంది దోషులుగా అభియోగాలు నమోదదయ్యాయి. వారిలో బాధిత మహిళలకు తెలిసిన వారు 5,131 మంది ఉన్నారు. పెద్ద రాష్ట్రాల్లో నమోదైన అత్యాచార కేసుల్లో తెలంగాణ 814 మంది నిందితులతో 12వ స్థానంలో ఉండగా.. ఆంధ్రప్రదేశ్ చివరి (15వ స్థానం)లో ఉంది. 2022లో ఏపీలో అత్యాచార కేసుల్లో 621 మంది నిందితులుగా ఉన్నారు. వారిలో బాధిత మహిళలకు తెలిసిన వారే 604 మంది ఉన్నారు. వారిలో కుటుంబ సభ్యులు 39 మంది, స్నేహితులు, విడిపోయిన భర్తలు 294 మంది, కుటుంబ స్నేహితులు, ఇరుగుపొరుగు వారు, సహోద్యోగులు 271 మంది ఉన్నారు.

అవగాహన పెంపొందించాలి

బాగా పరిచయం ఉన్నవారే బాలికలు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. వారిలో కుటుంబ సభ్యుల నుంచి సహోద్యోగుల వరకు ఉంటున్నారు. బాలికలు, మహిళల్లో సరైన అవగాహన పెంపొందిచడమే ఈ సమస్యకు సరైన పరిష్కారం. ప్రధానంగా బాలికలతో తల్లిదండ్రులు వీలైనంత ఎక్కువ సమయం గడపాలి. లైంగిక దాడులకు గురికాకుండా ఉండేలా అవగాహన కల్పించాలి. బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి తెలియజేయాలి. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించేందుకు ప్రయత్నిస్తే వెంటనే ప్రతిఘటించేలా.. ఆ విషయాన్ని తల్లిదండ్రులకు వెంటనే తెలియజేయాలనే అవగాహన పెంపొందించాలి. సోషల్ మీడియాలో స్నేహాలు, ఆన్‌లైన్ ఛాటింగ్‌లలో విషయంలో తగిన పరిధిలో ఉండటం, అప్రమత్తంగా ఉండటం చాలా అవసరం. ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే వెంటనే రక్షణ ఎలా పొందాలన్నది బాలికలకు, మహిళలకు తెలియజేయాలి. మహిళల భద్రత కోసం ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్ వంటి వాటిని సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన కల్పించాలి.

– కేజీవీ సరిత, ఎస్పీ, మహిళా భద్రత విభాగం, సీఐడీ

దేశంలో బాలికలు, మహిళలపై అత్యాచారాల్లో మొదటి పది స్థానాల్లో ఉన్న రాష్ట్రాల్లో నిందితులసంఖ్య

రాష్ట్రం	అత్యాచార కేసుల్లో నిందితుల సంఖ్య	బాధితులకు తెలిసినవారు	తెలియనివారు
రాజస్థాన్	5,399	5,131	268
ఉత్తరప్రదేశ్	3,690	3,507	183
మధ్యప్రదేశ్	3,029	2,983	46
మహారాష్ట్ర	2,904	2,903	1
హర్యానా	1,787	1,753	34
ఒడిశా	1,464	1,449	15
జార్ఖండ్	1,298	1,258	40
ఛత్తీస్‌గఢ్	1,246	1,213	33
పశ్చిమ బెంగాల్	1,111	891	220
ఉత్తరాఖండ్	867	866	1

అత్యాచారానికి ఒడిగట్టిన వారిలో కేటగిరీల వారీగా ఇలా..

అత్యాచారాలకు పాల్పడిన వారు: 29,900 మంది
- కుటుంబ సభ్యులు 2,196 మంది
- స్నేహితులు, ఆన్‌లైన్ స్నేహితులు, విడిపోయిన భర్తలు 13,822 మంది
- కుటుంబ స్నేహితులు, పొరుగింటి వారు, సహోద్యోగులు 12,855 మంది
- అపరిచితులు, ఇంకా గుర్తించని వారు 1,027 మంది

పని నుంచి బడికి..

విద్యార్థులుగా మారుతున్న బాల కార్మికులు.. 1506 మందికి వెట్టి నుంచి స్వేచ్ఛ

- రాష్ట్రానికి చెందిన 897 మందిని బడిలోకి చేర్చిన సీఐడీ
- సత్ఫలితాలనిస్తున్న ఆపరేషన్ స్వేచ్ఛ



సాక్షి, అమరావతి: అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన చెందిన నాని.. ఏడో తరగతి తర్వాత చదువు మానేశాడు. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా ఓ బైక్ మెకానిక్ షాపులో పనికి చేరాడు. రెండేళ్ల పాటు ఆ షాపులోనే సహాయకుడిగా పనిచేశాడు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు 'ఆపరేషన్ స్వేచ్ఛ' పేరిట అవగాహన కార్యక్రమాలను చేపడుతున్న సీఐడీ అధికారులు.. నానిని చూశారు. అతని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చదువు ఆవశ్యకతను వివరించారు. పిల్లల చదువుల కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వారికి అవగాహన కల్పించారు. నానిని అదే బడిలో 8వ తరగతిలో చేర్పించారు. ప్రస్తుతం నాని తోటి పిల్లలతో కలిసి చక్కగా చదువుకుంటున్నాడు. ఇక తాను పనికి వెళ్లనని, బాగా చదువుకుని ఉద్యోగం చేస్తానని ఆత్మ విశ్వాసంతో చెబుతున్నాడు.

బాల కార్మికుల నుంచి మళ్లీ విద్యార్థులుగా..

సామాజికబాధ్యత కింద బాల కార్మిక వ్యవస్థ నిర్మూల కోసం సీఐడీ చేపట్టిన 'ఆపరేషన్ స్వేచ్ఛ' సాధించిన విజయమిది. ఇలా ఒక్క నాని మాత్రమే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా బాల కార్మికులుగా మగ్గుతున్న అనేక మంది పిల్లలను సీఐడీ అధికారులు గుర్తించి వారిని మళ్లీ బడిలో చేర్పిస్తున్నారు. బాల కార్మికులుగా కష్టాల కడలిలో ఈదుతున్న వారిని సీఐడీ అధికారులు గుర్తించి సురక్షితంగా చదువుల తల్లి ఒడిలోకి చేర్చారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం బాల కార్మికుల జీవితాల్లో మళ్లీ విద్యా వెలుగులు తీసుకొస్తోంది. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని సీఐడీ విభాగం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందుకోసం 26 జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. సీఐడీ అధికారులతో పాటు మహిళా–శిశు సంక్షేమ శాఖ, బాలల సంక్షేమ కమిటీలు, వివిధ సామాజిక సేవా సంస్థల ప్రతినిధులతో జిల్లా స్థాయిల్లో కమిటీలను నియమించింది. ఈ ఏడాది మొత్తం నాలుగు దశల్లో 66 రోజుల పాటు ఆపరేషన్ స్వేచ్ఛ పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను సద్వినియోగం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి బాల కార్మికులను గుర్తించింది. ప్రధానంగా బాల కార్మికులను ఎక్కువగా పనిలో పెట్టుకునే ఇటుక బట్టీల తయారీ, హోటళ్లు, వివిధ పారిశ్రామిక యూనిట్లు, కిరాణా దుకాణాలు, మెకానిక్ షెడ్లు, ఇతర చోట్ల విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం ద్వారా మొత్తం 1,506 మంది బాల కార్మికులను గుర్తించింది. వారిలో బాలురు 1,299 మంది ఉండగా.. బాలికలు 207 మంది ఉన్నారు. మొత్తం బాల కార్మికుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన 609 మందిని వారి సొంత రాష్ట్రాలకు పంపించి తల్లిదండ్రుల చెంతకు చేర్చింది. మన రాష్ట్రానికి చెందిన 897 మంది బాల కార్మికుల తల్లిదండ్రులతో చర్చించి వారికి అవగాహన కల్పించి.. ఆ పిల్లలను మళ్లీ బడుల్లో చేర్పించింది.

సామాజిక, ఆర్థిక దృక్కోణంలో విశ్లేషణ..

బాల కార్మికులను గుర్తించి కేవలం మళ్లీ బడుల్లో చేర్చడమే కాదు.. ఈ సమస్య మూలాలను గుర్తించి శాశ్వత పరిష్కారం దిశగా సీఐడీ కార్యాచరణ చేపట్టింది. అందుకోసం బాల కార్మికుల సామాజిక, ఆర్థిక అంశాలపైనా విస్తృతంగా అధ్యయనం చేస్తోంది. తద్వారా బాల కార్మిక వ్యవస్థను సమూలంగా పెకలించి వేసి బడి ఈడు పిల్లలు అందరూ కచ్చితంగా బడుల్లోనే ఉండేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. బాల కార్మిక వ్యవస్థ నుంచి విముక్తి కల్పించిన బాలల వివరాలిలా ఉన్నాయి..

సమన్వయంతో సత్ఫలితాలు



బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించడానికి అన్ని విద్య, మహిళా–శిశు సంక్షేమ, గ్రామ, వార్డు సచివాలయాలు, ఇతర శాఖల సమన్వయంతో కార్యాచరణ చేపట్టాం. ఇతర రాష్ట్రాలకు చెందినవారిని ఆయా రాష్ట్రాలకు సురక్షితంగా చేరుస్తున్నాం. మన రాష్ట్రానికి చెందిన బాల కార్మికుల అవగాహనను పరీక్షించి తదనుగుణంగా తగిన తరగతిలో చేర్పిస్తున్నాం. మళ్లీ వారు పనిలోకి వెళ్లకుండా.. శ్రద్ధగా చదువుకునే వ్యవస్థను కల్పిస్తున్నాం.

– కేజీవీ సరిత, ఎస్పీ, మహిళా భద్రత విభాగం, సీఐడీ

సామాజిక బాధ్యతకు పెద్దపీట వేస్తున్న సీఐడీ



సీఐడీ విభాగం అంటే కేవలం కేసుల దర్యాప్తు, నేర నియంత్రణ మాత్రమే కాదు. సీఐడీకి అంతకు మించి విస్తృత పరిధి ఉంది. అందులో ప్రధానమైనది సామాజిక బాధ్యత. అందుకే బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. సీఐడీలో ప్రత్యేకంగా సామాజిక విభాగం కింద ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతాం.

– సంజయ్, సీఐడీ అదనపు డీజీ

బాల కార్మికులుగా మారడానికి కారణాలు

- తల్లిదండ్రులు లేకపోవడం: 36 మంది
- పరీక్షల్లో ఫెయిల్ కావడం 29 మంది
- పేదరికం: 984 మంది
- ఇతర కారణాలు: 457 మంది

మళ్లీ బడిలో చేరిన బాల కార్మికులు సామాజికవర్గాలవారీగా..

- ఎస్సీ 259 మంది
- ఎస్టీ 131 మంది
- బీసీ 719 మంది
- మైనార్టీ 190 మంది
- ఓసీ 207 మంది

మళ్లీ బడిలో చేర్పించే నాటికి బాల కార్మికులుగా పనిచేస్తున్నవారు..

- ఇటుక బట్టీల్లో 138 మంది
- హోటళ్లలో 117 మంది
- పారిశ్రామిక యూనిట్లలో 143 మంది
- ఇతర చోట్ల 1108 మంది

బాల కార్మికులుగా చేరేనాటికి వారి చదువులు ఇలా..

- నిరక్షరాస్యులు 264 మంది
- అయిదో తరగతిలోపు 270 మంది
- అయిదు నుంచి పదో తరగతి 792 మంది
- చెప్పలేనివారు 180 మంది

తెలంగాణ

ఎమ్మెల్యే లాస్యకు తప్పిన ముప్పు

- ఆస్పత్రి లిఫ్ట్‌లో ఇరుక్కున్న ఎమ్మెల్యే
- పరిమితికి మించడంతో కూలిన లిఫ్ట్
- క్షేమంగా బయటికి తీసుకొచ్చిన సిబ్బంది



లిఫ్ట్‌లో ఇరుక్కున్న ఎమ్మెల్యే లాస్య నందిత తదితరులు

కంటోన్మెంట్ (హైదరాబాద్‌): ఎమ్మెల్యే జి.లాస్య నందితకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బోయిన్‌పల్లిలో ఆదివారం ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. తక్షణమే స్పందించిన ఆసుపత్రి సిబ్బంది, ఎమ్మెల్యే అనుచరులు లిఫ్ట్ తలుపును తెరిచి ఆమెను బయటకు క్షేమంగా తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవలే ఆధునీకరించిన బోయిన్‌పల్లిలోని వీఆర్ ఆసుపత్రిలోని నూతన విభాగాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి.లాస్య నందిత హాజరయ్యారు. ఈ మేరకు ఆసుపత్రిలోని నాలుగో అంతస్తులోకి వెళ్లేందుకు గ్రౌండ్ ఫ్లోర్‌లో లిఫ్ట్ ఎక్కారు. ఆమెతో పాటు అనుచరులు పెద్ద సంఖ్యలో లిఫ్ట్ ఎక్కారు. పరిమితికి మించి లిఫ్ట్‌లోకి ఎక్కడంతో అది అదుపు తప్పి ఒక్కసారిగా సెల్లార్‌లోకి పడిపోయింది. ఎమ్మెల్యే సహా లిఫ్ట్‌లోని వారి హాహాకారాలు విన్న ఆసుపత్రి సిబ్బంది హుటాహుటిన సెల్లార్‌లోకి పరుగెత్తారు. లిఫ్ట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. దీంతో సెల్లార్‌లోని వంట సామగ్రితో లిఫ్ట్ తలుపును ధ్వంసం చేసి అందులో చిక్కుకుపోయిన ఎమ్మెల్యే లాస్య నందిత తదితరులను బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనతో ఆందోళనకు గురైన ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొనకుండానే వెనుదిరిగారు. ఆమె సోదరి నివేదిత ఆసుపత్రి నూతన విభాగాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

తెలంగాణ

ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుంటాం

- ఉద్యోగులు, నిరుద్యోగులకు ఎంతో చేసినా చెప్పుకోలేక వెనుకబడ్డాం
- మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్
- గెలుపునకు, ఓటమికి మధ్య ఓట్ల తేడా 1.85 శాతమే
- ఇది అపజయం కాదు.. స్పీడ్ బ్రేకర్ మాత్రమే



సాక్షి, హైదరాబాద్‌: ప్రతి గెలుపులో పాఠాలుంటే.. ఓటమిలో గుణపాఠాలు ఉంటాయని.. ఆ గుణపాఠాలు నేర్చుకుంటామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు చెప్పారు. దేశంలోనే ఉద్యోగులకు అత్యధిక జీతాలు ఇచ్చామని, నిరుద్యోగులకు అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని.. కానీ సరైన విధంగా ప్రచారం చేసుకోలేకపోయామని పేర్కొన్నారు. 'నిజం గడప దాటే లోపల.. అబద్ధం ఊరంతా తిరిగి వస్తుంద'న్న సామెత నిజమైందని.. కాంగ్రెస్ అబద్ధాలు, అలవిగాని హామీలను ప్రజలు నమ్మారని వ్యాఖ్యానించారు. యూట్యూబ్‌లో కొందరు బట్టగాల్చి మీదేసే ప్రయత్నం చేస్తే నివారించలేకపోయామని, దానితో నూ కొంత నష్టం జరిగిందన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో 'స్వేద పత్రం' పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన తర్వాత మీడియాతో చిట్‌చాట్ చేశారు. కేవలం 1.85శాతం ఓట్లతో తాము ఓడిపోయామని.. ఏడెనిమిది సీట్లు నాలుగైదు వేల ఓట్ల తేడాతో కోల్పోయామని చెప్పారు. ఇది ఘోర పరాజయం కాదని, ఒక స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని పేర్కొన్నారు. ''రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒకటే కోరుతున్నా. మీరు విజయవంతం కావాలని మేం కోరుకుంటున్నాం. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని కోరుతున్నాం. వందరోజుల్లో చాలా చేస్తామని చెప్పారు. వందరోజుల కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. తప్పకుండా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి. మొన్ననే నాలుక మడతేశారు. నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టినా.. ఉప ముఖ్యమంత్రి తాము ఆమాటే అనలేదన్నారు. ఇలా ఎన్నో ఉన్నాయి. ఆరు గ్యారంటీలు కాదు. 142 హామీలున్నాయి. వాటిని లెక్కతీశాం. మా పార్టీ తరఫున శాఖల వారీగా షాడో టీమ్‌లు ఏర్పాటు చేస్తాం. వేరే దేశాల్లో వాటిని షాడో కేబినెట్ అంటారు. అలాంటిదే మా లెజిస్లేచర్‌లో ఏర్పాటు చేసుకుంటాం. ప్రతి ప్రభుత్వ శాఖలో, ప్రతిరంగంలో సర్కారు పనితీరు.. వారు ఏం చేస్తున్నారు? ఏ నిర్ణయాలు తీసుకుంటున్నారు? తదితర అంశాలన్నింటినీ నిశితంగా గమనించి ప్రజలకు వివరిస్తాం..'' అని కేటీఆర్ చెప్పారు. దీప స్తంభంగా మారిన తెలంగాణను ఆరనివ్వబోమని, పడిపోనివ్వబోమని పేర్కొన్నారు. ''అధికారాన్ని ప్రజలకు సేవ చేసేందుకు, హామీలను నెరవేర్చేందుకు వినియోగిస్తారా? కక్ష సాధింపు కోసం వినియోగిస్తారా? అనేది వారి విజ్ఞత. ఏ విచారణ అయినా.. ఏ కమిషన్ అయినా.. ఏ రకమైన ఆదేశాలు ఇచ్చినా మాకు అభ్యంతరం లేదు. కావాలంటే విచారణ చేయాలని మేమే సభలో డిమాండ్ చేశాం. అన్నింటినీ న్యాయపరంగా ఎదుర్కొంటాం..'' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

మెరిసిన మెదక్ చర్చి



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ క్యాథడ్రల్ చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. ఆదివారం రంగురంగుల విద్యుద్దీపాలతో వెలుగులు విరజిమ్మింది. - మెదక్

నటి కృష్ణవేణి యువతకు ఆదర్శం

పర్యాటక శాఖ మంత్రి 'జూపల్లి'

బంజారాహిల్స్ (హైదరాబాద్‌): అలనాటి సినీనటి, గాయని, నిర్మాత కృష్ణవేణి యువతకు ఆదర్శనీయమని పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కృష్ణవేణి వంద ఏట అడుగిడిన సందర్భంగా బంజారాహిల్స్‌లోని ప్రసాద్ లాబ్స్ ప్రివ్యూ థియేటర్‌లో ఆదివారం ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'ఆకృతి' ఆధ్వర్యంలో ఆమె శత వసంత మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర రంగానికి కృష్ణవేణి చేసిన విస్తృత సేవలను కొనియాడారు. కృష్ణవేణి లాంటి సినీ దిగ్గజ నటిని సత్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సినీరంగానికి నంది అవార్డుల ప్రదానం గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని చెప్పారు. కృష్ణవేణిని గజమాల, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు, ఆకృతి సుధాకర్, సినీ ప్రముఖులు మురళీమోహన్, జయసుధ, రోజా రమణి పాల్గొన్నారు.

జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం

ఉమ్మడి పది జిల్లాలవారీగా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలిసారి జిల్లా ఇన్‌చార్జి మంత్రుల వ్యవస్థకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేబినెట్‌లోని మంత్రులందరికీ ఉమ్మడి పది జిల్లాలవారీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మినహా మిగతా 10 మంది మంత్రులను తలా ఓ జిల్లాకు ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. కేబినెట్‌లో ప్రాతినిధ్యం దక్కని హైదరాబాద్‌కు పొన్నం ప్రభాకర్, ఆదిలాబాద్‌కు సీతక్క, నిజామాబాద్‌కు జూపల్లి కృష్ణారావు, రంగారెడ్డికి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులను ఇన్‌చార్జి మంత్రులుగా బాధ్యతలు అప్పగించింది. కరీంనగర్‌కు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌కు దామోదర రాజనర్సింహ, ఖమ్మంకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వరంగల్‌కు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మెదక్‌కు కొండా సురేఖ, నల్లగొండకు తుమ్మల నాగేశ్వర్‌రావు ఇన్‌చార్జి మంత్రులుగా నియమితులయ్యారు

ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో పోలీసులకు– మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. దంతెవాడ జిల్లా కట్టేకళ్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమక్‌పాల్, దబ్బకున్న గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు తుమక్‌పాల్ క్యాంపునకు చెందిన బస్తర్ ఫైటర్స్, డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులకు దిగడంతో పోలీసులు సైతం ఎదురుకాల్పులు జరిపారు. ఎదురుకాల్పుల్లో ముగ్గురు దర్భా డివిజన్ కమిటీకి చెందిన మావోయిస్టులు మృతి చెందారని బస్తర్ రేంజ్ ఐజీ సుందరరాజ్ ఆదివారం చెప్పారు. కాగా, కాల్పులు జరిగిన ప్రాంతంలో పెద్దఎత్తున మందుగుండు సామగ్రి, ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతిచెందిన నక్సల్స్ వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

క్రిస్మస్ ప్రత్యేకం



దివిలోను.. భువిలోనా... సంబరం
క్రిస్మస్ పర్వదినం

క్రీస్తు పుట్టుక సర్వ సృష్టికి పర్వదినం.. మనుజ కుమారుడిగా ఆ దేవాది దేవుడే ఈ భూతలంపైకి అరుదెంచిన అపురూప ఘట్టం.
సర్వ మానవాళికి రక్షణ సౌభాగ్యం.
ప్రతి ఒక్కరికి దేవుడు అందించిన శుభదినం.

■ పరలోకం పరవశించిన వేళ

మానవాళి రక్షణకు యేసు జననం అనివార్యమయినప్పుడు అది విశ్వవేడుకగా మారిపోయింది. రెండు వేల సంవత్సరాల క్రితం ఆ దేవాదిదేవుడే నరరూపిగా అరుదెంచేందుకు సిద్ధపడ్డాడు. నశించిపోతున్న మానవులందరికి తనని తాను బలి అర్పణగా అర్పించుకునేందుకు సిద్ధపడ్డ కరుణామయుని జననం కోసం అటు పరలోకం ఇటు భూలోకం సమాయత్తమయ్యాయి. దైవ సంకల్పం నెరవేర్చేందుకు పరలోక దూతాళి దిగివచ్చింది. గలిలయలోని నజరేతు గ్రామంలో దావీదు వంశస్థుడైన యోసేపునకు ప్రదానం చేయబడిన కన్యయైన మరియ వద్దకు పరలోకం నుంచి ముందుగా శుభవార్త తీసుకువచ్చారు. దయాప్రాప్తురాలా నీకు శుభం. ఆ దేవాది దేవుని కృపపొందిన నీవు ఒక కుమారుని కంటావు.. ఆ శిశువు గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడతాడు ఆయన రాజ్యం అంతం లేనిదై ఉంటుంది. ఇదంతా పరిశుద్ధాత్మ ద్వారా జరుగుతుంది కాబట్టి నీవు భయపడాల్సిన పనిలేదు. సర్వోన్నతుని శక్తి నీకు తోడుగా ఉంటుందని అభయమిచ్చాడు. మరియతో పాటు దేవదూత యోసేపునకు స్వప్నమందు ప్రత్యక్షమై ఇదంతా దేవుని సంకల్పంతో జరుగుతుంది కాబట్టి నీ భార్యను చేర్చుకొనుటకు సందేహింప వద్దని, పుట్టబోవు శిశువు తన ప్రజలను వారి పాపాల నుంచి రక్షిస్తాడు కాబట్టి యేసు అని నామకరణం చేయాలని చెబుతాడు. ఈ విధంగా మానవ ప్రమేయం లేకుండా పరమ దేవుడు పరిశుద్ధాత్మ శక్తి తో మరియ ద్వారా అవని మీద అవతరించడానికి మార్గం సుగమం అయింది.

■ భూలోకం మైమరచిపోయిన వేళ

యేసు పుట్టుక సమయంలో యోసేపు మరియను తీసుకుని తన సొంత గ్రామమైన బెత్లెహేముకు బయలుదేరతాడు. నిండు చూలాలైన మరియకు స్థలం లేకపోవడం వలన ఓ పశువు పాకే ప్రభు జన్మస్థలమైంది. ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి ఓ సత్రములో పరుండియుండుట మీరు చూచెదరన్న ప్రవచనం ఆ విధంగా నెరవేరింది. ఆ రాత్రి ఊరి వెలుపల గొర్రెలు కాచుకుంటున్న కాపరులకు రక్షకుని జనన వార్త ముందుగా చేరింది. దేవదూత కాపరుల వద్దకు వచ్చి భయపడవద్దని, ప్రజలందరికి కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానం నేను మీకు తెచ్చానని దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కోసం పుట్టాడని ఆయన ప్రభువైన క్రీస్తని చెప్పాడు. ఆ సమయంలో దేవుని దగ్గర నుంచి పరలోక దూత సైన్య సమూహం దిగివచ్చి 'సర్వోన్నతమైన స్థలాలలో దేవునికి మహిమ ఆయనకిష్టులైన మనుష్యులకు భూమి మీద సమాధానం కలుగును గాక' అంటూ దేవునికి స్తోత్రాలు చెల్లిస్తూ పాటలు పాడారు.

ఇదే సమయంలో ఆకాశంలో ఓ అరుదైన వింతైన కాంతివంతమైన నక్షత్రము కనుగొని ముగ్గురు తూర్పుదేశపు జ్ఞానులు దానిని వెంబడించి బెత్లెహేము చేరుకొని ఇతడే యూదుల రాజంటూ అత్యానందభరితులై తాము తెచ్చిన బంగారం, సాంబ్రాణి, బోళము కానుకగా అర్పించి తిరిగి వెళతారు.

■ చీకటిని తరిమేసిన గొప్ప వెలుగు

క్రిస్మస్ ఈ లోకానికి ఎన్నో శుభములు సమకూర్చింది. చీకటితో నిండిన హృదయాలను వెలుగుతో నింపింది. ఆది మానవుడైన ఆదాము దేవుని ఆజ్ఞమీరి చీకటి అనే మరణాన్ని అందించాడు. అయితే ఆదాము చేసిన పాపం మానవుల మీద రాజ్యమేలకుండ ఉండటానికి దేవాది దేవుడే శరీరధారుడై ఈ భువికి ఏతెంచాల్సి వచ్చింది. పాపకూపములోకి దిగిపోకుండ నరుల ప్రాణము విమోచించేందుకు దేవుడు సల్పిన గొప్ప యాగమే క్రిస్మస్. వెలుగు రక్షణల సంగమం. ఇది ముందుగానే గ్రహించిన భక్తులు మరణములో నుండి నా ప్రాణమును తప్పించావు. జీవపు వెలుగులో దేవుని సన్నిధిని సంచరించునట్లు జారి పడకుండా నా పాదములు తప్పించావు అంటూ కొనియాడారు. యెషయా ప్రవక్త 'చీకటిలో నడుచు జనులు గొప్ప వెలుగు చూచుచున్నారు. మరణచ్ఛాయ గల దేశ నివాసుల మీద వెలుగు ప్రకాశించును' అంటూ ప్రవచించాడు. 'జనములు నీ వెలుగునకు వచ్చెదరు రాజులు నీ ఉదయ కాంతికి వచ్చెదరని' ప్రస్తుతించాడు. క్రీస్తు పుట్టుకతో ఈ ప్రవచనం నెరవేరింది. అనేక ప్రవచనాల నెరవేర్పు ఈ సమయంలో నెరవేరింది.

సాతాను చెరలో బందీలై చీకటిలో మగ్గే ప్రజలు వెలుగు క్రియలు ఇష్టపడని వారిని సైతం ప్రేమించి క్రీస్తు వెలుగు ప్రసాదించాడు. నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి ఉందురని ఏసు ప్రభువు చెప్పాడు. తనను అనుసరించే వారంతా వెలుగు సంబంధులుగా పేర్కొన్నాడు. నా యందు విశ్వాసముంచు ప్రతివాడు చీకటిలో నిలిచి యుండకుండునట్లు నేను ఈ లోకానికి వెలుగుగా వచ్చానని స్పష్టం చేశాడు. అంధకారమయమైన ప్రతి హృదయం వెలుగుతో ప్రకాశించడమే ఈ పర్వదినాన క్రీస్తు మనందరినుంచి కోరుకునేది. క్రీస్తు అందించే వెలుగు ఫలాలు మంచితనం, నీతి, సత్యం ఈ ఫలాలు భువిలో శాంతి సమాధానాలు వెదజల్లేందుకు దోహదం చేస్తాయి. క్రీస్తు వెలుగులోనున్న ప్రకారం మనం వెలుగులో నడిస్తే అన్యోన్య సహవాసము గలవారముగా ఈ భువిపైన జీవించగలం.

■ క్రిస్మస్ అంటే అంతులేని ఆనందం

క్రిస్మస్ ప్రతి హృదయంలో ఆనందంతో నింపుతుంది. ఆ రోజున తల్లి మరియ తండ్రి యేసేపు బెత్లెహేములోని పశుపాకలో పవళించిన బాల యేసుని చూసి మురిసిపోయారు. పరలోకం నుంచి వచ్చిన దూతల వర్తమానంతో తొలుత కలవరపడినా మానవ ప్రమేయం లేని దేవాదిదేవుని జననం ఆశ్చర్యాన్ని కలిగించినా ఏసు జననంతో వారు తమ ప్రయాస అంతా మరిచిపోయి లోక రక్షకుడ్ని చూసి మురిసిపోయారు. ఈ గొప్ప వేడుకలో అమితానందం ఎవరైనా పొందారంటే గొర్రెల కాపరులే. దేవుని దూతలు వచ్చి స్వయంగా క్రీస్తు జనన వార్త తెలపడంతో అమితాశ్చర్యం, ఆనందంలో తేలిపోయారు. దూర దేశం నుంచి వచ్చిన జ్ఞానులకు ఆకాశంలో అందమైన తార కనిపించడంతో సుదూర ప్రాంతం అతి ప్రయాసకోర్చి క్రీస్తును గాంచి అత్యానంద భరితులయ్యారు. రెండు వేల సంవత్సరాల క్రితం జరిగిన ఈ అద్భుతం క్రీస్తుని రక్షకుడిగా అంగీకరించిన ప్రతి హృదయంలో నేటికి జరుగుతుంది. అలా ఏసు పరలోకానికి భూలోకానికి వారధిగా నిలబడి ప్రతి హృదిని ఇప్పటికి వెలిగిస్తూనే ఉన్నాడు. అందుకే ఓ భక్తుడు ఇలా పాడాడు 'ఓ యేసు పాన్పుగనా ఆత్మ జేకొని శ్రేయముగ బవళించు శ్రీకర వరసుత' అని.



■ లోక రక్షకుడిగా అవతరించిన తరుణం

యేసు క్రీస్తు జననంలో గొర్రెల కాపరులతో దేవదూత అన్నమాట ఒకసారి గుర్తు చేసుకుంటే 'ఇది ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానం..దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు' అది కేవలం వారికే కాదు ఈ భూమి మీద ఉన్న వారందరికి శుభవార్త. ఈ లోకాన్ని ఎంతో ప్రేమించిన దేవుడు ఎవ్వరూ నశించిపోకుండా నిత్యజీవం అనుగ్రహించేందుకే ఏసుక్రీస్తును ఈ లోకానికి పంపాడు. రాజుల చేతనైనను నరుల చేతనైనను రక్షణ కలుగదు వారిని నమ్ముకొనవద్దని కీర్తనకారుడు చెప్పిన విధంగా మానవులందరి రక్షణకు కారణభూతుడగు దేవుడు చేసిన మహోపకారం. పాపం వల్ల వచ్చు జీతం మరణం. మనందరం అపరాధముల చేత, పాపం చేత చచ్చిన వారమై ఉండగా మనలను బతికించేందుకు నిత్యజీవం అనుగ్రహించేందుకు బలి అర్పణగా తనను తాను సమర్పించుకున్నాడు. ఆయన చేసిన ఆ గొప్ప ఉపకారం క్రీస్తు జన్మతోనే ప్రారంభమవడం అత్యంత ముదావహం.

అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు

– బందెల స్టెర్జిరాజన్

సినిమా

ఫారిన్‌కి వేళాయె!



● మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సినిమాకు గుమ్మడికాయ కొట్టే సమయం ఆసన్నమైంది. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా, హీరోయిన్ మీనాక్షీ చౌదరి, ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్‌లో జరుగుతోంది. మహేశ్ బాబుతో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా, ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారట యూనిట్. ఈ పాట పూర్తయితే షూటింగ్ దాదాపు పూర్తయినట్లేనని టాక్. చిన్న చిన్న ప్యాచ్ వర్క్‌లు కూడా కంప్లీట్ చేసి, ఈ నెలాఖరుకు 'గుంటూరు కారం' షూటింగ్ పూర్తి అయ్యేలా చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోందని తెలిసింది. అలాగే 'గుంటూరు కారం' సినిమా షూటింగ్ పూర్తికాగానే ఫ్యామిలీతో కలిసి ఫారిన్ వెకేషన్‌కు వెళతారట మహేశ్‌బాబు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అక్కడే చేసుకుంటారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఫారిన్ నుంచి తిరిగి రాగానే 'గుంటూరు కారం' ప్రమోషన్స్‌తో బిజీ అవుతారు మహేశ్. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్న 'గుంటూరు కారం' సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కానుంది.

మంగళూరులో భీమా



● గోపీచంద్

గోపీచంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భీమా'. ప్రముఖ కన్నడ దర్శకుడు ఎ.హర్ష తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్న 'భీమా' తాజా షెడ్యూల్ మంగళూరులో ఆదివారం ప్రారంభమైంది. ''యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. మాస్, యాక్షన్‌తో కూడిన ఈ సినిమాలో కుటుంబ ప్రేక్షకులను మెప్పించే అంశాలు ఉంటాయి. అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ మూవీ రూపొందుతోంది. మంగళూరులోని ఓ దట్టమైన అడవిలో గోపీచంద్‌తో పాటు ఇతర తారాగణంపై ఓ పాట, యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నాం. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏక కాలంలో జరుగుతున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె.గౌడ, సంగీతం: రవి బస్రూర్.

జాతర ముగిసింది!



● అల్లు అర్జున్

జాతరను పూర్తి చేశారట పుష్పరాజ్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. ఈ మూవీలోని తొలిపార్టు 'పుష్ప: ది రైజ్' 2021లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం 'పుష్ప' మలిభాగం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీవల్లి పాత్రలో హీరోయిన్ రష్మికా మందన్న నటిస్తున్నారు. కాగా 'పుష్ప: ది రూల్' సినిమాలో ఇంట్రవెల్ సమయంలో గంగమ్మ జాతర నేపథ్యంలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ ఉంటుంది. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఓ ప్రముఖ స్టూడియోలో మొదలైన ఈ జాతర సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ ముగిసిందని సమాచారం. ఆ తర్వాత అల్లు అర్జున్, రష్మికలపై కీలక సన్నివేశాలను కూడా చిత్రీకరించారని తెలిసింది. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్‌ను జనవరి మొదటివారంలో జరిగేలా చిత్రయూనిట్ ప్లాన్ చేసిందట. ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాని మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.



● పూజా హెగ్డే

నాకు సవాల్‌గా అనిపించింది

– ఇంద్రసేన



''ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న మోసాలు, బెదిరింపుల చుట్టూ అల్లుకున్న కథ 'బద్మాష్ గాళ్లకి బంపర్ ఆఫర్'. పూర్తి వినోదంతో పాటు పతాక సన్నివేశాల్లో మంచి సందేశం ఉంటుంది. ఈ సినిమా యువ తరంతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో ఇంద్రసేన అన్నారు. 'శాసనసభ' వంటి హిట్ చిత్రం తర్వాత ఇంద్రసేన నటించిన సినిమా 'బద్మాష్ గాళ్లకి బంపర్ ఆఫర్'. రవి చావలి దర్శకత్వం వహించారు. ఎస్.రమేష్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఇంద్రసేన మాట్లాడుతూ–''శాసనసభ' కంటే ముందే 'బద్మాష్ గాళ్లకి బంపర్ ఆఫర్' ఒప్పుకున్నా. రవిచావలి దర్శకత్వంలో నేను ఇంతకు ముందు 'సూపర్ స్కెచ్' సినిమాలో నటించాను. ఆయనలాంటి ప్రతిభ గల దర్శకుడితో రెండోసారి నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నా పాత్ర వినోదాత్మకంగా ఉంటుంది. ఈ పాత్ర నటుడిగా నాకు సవాల్‌గా అనిపించింది. ఈ చిత్రం కూడా నా కెరీర్‌ను మరో మెట్టు ఎక్కిస్తుంది. రమేష్ కుమార్‌గారు రాజీ పడకుండా ఈ మూవీ నిర్మించారు. విజయ్ సి. కుమార్ కెమెరా, భోలే షావలి సంగీతం, మార్తాండ్ కె.వెంకటేష్ ఎడిటింగ్ ఈ సినిమాకు అదనపు బలాలు. నా పాత్ర, కథ నచ్చితే విలన్‌గా నటిస్తాను. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రానున్న చిత్రంలో నెగిటివ్ రోల్‌లో కనిపించబోతున్నాను. నేను హీరోగా రెండు చిత్రాలు త్వరలో ప్రారంభం కానున్నాయి'' అన్నారు.

చందమామ కోపం



● ధనుష్

నటుడిగా ఫుల్ బిజీగా ఉంటుంటారు హీరో ధనుష్. వీలైనప్పుడు దర్శకుడిగా, నిర్మాతగా కూడా సినిమాలు చేస్తుంటారాయన. 2017లో వచ్చిన 'పా. పాండి' చిత్రం దర్శకుడిగా ధనుష్‌కు తొలి మూవీ. కాగా తన కెరీర్‌లో 50వ సినిమాలో(డి50 వర్కింగ్ టైటిల్) నటించి, దర్శకత్వం వహించారు ధనుష్. ఈ సినిమా విడుదల కాకముందే తన దర్శకత్వంలో మూడో సినిమాకు 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్' (చందమామకు నా మీద ఎందుకు కోపం అని అర్థం) టైటిల్ ఖరారైనట్లు వెల్లడించి, ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను షేర్ చేశారు ధనుష్. 'యాన్ యూజువల్ లవ్‌స్టోరీ' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. పవీష్, అనిఖా, మాథ్యూ థామస్, ప్రియా వారియర్, రబియా, వెంకీ, రమ్య ప్రధాన పాత్రల్లో నటించనున్న ఈ సినిమాకు జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇక నటుడిగా ధనుష్ చేసిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రం ఈ సంక్రాంతికి విడుదల కానుంది. తెలుగు దర్శకుడు శేఖర్ కమ్ములతో చేయాల్సిన సినిమాతో పాటుగా, తమిళ, హిందీ భాషల్లో వరుస సినిమాల్లో నటించేందుకు ధనుష్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

పరిశోధన మొదలు



● షాహిద్ కపూర్

షాహిద్ కపూర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవా'. ఈ మూవీలో పూజాహెగ్డే హీరోయిన్. ఈ చిత్రంతో మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రూస్ బాలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. ఇటీవల ముంబైలో మొదలైన తొలి షెడ్యూల్ షూటింగ్ పూర్తి అయింది. వరుణ్–పూజ కాంబినేషన్‌లో కొన్ని కీలక సన్నివేశాలతో పాటుగా ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను దర్శకుడు రోషన్ చిత్రీకరించారని బీ టౌన్ టాక్. ''దేవా' తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది'' అంటూ చిత్రయూనిట్ వెల్లడించింది. ఈ చిత్రంలో ఓ పోలీస్ ఉన్నతాధికారి హత్య కేసును పరిశోధన చేసే పోలీస్ దేవాగా షాహిద్‌కపూర్ నటిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. జీ స్టూడియోస్, రాయ్‌కపూర్ ఫిలింస్ నిర్మిస్తున్న 'దేవా' 2024 దసరా సందర్భంగా విడుదల కానుంది.

పర్యావరణం నేపథ్యంలో...



● ఆదిత్య ఓం

సింగిల్ క్యారెక్టర్‌తో సాగే సినిమా 'బందీ'. ఇందులో ఆదిత్య ఓం నటించారు. తిరు రఘు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. దగ్గు వెంకటేశ్వర రావు ఈ సినిమాకు మరో నిర్మాత. ''దేశంలోని పలు అటవీ ప్రాంతాల్లో ఈ సినిమా తీశాం. ఎలాంటి డూప్ లేకుండా ఆదిత్య అన్ని రకాల స్టంట్స్‌ను ఈ సినిమా కోసం చేశారు. ఓ ఏడాదిలో ఉండే అన్ని ఋతువులను కవర్ చేయడానికి, మూడు సంవత్సరాలు కష్టపడి ఈ సినిమా తీశాం. పర్యావరణ సంరక్షణ అంశంపై తీసిన ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

వైవిధ్యమైన కథతో...



● రఘు కుంచె

నూతన ప్రతిభావంతులను ప్రోత్సహిస్తూ, సరికొత్త చిత్రాలను నిర్మించాలనే ఉద్దేశంతో ఏఏ క్రియేషన్స్, ఆర్‌కే సినిమా కలయికలో నూతన చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఫణి ముత్యాల, రఘు కుంచె నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ మూవీ ద్వారా సూర్య ప్రకాష్ వేద దర్శకుడిగా పరిచయమవుతున్నారు. హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రారంభోత్సవం జరుపుకుంది. ''వైవిధ్యమైన కథతో ఈ మూవీ తెరకెక్కనుంది. జనవరి నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను స్టార్ట్ చేసి ఏకధాటిగా చిత్రీకరణ జరపాలని ప్రణాళిక సిద్ధం చేశాం. ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జగన్ చావలి, సంగీతం: రఘు కుంచె.



సింగిల్స్ విజేత సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సహజ యామలపల్లి చాంపియన్‌గా అవతరించింది. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో సహజ 6-4, 6-3తో రెండో సీడ్ ఎకతెరీనా మకరోవా (రష్యా)పై సంచలన విజయం సాధించింది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. సహజ కెరీర్‌లో ఇది మూడో ఐటీఎఫ్ సింగిల్స్ టైటిల్. గత ఏడాది ఆమె గురుగ్రామ్, నాగ్‌పూర్‌లలో జరిగిన టోర్నీల్లో విజేతగా నిలిచింది.

ఇంగ్లండ్ అసిస్టెంట్ కోచ్‌గా పొలార్డ్

వెస్టిండీస్ మాజీ కెప్టెన్ కీరన్ పొలార్డ్ ఇంగ్లండ్ క్రికెట్ జట్టు కోచింగ్ బృందంలో చేరాడు. వచ్చే ఏడాది విండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమివ్వబోయే టి20 ప్రపంచకప్ కోసం అతన్ని ఇంగ్లండ్ జట్టు అసిస్టెంట్ కోచ్‌గా నియమించారు. టి20 కెరీర్‌లో పొలార్డ్ అంతర్జాతీయ మ్యాచ్‌లు సహా ఫ్రాంచైజీ లీగ్, దేశవాళీ, క్లబ్ ఇలా మొత్తం కలిపి 637 మ్యాచ్‌లు ఆడాడు.



పవన్ పోరాటం వృథా

తెలుగు టైటాన్స్‌కు ఆరో ఓటమి

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో వరుసగా ఐదు పరాజయాల తర్వాత ఆరో మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టిన తెలుగు టైటాన్స్ మళ్లీ ఓటమి బాటలోకి వెళ్లింది. ఆదివారం జరిగిన తమ ఏడో మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 31-33తో బెంగళూరు బుల్స్ చేతిలో పోరాడి ఓడిపోయింది. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ అత్యధికంగా 13 పాయింట్లు స్కోరు చేసిన తన జట్టును గెలిపించలేకపోయాడు. అజిత్ పవార్ 5 పాయింట్లు, రజనీశ్ 3 పాయింట్లు సాధించారు. బెంగళూరు బుల్స్ తరఫున సుర్జీత్ సింగ్ (7), భరత్ (6), వికాశ్ కండోలా (5), నీరజ్ నర్వాల్ (5) రాణించారు. మరో మ్యాచ్‌లో యు ముంబా 39-37తో బెంగాల్ వారియర్స్ జట్టును ఓడించింది. యు ముంబా జట్టు తరఫున అమీర్ మొహమ్మద్ 8 పాయింట్లు, గుమన్ సింగ్ 6 పాయింట్లు సాధించారు. వారియర్స్ తరఫున మణీందర్ సింగ్ అత్యధికంగా 11 పాయింట్లు స్కోరు చేశాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో దబంగ్ ఢిల్లీ; తమిళ్ తలైవాస్‌తో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.


పవన్

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	6	5	1	0	26
జైపూర్ పింక్ పాంథర్స్	7	4	2	1	25
గుజరాత్ జెయింట్స్	7	4	3	0	23
బెంగాల్ వారియర్స్	7	3	2	2	22
యు ముంబా	6	4	2	0	21
హరియాణా స్టీలర్స్	6	4	2	0	21
బెంగళూరు బుల్స్	8	3	5	0	19
పట్నా పైరేట్స్	6	3	3	0	17
యూపీ యోధాస్	7	2	4	1	15
దబంగ్ ఢిల్లీ	5	2	3	0	12
తమిళ్ తలైవాస్	6	2	4	0	11
తెలుగు టైటాన్స్	7	1	6	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు



ఆసీస్‌ను ఓడించాం

తొలిసారి టెస్టు ఫార్మాట్‌లో ఆస్ట్రేలియాపై గెలిచిన భారత మహిళల జట్టు

ముంబై: సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. ఎట్టకేలకు పద కొండో ప్రయత్నంలో ఆస్ట్రేలియా మహిళల జట్టుపై భారత జట్టు తొలిసారి టెస్టు విజయాన్ని అందుకుంది. ఇక్కడి వాంఖెడె మైదానంలో ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగు రోజుల ఏకైక టెస్టులో భారత జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా సమష్టిగా ఆడితే ఎంతటి మేటి జట్టునైనా ఓడించవచ్చని హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం నిరూపించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 75 పరుగుల విజయలక్ష్యాన్ని టీమిండియా 18.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించి గెలిచింది. మ్యాచ్ మొత్తంలో ఏడు వికెట్లు తీసిన భారత ఆఫ్ స్పిన్నర్ స్నేహ్ రాణాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. పటిష్టమైన ఇంగ్లండ్‌తో గత ఆదివారం డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన ఏకైక టెస్టులో 347 పరుగుల తేడాతో రికార్డు విజయం సాధించిన భారత జట్టు... వారం తిరిగేలోపు మరో మేటి జట్టు ఆస్ట్రేలియాను బోల్తా కొట్టించి ఈ ఏడాదిని దిగ్విజయంగా ముగించింది.

రాణించిన స్నేహ్, రాజేశ్వరి

ఆట చివరిరోజు ఓవర్‌నైట్ స్కోరు 233/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా కేవలం 28 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయి 261 పరుగుల వద్ద ఆలౌటైంది. యాష్లే గార్డ్‌నర్ (7)ను ఆట రెండో ఓవర్‌లోనే పూజ వస్త్రకర్ వికెట్లముందు దొరకబుచ్చుకోవడంతో ఆసీస్ పతనం మొదలైంది. మరోవైపు క్రీజులో పాతుకుపోయిన అనాబెల్ సదర్లాండ్ (102 బంతుల్లో 27; 3 ఫోర్లు)ను...అలానా కింగ్ (0)ను వరుస బంతుల్లో స్నేహ్ రాణా అవుట్ చేయడంతో ఆసీస్ ఇన్నింగ్స్ ఎక్కువసేపు కొనసాగలేదు. చివరి రెండు వికెట్లను రాజేశ్వరి గైక్వాడ్ తీయడంతో ఆసీస్ ఇన్నింగ్స్ 261 పరుగులవద్ద ముగిసింది. 75 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు తొలి ఓవర్‌లోనే దెబ్బ పడింది. షఫాలీ వర్మ (4) నాలుగో బంతికి పెవిలియన్ చేరింది. ఆ తర్వాత రిచా ఘోష్ (32 బంతుల్లో 13; 3 ఫోర్లు)తో కలిసి స్మృతి మంధాన (61 బంతుల్లో 38 నాటౌట్; 6 ఫోర్లు) రెండో వికెట్‌కు 51 పరుగులు జోడించింది. రిచా అవుటయ్యాక జెమీమా రోడ్రిగ్స్ (15 బంతుల్లో 12 నాటౌట్; 2 ఫోర్లు)తో కలిసి స్మృతి భారత్‌ను విజయతీరానికి చేర్చింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 219; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 406; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** బెత్ మూనీ (రనౌట్) 33; లిచ్‌ఫెల్డ్ (బి) స్నేహ్ రాణా 18; ఎలీస్ పెరీ (సి) యస్తిక (బి) స్నేహ్ రాణా 45; తాలియా మెక్‌గ్రాత్ (బి) హర్మన్‌ప్రీత్ 73; అలీసా హీలీ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్మన్‌ప్రీత్ 32; అనాబెల్ సదర్లాండ్ (సి) యస్తిక (బి) స్నేహ్ రాణా 27; యాష్లే గార్డ్‌నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పూజ 7; జెస్ జొనాసెన్ (బి) రాజేశ్వరి 9; అలానా కింగ్ (బి) స్నేహ్ రాణా 0; కిమ్ గార్త్ (బి) రాజేశ్వరి 4; లారెన్ చీట్లె (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (105.4 ఓవర్లలో ఆలౌట్) 261. వికెట్ల పతనం:** 1-49, 2-56, 3-140, 4-206, 5-221, 6-233, 7-251, 8-251, 9-260, 10-261. **బౌలింగ్:** రేణుక 11-4-32-0, పూజ వస్త్రకర్ 11-1-40-1, స్నేహ్ రాణా 22-5-66-4, దీప్తి శర్మ 22-7-35-0, రాజేశ్వరి గైక్వాడ్ 28.4-11 -42-2, జెమీమా 2-0-13-0, హర్మన్‌ప్రీత్ 9-0-23-2.

భారత్ రెండో ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (సి) అలీసా (బి) గార్త్ 4; స్మృతి మంధాన (నాటౌట్) 38; రిచా ఘోష్ (సి) తాలియా (బి) గార్డ్‌నర్ 13; జెమీమా (నాటౌట్)12; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (18.4 ఓవర్లలో రెండు వికెట్లకు) 75. వికెట్ల పతనం:** 1-4, 2-55. **బౌలింగ్:** కిమ్ గార్త్ 5-1-19-1, యాష్లే గార్డ్‌నర్ 9-2-18-1, తాలియా 2-0-14-0, జెస్ జొనాసెన్ 2.4-0-16-0.

7 ఓవరాల్‌గా టెస్టు ఫార్మాట్‌లో భారత మహిళల జట్టు గెలిచిన టెస్టుల సంఖ్య. 1976 నుంచి 2023 వరకు భారత జట్టు 40 టెస్టులు ఆడింది. ఇందులో ఏడింటిలో గెలిచి, ఆరింటిలో ఓడిపోయింది. మిగతా 27 మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి.

11 ఆస్ట్రేలియా జట్టుతో 1977 నుంచి 2023 మధ్యకాలంలో భారత్ 11 టెస్టులు ఆడింది. ఈ మ్యాచ్‌కు ముందు ఆస్ట్రేలియా చేతిలో భారత్ నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి, ఆరింటిని 'డ్రా' చేసుకుంది.

2 స్వదేశంలో భారత జట్టు ఒకే ఏడాది రెండు టెస్టుల్లో గెలవడం ఇదే తొలిసారి. భారత్ నెగ్గిన ఏడు టెస్టుల్లో నాలుగు స్వదేశంలో, మూడు విదేశీ గడ్డపై వచ్చాయి. హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీలో భారత జట్టు ఆడిన రెండు టెస్టుల్లోనూ నెగ్గడం విశేషం.

9 గత 17 ఏళ్లలో భారత జట్టు తొమ్మిది టెస్టులు ఆడింది. ఇందులో ఒక టెస్టులో ఓడి, ఐదు టెస్టుల్లో గెలిచి, మూడింటిని 'డ్రా' చేసుకుంది.

రెజ్లింగ్ సమాఖ్యపై వేటు

కొత్త అధ్యక్షుడి ఏకపక్ష విధానంపై ఆగ్రహం

• కేంద్ర క్రీడాశాఖ అనూహ్య నిర్ణయం

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) ఓ అడుగు ముందుకేస్తే... రెండడుగులు వెనక్కి అన్నట్లుంది వ్యవహారం. మహిళా రెజ్లర్ల పోరాటం, పోలీసు కేసులు, హైకోర్టు స్టేలను దాటుకొని ఎట్టకేలకు సమాఖ్యకు ఎన్నికలు జరిగి, కొత్త కార్యవర్గం ఏర్పాటైందన్న ముచ్చట మూణ్నాళ్ల ముచ్చటే అయింది. డబ్ల్యూఎఫ్‌ఐపై కేంద్ర క్రీడాశాఖ సస్పెన్షన్ వేటు వేసింది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న బ్రిజ్‌భూషణ్‌కు విధేయుడైన సంజయ్ సింగ్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన ఇలా ఎన్నికయ్యారో లేదో అప్పుడే స్వామిభక్తి మొదలుపెట్టారు. అండర్-15, అండర్-20 జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలను బ్రిజ్‌భూషణ్ హవా నడిచే గోండా (యూపీ) పట్టణంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ ఏకపక్ష విధానంపై కేంద్ర క్రీడాశాఖకు డబ్ల్యూఎఫ్‌ఐ కార్యదర్శి ప్రేమ్‌చంద్ ఫిర్యాదు చేయడంతో వెంటనే సమాఖ్యను సస్పెండ్ చేసింది. 'కొత్త కార్యవర్గం ఏకపక్ష నిర్ణయంతో డబ్ల్యూఎఫ్‌ఐ నియమావళిని అతిక్రమించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో సస్పెన్షన్ వేటు వేశాం. ఇది అమల్లో ఉన్నంతవరకు సమాఖ్య రోజువారీ వ్యవహారాలను పర్యవేక్షించే అధికారం లేదు' అని క్రీడాశాఖ వర్గాలు వెల్లడించాయి. జాతీయ స్థాయిలో నిర్వహించే ఏ జూనియర్, సబ్-జూనియర్, సీనియర్ టోర్నమెంట్ అయినా యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిబంధనల ప్రకారం ఎగ్జిక్యూటివ్ కమిటీలోనే చర్చించి నిర్ణయించాలి. కానీ సంజయ్ మితిమీరిన స్వామిభక్తితో ఏకపక్ష నిర్ణయం తీసుకొని అడ్డంగా బుక్కయ్యారు. తాజా సస్పెన్షన్‌తో గోండాలో ఈనెల 28 నుంచి 30 వరకు జరగాల్సిన పోటీలు వాయిదా పడ్డాయి.



"సస్పెన్షన్‌ను ఎత్తేయాలని కేంద్ర క్రీడా శాఖను కోరుతున్నాం. మాకు సమయమిస్తే నిర్ణయాలు తీసుకోవడంలో నిబంధనల్ని అతిక్రమించ లేదని నిరూపిస్తాం. కాదని సస్పెన్షన్‌ను కొనసాగిస్తే మాత్రం సహించం. కోర్టులోనే తేల్చుకుంటాం. టోర్నీల నిర్వహణ విషయంలో డబ్ల్యూఎఫ్‌ఐ 'నియామావళి' ప్రకారమే నిర్ణయాలు తీసుకున్నాం. ఇది నా ఒక్కడి ఏకపక్ష నిర్ణయం కానేకాదు. 24 రాష్ట్ర సంఘాలను సంప్రదించిన మీదటే టోర్నీ ఆతిథ్య వేదికను ఖరారు చేశాం. అన్నింటికి ఈ-మెయిల్ సాక్ష్యాలున్నాయి. కావాలంటే వీటిని నిరూపిస్తాం.

–సంజయ్ సింగ్, డబ్ల్యూఎఫ్‌ఐ కొత్త అధ్యక్షుడు



నేను 12 ఏళ్ల పాటు సమాఖ్యకు సేవలందించాను. మంచో, చెడో ఏం చేశానో కాలమే సమాధానమిస్తుంది. ఇప్పుడైతే నేను రెజ్లింగ్ నుంచి రిటైర్ అయ్యాను. సమాఖ్యతో సంబంధాల్ని పూర్తిగా తెంచుకున్నాను. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల (లోక్‌సభ)పైనే దృష్టి పెట్టాను. డబ్ల్యూఎఫ్‌ఐలో ఏం జరిగినా అది కొత్త కార్యవర్గానికి చెందిన వ్యవహారమే తప్ప నాకు సంబంధించింది కాదు."

–బ్రిజ్‌భూషణ్, డబ్ల్యూఎఫ్‌ఐ మాజీ అధ్యక్షుడు



రెజ్లర్లు ఏమన్నారంటే...

రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్ సస్పెన్షన్‌ను స్వాగతించారు. 'డబ్ల్యూఎఫ్‌ఐ మంచికి ఇది తొలి అడుగుగా భావిస్తున్నా. మేం ఎందుకిలా పోరాడుతున్నామనే విషయం ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వానికి బోధపడుతుందని ఆశిస్తున్నా. మహిళా అధ్యక్షురాలుంటే దేశంలోని అమ్మాయిలకెంతో మేలు జరుగుతుంది' అని ఆమె అన్నారు. 'పద్మశ్రీ'ని వెనక్కిచ్చిన టోక్యో ఒలింపిక్స్ పతక విజేత బజరంగ్ పూనియా మాట్లాడుతూ 'ఇప్పటికే నా పురస్కారాన్ని తిరిగిచ్చేశాను. మళ్లీ ఆ అవార్డును స్వీకరించే యోచన లేదు. మాకు న్యాయం జరిగినపుడు 'పద్మశ్రీ'ని తీసుకుంటా. మన అక్కాచెల్లెళ్లు, కుమార్తెల గౌరవం కంటే ఏ అవార్డు పెద్దది కాదు. ప్రస్తుతం సమాఖ్య వ్యవహారాల్ని అందరు గమనిస్తున్నారు' అని అన్నారు.

భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(1), 2024.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ)-2024(1) నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అవివాహిత పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 457
» **అర్హతలు:** మిలిటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. నావల్ అకాడమీ ఉద్యోగాలకు ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు అర్హులు. ఎయిర్‌ఫోర్స్ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి. ఓటీఏ ఎస్ఎస్‌సీ నాన్ టెక్నికల్ పోస్టులకు మాత్రమే మహిళలు అర్హులు. చివరి సంవత్సరం పరీక్షలు రాసి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.01.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 10.01.2024 నుంచి 16.01.2024 వరకు
» **పరీక్ష తేది:** 21.04.2024.
» **వెబ్‌సైట్:** http://upsc.gov.in

యూపీఎస్సీ- ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ ఎగ్జామినేషన్(1) 2024

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. 2024 సంవత్సరానికి సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) మొదటి విడత నోటిఫికేషన్ వెలువడింది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 400
» **కోర్సులు:** నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ), ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ, నేవీ 10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ పరీక్షలో మెరిట్ సాధిస్తే డిగ్రీ కోర్సులకు ఎంపికవుతారు. అలా ఎంపికైనవారు బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సుల్లో తాము ఎంచుకున్న దాన్ని ఉచితంగా చదవచ్చు.
» **అర్హత:** ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు ఏదైనా గ్రూపులో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్‌ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(ఇండియన్ నేవల్ అకాడమీ) ద్వారా దరఖాస్తు చేయాలనుకుంటే.. ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీనితో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నవారు అర్హులే.
» **వయసు:** 02.07.2005కి ముందు 01.07.2008కి తర్వాత జన్మించి ఉండకూడదు.
» **ఎంపిక విధానం:** అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. రాతపరీక్ష, ఇంటెలిజెన్స్-పర్సనాలిటీ టెస్ట్,ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు. రాత పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.01.2024.
» **ఉపసంహరణ తేదీలు:** 10.01.2024 నుంచి 16.01.2024 వరకు
» **ఆన్‌లైన్ రాతపరీక్ష:** 21.04.2024.
» **వెబ్‌సైట్:** http://upsc.gov.in

నంద్యాల జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 13 ఆఫీస్ స్టాఫ్ పోస్టులు

నంద్యాల జిల్లా సాంకేతిక విద్యా శాఖ బేతంచర్లలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
» **పోస్టుల వివరాలు:** గ్రేడ్2 ల్యాబ్ అటెండర్-05, గ్రేడ్2 ఆఫీస్ సబార్డినేట్-03, గ్రేడ్3 వాచ్‌మెన్-02, గ్రేడ్ 8 వెంజర్-01, గ్రేడ్8 స్వీపర్-01, టెక్నికల్ ఎలక్ట్రీషియన్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఐదో, ఏడు, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రభుత్వ పాలిటెక్నిక్, బేతంచెర్ల, నంద్యాల జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 26.12.2023.
» **వెబ్‌సైట్:** https://nandyal.ap.gov.in

సీసీఎంబీ,హైదరాబాద్‌లో 15 పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ(సీసీఎంబీ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్1-04, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్-03, రీసెర్చ్ అసోసియేట్1-01, ప్రాజెక్ట్ సైంటిస్ట్1-01, ప్రాజెక్ట్ సైంటిస్ట్1-01, సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-02, రీసెర్చ్ అసోసియేట్-01, సీనియర్ రీసెర్చ్ ఫెలో-01, జూనియర్ రీసెర్చ్ ఫెలో-01, ప్రాజెక్ట్ అసోసియేట్1-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:**పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.12.2023.
» **వెబ్‌సైట్:** www.ccmb.res.in

ఇంటర్వ్యూలో మెరిసేలా!

» సివిల్స్-2023 మెయిన్స్ ఫలితాల వెల్లడి
» జనవరి 2వ తేదీ నుంచి పర్సనాలిటీ టెస్ట్
» ఇందులో ప్రతిభతోనే తుది నియామకాలు
» భావ వ్యక్తీకరణ, విశ్లేషణ నైపుణ్యాలతో విజయం

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి.. 21 కేంద్ర సర్వీసుల్లో అధికారుల ఎంపికకు చేపట్టే నియామక ప్రక్రియ! ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ.. ఇలా మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. సివిల్స్ 2023కి సంబంధించి రెండో దశ. మెయిన్ ఎగ్జామినేషన్ ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. ఎంపిక ప్రక్రియలో అత్యంత కీలకమైన చివరి దశ ఇంటర్వ్యూలు (పర్సనాలిటీ టెస్ట్).. జనవరి 2 నుంచి ప్రారంభమవుతాయని యూపీఎస్సీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్‌లో సత్తా చాటి తుది విజేతలుగా నిలిచేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..

సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 275. ఇందులో పది, పదిహేను మార్కుల వ్యత్యాసంతో సర్వీసులు, ర్యాంకులు తారుమారు అయ్యే పరిస్థితి ఉంటుంది. రాత పరీక్షలో తక్కువ మార్కులు వచ్చినా.. ఇంటర్వ్యూలో ఎక్కువ మార్కుల సాధించి.. తుది ఫలితాల్లో మంచి సర్వీసులు పొందిన వారు ఎందరో! కాబట్టి మెయిన్స్ విజేతలు..ఇంటర్వ్యూలో రాణించేందుకు సమగ్రంగా సన్నద్ధమవ్వాలి అంటున్నారు నిపుణులు.

2,916 మంది ఎంపిక

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2023కు సంబంధించి.. చివరి దశ పర్సనాలిటీ టెస్ట్/ ఇంటర్వ్యూకు మొత్తం 2,916 మంది ఎంపికయ్యారు. వీరిలో తెలుగు రాష్ట్రాలు(ఏపీ, తెలంగాణ) నుంచి 80 నుంచి 100 మంది వరకు ఉంటారని అంచనా. యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ 2023 నోటిఫికేషన్‌లో మొత్తం 1,105 పోస్ట్‌లను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.

ప్రత్యేక దృష్టి

సివిల్స్ ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ అకడమిక్ నేపథ్యం,ఉద్యోగం చేస్తున్నట్లయితే ప్రొఫెషన్, కుటుంబ నేపథ్యం, స్థానిక రాష్ట్రం తదితర అన్ని అంశాలపై దృష్టి పెట్టాలి. వీటితోపాటు మెయిన్ ఎగ్జామ్‌కు ముందు అందించిన డీఏఎఫ్-1, ఇంటర్వ్యూకు ముందు ఇవ్వాల్సిన డీఏఎఫ్-2లలో పొందుపరిచిన వివరాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి.

మీ గురించి చెప్పండి

ముందుగా 'మీ గురించి చెప్పండి'అంటూ.. బోర్డ్ అడిగే ప్రశ్నకు మెప్పించే విధంగా సమాధానం చెప్పేలా అభ్యర్థులు సన్నద్ధం కావాలి. ఆ తర్వాత డీఏఎఫ్‌లో పేర్కొన్న అంశాలు, సర్వీస్ ప్రాథమ్యతలు, సమకాలీన అంశాలపై ఇంటర్వ్యూ కొనసాగుతుంది. సివిల్ సర్వీసెస్‌నే ఎంపిక చేసుకోవడానికి కారణం ఏంటి? అనే ప్రశ్న సాధారణంగా ఎదురవుతుంది. చాలా మంది ఈ ప్రశ్నకు సామాజిక సేవ లక్ష్యం అనే సమాధానం చెబుతుంటారు. అయితే ఈ సమాధానాన్ని బలపరచుకునే సపోర్టింగ్ పాయింట్స్ సిద్ధం చేసుకోవాలి.

సమకాలీన అంశాలపై పట్టు

అభ్యర్థులు తమ ఇంటర్వ్యూ తేదీ వరకు జరిగే సమకాలీన అంశాలపై పట్టు సాధించాలి. ఎందుకంటే..'ఈ రోజు పేపర్‌లోని ముఖ్య వార్తలు ఏంటి? మిమ్మల్ని బాగా ఆకట్టుకున్న వార్త ఏంటి? అందుకు కారణం.. ఆ వార్త ప్రాధాన్యం? తదితర ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు ఇంటర్వ్యూ రోజున కూడా కనీసం రెండు ప్రామాణిక దినపత్రికల చదవాలి. వాటిలో ముఖ్యమైన అంశాలకు సంబంధించిన వివరాలు గ్రహించాలి.



ముఖ్యంగా ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, గాజా ఉద్రిక్తతలు, మన విదేశాంగ విధానం, జీ-20 నిర్వహణ, పొరుగుదేశాలతో దౌత్య సంబంధాలపై స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవాలి. జాతీయ స్థాయిలో ఇటీవల చర్చనీయాంశంగా మారుతున్న అంశాల(ఉదా: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ఎల్ఐసీ ఐపీఓ, బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు తదితర) గురించి అన్ని కోణాల్లో తెలుసుకోవాలి.

భౌగోళిక నేపథ్యం

సివిల్స్ ఇంటర్వ్యూకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు తమ భౌగోళిక నేపథ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. తమ స్వస్థలానికి సంబంధించి ఏదైనా సామాజిక, చారిత్రక ప్రాధాన్యం ఉంటే దాని గురించి తెలుసుకోవాలి. అదే విధంగా ప్రస్తుతం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అభ్యర్థులు ఇచ్చే సమాధానాలను సైతం రాబట్టేలా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి స్థానిక పరిస్థితులు, సమస్యలపై అవగాహనతోపాటు, పరిష్కార మార్గాలతో సన్నద్ధంగా ఉండాలి.

అలవాట్లు.. అప్రమత్తంగా

సివిల్స్ ఇంటర్వ్యూ అభ్యర్థులు.. తాము అప్లికేషన్‌లో పేర్కొన్న హాబీలపై ఇప్పటి నుంచే ప్రత్యేకంగా కసరత్తు చేయాలి. చాలామంది బుక్ రీడింగ్, వాచింగ్ టీవీ, సింగింగ్, ప్లేయింగ్, మూవీస్ వంటి వాటిని పేర్కొంటారు. ఇంటర్వ్యూ సమయంలో వీటిపైనా ప్రశ్నలు అడుగుతారనే విషయాన్ని గమనించాలి. బుక్ రీడింగ్ హాబీకి సంబంధించి నిర్దిష్టంగా ఒక రచయిత పేరును పేర్కొన్న అభ్యర్థులు.. సదరు రచయిత ప్రచురణల్లో ముఖ్యమైనవి, వాటిలో పేర్కొన్న ముఖ్యమైన కొటేషన్లు, సదరు రచన సారాంశం వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. సదరు రచయిత రాసిన ఫలానా పుస్తకం చదివారా? అందులో మీకు బాగా నచ్చిన అంశం ఏంటి? లేదా అందులో వివాదాస్పదమైన అంశం ఏంటి? వంటి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది.

బలాలు, బలహీనతలు

అభ్యర్థులు వ్యక్తిగత బలాలు, బలహీనతల విషయంలోనూ జాగ్రత్తగా అడుగులు వేయాలి. సివిల్ సర్వీస్ ఆఫీసర్ అంటే..ఒక విభాగానికి, లేదా ఒక ప్రాంతానికి పూర్తి స్థాయి అధికారిక పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అలాంటి సందర్భంలో వ్యక్తిగత లక్షణాలు కూడా కీలకంగా నిలుస్తాయి. అందుకే ఇటీవల కాలంలో అభ్యర్థుల వ్యక్తిగత బలాలు, బలహీనతలకు సంబంధించిన ప్రశ్నలు కూడా ఎదురవుతున్నాయి. కాబట్టి అభ్యర్థులు తమ బలహీనతల గురించి చెప్పేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. 'అగ్రెసివ్‌నెస్', 'సహనం తక్కువ' వంటివి చెప్పకపోవడమే మేలు.

సూటిగా, స్పష్టంగా

ఇంటర్వ్యూలో అభ్యర్థుల వ్యక్తిగత వ్యవహార శైలి కూడా విజయాన్ని నిర్దేశిస్తుంది. ప్రధానంగా అభ్యర్థులు తమ అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా చెప్పగలిగే నేర్పును అలవర్చుకోవాలి. ఇందుకోసం తమ అభిప్రాయాలను బలపరిచే అంశాలను ఉదహరించేలా వ్యవహరించాలి. సానుకూల లేదా ప్రతికూల అభిప్రాయం ఏదైనా సరే తమ అభిప్రాయాన్ని ఎదుటి వారిని మెప్పించే రీతిలో సూటిగా చెప్పాలి. వ్యవహార శైలి పారదర్శకంగా ఉండాలి. అంతేకాకుండా సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్ కొన్నిసార్లు చర్చ రూపం కూడా సంతరించుకోవచ్చు. ఇంటర్వ్యూ అంటే కేవలం ప్రశ్న, సమాధానం అనే కోణంలోనే కాకుండా.. ఒక చర్చా వేదికగానూ భావించి ముందడుగు వేయాలి.

ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్

గత కొన్నేళ్లుగా ఇంటర్వ్యూల శైలిని పరిగణనలోకి తీసుకుంటే బోర్డ్ సభ్యులు.. అభ్యర్థుల్లోని ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఉదాహరణకు..'మీరు ఒక ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. ఆ ప్రాంతంలో ఫలానా సమస్య ఎదురైంది? దీనికి తక్షణ పరిష్కారంగా మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?' వంటివి. ఇలాంటి వాటికి..ప్రభుత్వ విధానాలను గౌరవిస్తూ.. రాజ్యాంగానికి అనుగుణంగా పరిష్కార చర్యలు చేపడతామనే విధంగా సమాధానాలు చెప్పాలి.

వస్త్రధారణ

ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు వ్యక్తిగత ఆహార్యంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలి. పురుష అభ్యర్థులు లైట్ కలర్ షర్ట్స్ ధరించడం హుందాగా ఉంటుంది. అదే విధంగా మహిళా అభ్యర్థులు శారీ, లేదా సల్వార్ కమీజ్‌లను ధరించి ఇంటర్వ్యూకు హాజరవడం సదభిప్రాయం కలిగేలా చేస్తుంది. ఇంటర్వ్యూ సమయంలో సమాధానాలిచ్చేటప్పుడు బాడీ లాంగ్వేజ్ కూడా ఎంతో ముఖ్యం. హావభావాలను నియంత్రించుకోవాలి.

ప్రాక్టికల్ అప్రోచ్

సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్‌లో ప్రధానంగా అభ్యర్థుల్లోని ప్రాక్టికల్ అప్రోచ్‌ను పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా పాలన దక్షతను, నాయకత్వ లక్షణాలను కూడా పరీక్షిస్తారు. నిర్దిష్టంగా ఒక సమస్య పట్ల స్పందించే తీరు, నిర్ణయాలు తీసుకునే విధానం వంటి వాటిని పరిశీలిస్తారు. ఈ నైపుణ్యాలు పెంచుకోవాలి.

ఇంటర్వ్యూ మార్కులే కీలకం

మొత్తం 2025 మార్కులకు నిర్వహించే మూడంచెల సివిల్స్ ఎంపిక ప్రక్రియలో ఇంటర్వ్యూకు కేటాయించిన 275 మార్కులు తుది జాబితాలో నిలిపేందుకు అత్యంత కీలకంగా మారుతున్నాయి. కారణం.. ఇంటర్వ్యూ అంతా ముఖాముఖి విధానంలో ఉండడం, బోర్డ్ సభ్యులు అడిగిన ప్రశ్నలు లేదా ఆయా అంశాలపై అవగాహనను, వ్యక్తిత్వ లక్షణాలను పరిశీలించే విధంగా ఇంటర్వ్యూ జరగడమే. ఈ విషయంలో ఏ మాత్రం తడబాటుకు గురైనా.. కొద్ది మార్కుల తేడాతో విజయం చేజారే ప్రమాదం లేదా కోరుకున్న సర్వీసు రాకపోయే పరిస్థితులు ఏర్పడతాయి. కాబట్టి ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులు అన్ని కోణాల్లో నైపుణ్యాలు సొంతం చేసుకునే దిశగా ఇప్పటి నుంచే కృషి చేయాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
242	94
71,107	21,349

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	14,993	▲	29
డోజోన్స్	37,386	▼	18
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,698	▲	3
డాక్స్	16,706	▲	19
షాంఘై	2,915	▼	4
నికాయ్	33,169	▲	29

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.85	83.87
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.49	107.06
€	యూరో	ఎస్‌బీఐ	90.53	92.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.84	59.17
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.55	57.53
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.02	63.51
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.74	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.55	12.62

ఆస్తుల బదిలీ.. ఇలా ఈజీ!



కుటుంబ సభ్యుల ఆర్థిక భద్రత ప్రతి ఒక్కరికీ ప్రథమ ప్రాధాన్యంగా ఉండాలి. జీవితాంతం ఎంతో కష్టించి, ఆస్తులు, సంపద కూడబెట్టుకోవడంతోనే సరికాదు. తమ వారికి సాఫీగా బదిలీ అయ్యేలా చర్యలు తీసుకున్నప్పుడే ఆకాంక్ష ఫలిస్తుంది. ఒక ఆస్తికి ఒకటికి మించిన వారసులు ఉంటే పంపకం సమస్యగా మారకూడదు. క్లిష్టమైన కుటుంబ నిర్మాణం ఉన్న వారు ఈ విషయంలో ముందుచూపుతో వ్యవహరించాల్సిందే. దురదృష్ట వశాత్తూ తమకు ఏదైనా జరిగితే, తమ పేరిట ఉన్న ఆస్తులు వారసులకు సాఫీగా బదిలీ అయ్యేది ఎలా? ఆస్తులకు సంబంధించి వివాదాలు ఏర్పడకుండా చూసుకునేది ఎలా..? ఎస్టేట్ (ఆస్తి) ప్లానింగ్ ఇందుకు పరిష్కారం అవుతుంది. వీలునామా రాస్తే సరిపోతుందిలే అనుకోవద్దు. దీనికంటే మెరుగైనది కుటుంబ ట్రస్ట్. ఆస్తులనే కాకుండా, కుటుంబ వ్యాపారాల సాఫీ పంపిణీ సైతం ఎస్టేట్ ప్లానింగ్‌తో సాధ్యపడుతుంది.



ప్రతి ఒక్కరికీ ఎస్టేట్ ప్లానింగ్ ఉండాలి

- ఇందులో ఫ్యామిలీ ట్రస్ట్ మెరుగైనది
- ఆస్తుల నిర్వహణ, బదిలీ సులభం
- వీలునామాలో కొన్ని ప్రతికూలతలు
- కోర్టుల్లో సవాలు చేయవచ్చు
- వివాదాలు వద్దనుకుంటే ప్రణాళిక అవసరమే



ఎస్టేట్ ప్లానింగ్ అంటే..?

ఆస్తుల పంపకాన్నే ఎస్టేట్ ప్లానింగ్‌గా చెబుతారు. తమ మరణానంతరం కుటుంబ సభ్యులకు ఆస్తులు ఎలా పంపిణీ చేయాలన్నది ఇందులో ఉంటుంది. తమ ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటే కుటుంబ వ్యాపారానికి ఎవరు నాయకత్వం వహించాలి? అనే వివరాలు కూడా ఇందులో భాగమే. ప్లాట్లు, ఇళ్లు, పొలాలు, బంగారం, ఆభరణాలు, బ్యాంక్ బ్యాలన్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు అన్నింటికీ ఇందులో చోటు ఉంటుంది. కాయిన్లు, పెయింటింగ్‌లు తదితర అన్నింటి పంపిణీని ఎస్టేట్ ప్లానింగ్‌తో సులభతరం చేసుకోవచ్చు.

ట్రస్ట్ ఏర్పాటు

కొన్ని కుటుంబాల నిర్మాణం సంక్లిష్టంగా ఉంటుంది. అలాగే, కొన్ని పెద్ద కుంటుంబాలు ఉంటాయి. మొదటి వివాహం ద్వారా పిల్లలు ఉండి, తర్వాత రెండో వివాహం ద్వారా పిల్లలు కన్న వారికి ఆస్తుల పంపిణీలో సహజంగా వివాదాలు ఏర్పడుతుంటాయి. అలాగే, ప్రత్యేక అవసరాల (దివ్యాంగులు) వారూ ఉండొచ్చు. అలాంటి వారికి ఆస్తుల పంపిణీని తమ ఇష్ట ప్రకారం చేసుకోవాలంటే అందుకు వీలునామా లేదా ఫ్యామిలీ ట్రస్ట్ మార్గాలవుతాయి. తమ సంపద సాఫీగా బదిలీ అయ్యేందుకు ట్రస్ట్ వీలు కల్పిస్తుంది. ట్రస్ట్ అంటే ధర్మనిధి. ట్రస్ట్ ఏర్పాటు చేసే వ్యక్తికి, ధర్మ కర్తలకు మధ్య ఒప్పందమే ట్రస్ట్ డీడ్. దీని ద్వారా తనకు సంబంధించిన ఆస్తులను ధర్మకర్తలకు అప్పగిస్తారు. ట్రస్ట్ ఏర్పాటు చేసిన వ్యక్తి మరణానంతరం ట్రస్ట్ డీడ్‌లో పేర్కొన్న విధంగా ఆస్తుల బదిలీ పూర్తి చేయాల్సిన బాధ్యత ట్రస్ట్ నిర్వాహకులపై ఉంటుంది. ట్రస్ట్ ఏర్పాటు చేయాలని అనుకునే వారు ట్రస్ట్ డీడ్ రాయాల్సి ఉంటుంది. సంపదను ఎలా బదిలీ చేయాలన్నది అందులో స్పష్టంగా పేర్కొనాలి. స్థిర, చరాస్తులను ట్రస్ట్‌కు బదిలీ చేయాలి. ట్రస్ట్ డీడ్ రాసిన తర్వాత దాని నిర్వహణకు ట్రస్టీ (ధర్మకర్త)ని నియమించాలి. స్టాంప్ డ్యూటీ చెల్లించి, ట్రస్ట్‌ను రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రిజిస్టర్ చేసుకోవాలి. ట్రస్ట్ ఏర్పాటు ఉద్దేశాన్ని ట్రస్ట్ డీడ్ తెలియజేయాలి. దీని ఏర్పాటు ఉద్దేశం, ఎలా పనిచేయాలన్నది స్పష్టంగా పేర్కొనాలి. ట్రస్టీ లేదంటే ట్రస్టీలుగా ఎవరిని నియమించాలి? అన్న సందేహం రావచ్చు. స్నేహితులు లేదా బంధువులను ట్రస్టీలుగా నియమించుకోవచ్చు. లేదా కార్పొరేట్ సంస్థను అయినా ట్రస్టీగా నియమించొచ్చు. కొన్ని కార్పొరేట్ సంస్థలు ట్రస్ట్ సేవలను అం దిస్తున్నాయి. ట్రస్ట్ వ్యవస్థాపకుడు మరణించినా లేదా తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురైన సందర్భాల్లో ఆస్తులను ఎలా వినియోగించుకోవాలన్న సూచనలను ట్రస్ట్ డీడ్‌లో పేర్కొనొచ్చు. అలాగే, ధర్మకర్త జీవించి లేకపోయినా లేక రిటైర్మెంట్ తీసుకున్నా.. తదుపరి ట్రస్టీగా ఎవరు వ్యవహరించాలన్నది కూడా టస్ట్ డీడ్‌లో పేర్కొనాలి.



ఎవరికి అవసరం..?

నిజానికి ఎస్టేట్ ప్లానింగ్ లేదా వీలునామా అనేవి సంపన్నులకేనన్న ఒక అపోహ నెలకొంది. ఇది నిజం కాదు. ప్రతి ఒక్కరికీ ఇది ఎంతగానో సాయపడుతుంది. తమ పేరిట ఆస్తులు ఉన్నా, లేదా అప్పులు ఉన్నా సరే ఎస్టేట్ ప్లానింగ్‌తో వారసులకు మార్గం స్పష్టంగా మారుతుంది. అకాల మరణం ఎదురైతే, తమ పేరిట ఉన్న ఆస్తులు ఎలా పంచాలి? అప్పులు ఎలా తీర్చాలి? ఏ ఆస్తి విక్రయించి అప్పు చెల్లించాలి? వీటికి ఎవరు బాధ్యత వహించాలి? ఇలాంటి వాటికి స్పష్టత ఇవ్వొచ్చు. నిజానికి మనలో 90 శాతం మంది ఆస్తులకు సంబంధించి భవిష్యత్ ప్రణాళిక గురించి ఆలోచించరు. వీలునామా కూడా రాయరు. తాము క్షేమంగా ఉన్నందున, మరణం గురించి చర్చించడం, ఆస్తులపై చర్చను కోరుకోకపోవడం వల్ల ప్రణాళికకు దూరంగా ఉంటుంటారు. నిజానికి ఎంతో ముఖ్యమైన ఈ పనిని ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేయకూడదు. దీని వల్ల ఉపయోగాలే కానీ, నష్టం ఉండదు. కనుక ప్రతి ఒక్కరూ దీనికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్గాలు..

నామినేషన్, వీలునామా (విల్లు), ఫ్యామిలీ ట్రస్ట్ ఇవన్నీ ఎస్టేట్ ప్లానింగ్‌లో పలు రకాల సాధనాలు. ఆర్థిక సాధనాలకు నామినేషన్ సదుపాయం ఉంటుంది. సంబంధిత ఆస్తి ఎవరికి వెళ్లాలని అనుకుంటే వారి పేరును నామినీగా నమోదు చేసుకోవచ్చు. కానీ, అన్నింటికీ నామినేషన్ సదుపాయం ఉండదు. ముఖ్యంగా స్థిరాస్తులకు నామినేషన్ చేసుకోలేరు. కనుక అన్నింటికీ పరిష్కారంగా ఫ్యామిలీ ట్రస్ట్ అక్కరకు వస్తుంది. ఇలాంటి ఏర్పాట్లు ఏవీ లేకుండా ఓ కుటుంబ యజమాని మరణించిన సందర్భాల్లో లేదా వారసులు కాని వ్యక్తి నామినీగా ఉండి వివాదాలు ఏర్పడిన సందర్భాల్లో.. ఆస్తుల పంపిణీ అన్నది ఆయా మతస్థుల వారసత్వ చట్టం ప్రకారం చేసుకోవాల్సి వస్తుంది. దీనికి కోర్టులను ఆశ్రయించాల్సిందే. హిందూ వారసత్వ చట్టం ప్రకారమైతే మరణించిన వ్యక్తి జీవిత భాగస్వామి, అతని తల్లి, పిల్లలకు సమానంగా ఆస్తులు బదిలీ చేసుకోవాలి. ఈ విషయంలో వివాదం ఏర్పడితే అప్పుడు పరిష్కారానికి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది.

ఇది నిజం కాదు..

ట్రస్ట్ ఏర్పాటు చేస్తే, తమ ఆస్తులన్నీ ట్రస్టీ నిర్వహణలోకి వెళ్లిపోతాయని, వాటిపై తాము నియంత్రణ కోల్పోతామనే అపోహ ఉంది. ట్రస్ట్ ఏర్పాటు చేసి, దానికి తమ ఆస్తులను బదిలీ చేసిన తర్వాత అప్పుడు ట్రస్టీయే యజమాని అవుతారు. నిజానికి ట్రస్ట్ డీల్‌లో పేర్కొన్న మేరకు బాధ్యతలను నిర్వహించడమే ట్రస్టీ పని. అంతేకానీ, సంబంధిత ట్రస్ట్ నిర్వహణలోని ఆస్తులను వినియోగించుకునే, అనుభవించే హక్కులు ట్రస్టీలకు ఉండవు. కేవలం ట్రస్ట్ డీడ్‌లో పేర్కొన్న లబ్ధిదారుల ప్రయోజనాల కోసమే ఆ ఆస్తులను వినియోగించాల్సి ఉంటుంది. ట్రస్ట్ ఏర్పాటు చేసిన వారు జీవించి ఉన్నంత వరకు బదిలీ చేసిన ఆస్తులు, ట్రస్ట్ కార్యకలాపాలపై పూర్తి నియంత్రణ కలిగి ఉంటారు. నేడు పలు ప్రొఫెషనల్ ట్రస్ట్ ఏజెన్సీలు ట్రస్టీ సేవలను అందిస్తున్నాయి. అవి ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరిస్తాయి. ట్రస్ట్ డీడ్‌కు పూర్తి స్థాయి నిర్వాహకుడి మాదిరే పనిచేస్తాయి.

వీలునామా.. కోర్టు విచారణలు!



వీలునామా గురించే ఎక్కువ మందికి తెలుసు. సులభమైన, మెరుగైన సాధనమని చాలా మంది భావిస్తుంటారు. అయితే ఇందులో కొన్ని ప్రతికూలతలు లేకపోలేదు. వీలునామా రిజిస్టర్ చేసినా, చేయకపోయినా దాన్ని కోర్టుల్లో సవాలు చేయవచ్చు. వీలునామా అనేది కేవలం వ్యక్తి మరణానంతరం అమల్లోకి వచ్చే పత్రం. వైకల్యం లేదా తీవ్ర అనారోగ్యం బారిన పడిన సందర్భాల్లో వీలునామా పని చేయదు. మరణించిన వ్యక్తి ఆస్తుల బదిలీకి సంబంధించినదే కానీ, ఆ ఆస్తుల నిర్వహణకు సంబంధించినది కాదు. వీలునామా కింద లబ్ధిదారులు హక్కులను కోర్టులో నిరూపించుకోవాల్సి వస్తుంది. ఇందుకు ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టొచ్చు. అప్పటి వరకు ఆ ఆస్తులను వినియోగించుకోవడానికి వీలు పడదు. మోసం, ఫోర్జరీ, ఒత్తిడితో రాయించినట్టు లేదా మానసిక వైకల్యంతో బాధపడుతున్న సమయంలో రాయించినట్టు, తెలియకుండా రాయించుకున్నట్టు తదితర ఆరోపణలపై వీలునామాను కోర్టులో సవాలు చేయవచ్చు. వీలునామాను రిజిస్టర్ చేసినంత మాత్రాన అది చట్టబద్ధంగా చెల్లుబాటు అయిపోతుందని అనుకోవడం పొరపాటు. రిజిస్టర్ చేయించిన వీలునామా సైతం కోర్టుల విచారణ పరిధిలోకి వస్తుంది. మనదేశంలో ఎస్టేట్ ప్లానింగ్ కోసం హిందు అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) ఏర్పాటును కొంత మంది అనుసరిస్తుంటారు. ఇది పన్నుకు సంబంధించిన ప్రత్యేక ఏర్పాటు. ఒక్కసారి హెచ్‌యూఎఫ్ రిజిస్టర్ చేసి, ఆస్తులు దానికి బదలాయించారంటే.. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు దఖలు పడతాయి. హెచ్‌యూఎఫ్ పరిధిలోని ఆస్తులను విభజించడం వివాదాలు, కోర్టు కేసులకు దారితీయవచ్చు. వీటన్నింటిలోకి మెరుగైనది ఫ్యామిలీ ట్రస్ట్.

పిల్లలకు కూడా..

మైనర్ చిన్నారులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు ఎస్టేట్ ప్లానింగ్ ప్రయోజనకరంగా ఉంటుంది. తాము లేని రోజున తమ పిల్లల బాధ్యతను బంధువులపై మోపడం.. వారు చూస్తారని ఆశించడం అన్ని సందర్భాల్లో సరైనది అనిపించుకోదు. ఇది పూర్తిస్థాయి, పెద్ద బాధ్యత. ట్రస్ట్ ఏర్పాటు చేసి, దాని నిర్వహణ బాధ్యతను కార్పొరేట్ ట్రస్టీకి అప్పగించడం మెరుగైనది అవుతుంది. కార్పొరేట్ ట్రస్టీ అయితే.. ప్రత్యేక అవసరాల పిల్లలకు (దివ్యాంగులు) పూర్తి సమయం పాటు సహాయకుడు/సహాయకురాలిని అందుబాటులో ఉంచుతారు. అలాగే వంట మనిషి, వైద్య సాయం సహాయకులు, స్పెషలిస్ట్ డాక్టర్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. పిల్లలు సాధారణంగా తమ హక్కులను క్లెయిమ్ చేసుకోలేరు. అందుకని వీలునామా రాస్తే, దాని నిర్వహణ బాధ్యతను ఒకరికి అప్పగించాల్సి వస్తుంది. అందుకే వీలునామాలో ఉన్న ప్రతికూలతల దృష్ట్యా పిల్లల కోసం ఫ్యామిలీ ట్రస్ట్ మెరుగైనది అవుతుంది.



సాక్షి ప్లస్

స్టార్ హెల్త్ | జియోజిత్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 524 టార్గెట్: రూ. 653

ఎందుకంటే: 2006లో కార్యకలాపాలు ప్రారంభించిన స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్.. దేశీయంగా తొలి స్టాండెలోన్ ఆరోగ్య బీమా రంగ కంపెనీ. ఆరోగ్యం, వ్యక్తిగత ప్రమాద బీమా సేవలకు తోడు.. దేశ, విదేశీ ప్రయాణ బీమా ప్రొడక్టుల (సర్వీసులు)ను సమకూరుస్తోంది. 14,200 ఆసుపత్రులతో ఒప్పందం ద్వారా భారత్‌లో అతిపెద్ద ఆరోగ్య బీమా సర్వీసుల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికం (క్యూ2)లో నికర ఆర్జనా ప్రీమియం (ఎన్‌ఈపీ)వార్షికంగా దాదాపు 15% జంప్‌చేసి రూ. 3,206 కోట్లకు చేరింది. ఇందుకు రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ విభాగం సాధించిన రెండంకెల వృద్ధి దోహదపడింది. దీంతో కంబైన్‌డ్ రేషియో వార్షిక ప్రాతిపదికన 1.3 శాతం మెరుగుపడి 99.2 శాతాన్ని తాకింది. రిటైల్ హెల్త్ ప్రీమియంలో పటిష్ట పురోగతి, కొత్త ప్రొడక్టుల విడుదల, డిజిటలైజేషన్‌పై నిలకడైన దృష్టి, విస్తారిత పంపిణీ నెట్‌వర్క్, కొత్త బ్యాంకస్యూరెన్స్ భాగస్వామ్యాలు (పాలసీల విక్రయంలో బ్యాంకులతో ఒప్పందాలు), మెరుగైన సాల్వెన్సీ రేషియో వంటి అంశాలు భవిష్యత్‌లో కంపెనీ పటిష్ట పనితీరు చూపేందుకు సహకరించనున్నాయి. డిజిటలైజేషన్ బాటలో ఇటీవల డైనమిక్ యూపీఐ క్యూఆర్ కోడ్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థను ప్రవేశపెట్టింది. తద్వారా కొత్తగా హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు లేదా హెల్త్ పాలసీ కొనసాగింపు (రెన్యువల్)ను సులభంగా చేపట్టేందుకు వీలును కల్పించింది. రిటైల్ హెల్త్ విభాగంలో 33% వాటాతో మార్కెట్ లీడర్‌గా కంపెనీ నిలుస్తోంది.



హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 640 టార్గెట్: రూ. 740


ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో విభా పడాల్కర్‌తో పాటు.. సీఎఫ్‌వో నీరజ్ షాతో ఇటీవలే సమావేశమయ్యాం. తద్వారా కంపెనీలో వృద్ధికి సంబంధించి చోటు చేసుకుంటున్న కీలక అంశాలు, మొత్తంగా జీవిత బీమా రంగంలో పరిస్థితులు తదితరాలపై అభిప్రాయాలకు తెరతీశారు. వీటి ప్రకారం కంపెనీ మార్కెట్‌లో తనకున్న వాటాను మరింత సుస్థిరం చేసుకోనుంది. ఇందుకు వ్యూహాత్మకంగా టెక్నాలజీ వినియోగం, కస్టమర్‌కు సేవల అందుబాటు (ఎక్స్‌పీరియన్స్), బ్రాండ్‌ను పటిష్టపరచుకోవడం, సిబ్బంది అందించే ప్రత్యేక సర్వీసులు వంటివి సహకరించనున్నాయి. వీటికితోడు కొత్త ప్రొడక్టుల విడుదల జత కలవనుంది. బీమా రంగ బిల్లులో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, సవరణలు ఆరోగ్య బీమా విభాగానికి ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. వీరి అభిప్రాయం ప్రకారం కస్టమర్ల ఆరోగ్య బీమా అవసరాలకు తాజా బిల్లు తగిన మార్గాలను చూపనుంది. వెరసి కొత్త ప్రొడక్టులను రూపొందించడం, కస్టమర్లకు అనుగుణమైన సర్వీసులందించడం తదితర అంశాలలో బీమా రంగ కంపెనీలకు మరింత వెసులుబాటు లభించనుంది. ఇది దేశీయంగా బీమా సేవల వ్యవస్థ మరింత వేళ్లూనుకునేందుకు తోడ్పాటునివ్వనుంది. రూ. 5 లక్షలలోపు పాలసీలలో 15–17 శాతం చొప్పున వృద్ధి నమోదవుతోంది. అయితే అధిక టికెట్ పరిమాణంగల పాదుపు పాలసీలు తగ్గడంతో సర్దుబాటు ప్రాతిపదికన ఈ ఏడాది (2023–24) మొత్తం వార్షిక ప్రీమియం (ఏపీఈ) 12–13 శాతం చొప్పున పుంజుకునే వీలుంది. మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చానల్ ద్వారా 60 శాతం అమ్మకాలను సాధిస్తుండటం కంపెనీకి కలిసొచ్చే అంశం!



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఇన్ఫోసిస్‌కు షాక్..

1.5 బిలియన్ డాలర్ల కాంట్రాక్టు రద్దు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా అనిశ్చితితో టెక్ కంపెనీలకు సవాళ్లు ఎదురుతున్న తరుణంలో దేశీ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు ఒక అంతర్జాతీయ క్లయింట్ షాకిచ్చింది. 1.5 బిలియన్ డాలర్ల విలువ చేసే మెగా కాంట్రాక్టును రద్దు చేసుకుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇన్ఫీ దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం సదరు సంస్థకు ఇన్ఫోసిస్ డిజిటల్, వ్యాపార ఆధునీకరణ తదితర సేవలు అందించాలి. మాస్టర్ అగ్రిమెంటుకు లోబడి క్లయింటు 15 ఏళ్లలో మొత్తం 1.5 బిలియన్ డాలర్లు వెచ్చిస్తుందని అప్పట్లో ఇన్ఫీ తెలిపింది. తాజాగా ఎంవోయూ రద్దు కావడంతో ఈ విషయంలో ముందుకెళ్లడం లేదని ఇన్ఫోసిస్ వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-12-2023	
విశాఖ	615-00
చిత్తూరు	623-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	610-00
విజయవాడ	610-00
రిటైల్ ధర (డజను)	72.00
24-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	594-00
వరంగల్	596-00
రిటైల్ ధర	6.55

అసెట్ అలొకేషన్ అంటే ఇదేనా..?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా దగ్గరున్న మొత్తంలో 60 శాతాన్ని బ్యాంకు ఎఫ్‌డీలలో ఇన్వెస్ట్ చేశాను. మిగిలిన 40 శాతం మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టాను. ఇప్పుడు చూస్తే ఈక్విటీ పెట్టుబడుల విలువ గణనీయంగా పెరిగింది. దీంతో ఈక్విటీలకు 50 శాతం, ఎఫ్‌డీల్లో 50 శాతం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. అసెట్ అలొకేషన్ అంటే.. 50 శాతం మించి ఈక్విటీలలో ఉన్న మొత్తాన్ని వెనక్కి తీసుకుని ఫిక్స్‌డ్ డిపాజిట్లలోకి మళ్లించడమేనా?

– ఎస్‌కే సిన్హా

అసెట్ రీబ్యాలన్స్ అంటే ఒక లక్షిత కేటాయింపుల విధానాన్ని అనుకుని.. ఆ మేరకు పెట్టుబడుల మొత్తాన్ని వివిధ పెట్టుబడి సాధనాల మధ్య వర్గీకరించడం. ఒకే కాల వ్యవధిలో కొన్ని సాధనాలు మంచి పనితీరు చూపించడం వల్ల వాటిల్లోని పెట్టుబడుల విలువ ఇతర సాధనాలతో పోలిస్తే గణనీయంగా పెరగొచ్చు. దీంతో అలా మంచి పనితీరు చూపించిన వాటి వెయిటేజీ పెరిగిపోతుంది. అప్పుడు ముందు అనుకున్న కేటాయింపులకు మించి, ఎంత అయితే పెరిగిందో ఆ మొత్తాన్ని తగ్గించుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో పోర్ట్‌ఫోలియోలో వెయిటేజీ పడిపోయిన సాధనాలకు ఆ మేరకు కేటాయింపులు పెంచుకోవాలి. అసెట్ రీబ్యాలన్సింగ్ వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి. మీ రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా పెట్టుబడుల మధ్య సమతూకాన్ని కొనసాగించుకునే వెసులుబాటు ఈ విధానంతో వస్తుంది. అంటే ఈక్విటీకి 60 శాతం, డెట్‌కు 40 శాతం కేటాయింపులతో అసెట్ అలొకేషన్ విధానాన్ని నిర్ణయించుకున్నారని అనుకుందాం. కొంత కాలం తర్వాత మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీ వాటా 80 శాతానికి చేరి డెట్ పెట్టుబడులు 20 శాతానికి తగ్గాయని అనుకుంటే.. అప్పుడు మీ పోర్ట్‌ఫోలియోలో రిస్క్ పెరిగినట్టు అవుతుంది. ఎందుకంటే ఎక్కువ మొత్తం ఈక్విటీల్లో ఉండడంతో మార్కెట్ల ఉద్దాన, పతనాల ప్రభావం పెట్టుబడుల విలువపై ప్రతిఫలిస్తుంటుంది. ఇది పెట్టుబడిదారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవచ్చు. ఎక్కువ రిస్క్ తీసుకోవద్దని అనుకునే ఇన్వెస్టర్లు ఈక్విటీల పెట్టుబడులను 60 శాతానికి తగ్గించుకుని, డెట్ పెట్టుబడులు 40 శాతానికి అసెట్ రీఅలొకేషన్‌తో పెంచుకోవడం వల్ల తిరిగి వారి విధానానికి తగ్గట్టు పెట్టుబడుల స్వరూపం ఉంటుంది. అసెట్ రీబ్యాలన్సింగ్‌తో ఉన్న మరొక ప్రయోజనాన్ని చూస్తే.. అధిక స్థాయిల్లో విక్రయించి, తక్కువలో కొనుగోలు చేయడం సాధ్యపడుతుంది. అంటే విలువ గణనీయంగా పెరిగిన చోట విక్రయించి.. అదే సమయంలో పెద్దగా పెరగని చోట కొనుగోలు చేస్తాం. ఉదాహరణకు పెట్టుబడుల్లో ఈక్విటీల వాటా పెరిగిందంటే.. ఈక్విటీలు బాగా ర్యాలీ చేశాయని అర్థం. దాంతో అసెట్ రీఅలొకేషన్ విధానంలో భాగంగా అధిక వ్యాల్యూషన్ల వద్ద పెట్టుబడులను కొంత వెనక్కి తీసుకుని డెట్‌కు మళ్లిస్తాం. తరచుగా కాకుండా.. ఏడాదికోసారి లేదంటే.. ఒక పెట్టుబడి సాధనంలోని పెట్టుబడుల విలువ నిర్దేశిత పరిమితి కంటే 5 శాతానికి మించి పెరిగిపోయిన సందర్భాల్లోనే దీన్ని చేయడం సూచనీయం.



నా వయసు 72 ఏళ్లు. నేను ఈక్విటీ ఆధారిత హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం సురక్షితమేనా? లేదంటే సంప్రదాయ లేదా బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ ఎంపిక చేసుకోవాలా?

– భాస్కర్

ఈక్విటీ మార్కెట్ల అస్థిరతలను ఎదుర్కోవడంలో మీకున్న అనుభవం ఏ మేరకు? అనే దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. ఈక్విటీల్లో ముందు నుంచి ఇన్వెస్ట్ చేస్తూ మూడేళ్లకు పైగా అనుభవం ఉండి, మార్కెట్లలో ఎత్తు, పల్లాలను (ర్యాలీలు, దిద్దుబాట్లు) చూసి ఉన్నట్టయితే అప్పుడు అక్విటీ ఆధారిత ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే మొత్తం నుంచి ఆదాయం కోరుకోకుండా, పెట్టుబడి కోసమే అయితే అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఈక్విటీ పెట్టుబడుల్లో ఎటువంటి అనుభవం లేకుండా, చేసే పెట్టుబడిపై ఆదాయం కోరుకుంటుంటే అప్పుడు కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.



క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విజయవాడలో విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్న సెయింట్ పాల్ కథడ్రిల్ చర్చి, సెయింట్ పీటర్స్ చర్చి. బాలయేసు స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు తదితరులు, ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు.







జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఏపీ బాలికల విజయ పతాక

సెపక్‌తక్రా పోటీల్లో ఏపీ జట్టుకు రెండో బహుమతి



ట్రోఫీ అందుకున్న ఏపీ బాలికల జట్టు

సాక్షి, అమరావతి: ఈ నెల 16 నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతోన్న 67వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో సెపక్‌తక్రా అండర్–14 బాలికల విభాగంలో ఏపీ జట్టు ద్వితీయ బహుమతిని సాధించింది. జట్టులో పశ్చిమగోదావరి జిల్లా చిన్నాయిగూడెం జెడ్పీ స్కూల్ విద్యార్థిని పాక దుర్గా మధురశ్రీ, తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి జెడ్పీ స్కూల్ విద్యార్థిని కొల్లేపల్లి వర్షిణి, విజయవాడలోని పటమట జెడ్పీ స్కూల్ విద్యార్థిని ఊయల కావ్య, అనంతపురం జిల్లా ఉరవకొండలోని శ్రీ మహేశ్వరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థిని మిడతల వైష్ణవి, కర్నూలు జిల్లా కల్లూరులోని మాంటిసోరి ఇండస్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి గుడికల్ సన్విత తమ ప్రతిభతో పోటీలో రాణించారు. విజేతలను పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు అభినందించారు. కాగా, 2 రోజుల క్రితం అండర్–17 బాలుర బాడ్మింటన్ పోటీల్లో ఏపీ జట్టు రెండో స్థానంలో నిలిచింది.



ఆకట్టుకున్న బాల ఏసు సైకతం

క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆదివారం తిరుపతి జిల్లాలోని చిల్లకూరు తీర ప్రాంతంలోని ఏరూరు చర్చి వద్ద ఏర్పాటు చేసిన బాల ఏసు క్రీస్తు సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. దీన్ని గ్రామానికి చెందిన సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్...ఏసు క్రీస్తు ప్రభువు పుట్టుకకు సంబంధించి తల్లి మరియ, బాల ఏసు సైకత శిల్పాన్ని రూపొందించాడు. – చిల్లకూరు (తిరుపతి జిల్లా)

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.